- శ్రీమహాభాగవతం – భక్తియోగం
- మను చరిత్ర – పాఠ పరిష్కరణ
- బయో పాలిటిక్స్ సిద్ధాంత నేపథ్యంలో 'వెలుగు దారులలో...'
- నీతి శాస్త్రము – తాళపత్ర గ్రంథము
- బందారం కథలు – భాషా విశేషాలు
- తెలంగాణ సాంస్కృతిక చిత్తరువు
- గురజాడ 'సుభద్ర' కావ్యం – పరిశీలన
- రేఖల్లో మూలాలు

# మూసీ
# MUSI


Samputi : 28 • Sanchika : 04 • Pages : 64 • Rs. 20
• February 2025

UGC CARE List
Approved Journal




Scanned with OKEN Scanner






# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన పత్రిక తెలుగు మాసపత్రిక

సంపుటి : 28 సంచిక : 4
ఫిబ్రవరి - 2025
'క్రోధి' మాఘ మాసం

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

UGC APPROVED JOURNAL

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA
సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B. MANOHARI

*Type Setting at :*
Kavyasree Graphics
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com992

## ఈ సంచికలో ... వ్యాసాలు

శ్రీమహాభాగవతం - భక్తియోగం ... డా. పి. వరలక్ష్మి 7
మను చరిత్ర - పాఠ పరిష్కరణ ... టి.ఎన్. వెంకటేశ్ 11
బయో పాలిటిక్స్ సిద్ధాంత నేపథ్యంలో 'వెలుగు దారులలో...' ఆత్మకథ .. ఆచార్య గంపా వెంకటరామయ్య 15
చరిత్రలో ఒక ప్రేమ ఆనవాలు 'నాగలాదేవి' నవల ... ఆచార్య ఎం. గోనానాయక్ 20
నీతి శాస్త్రము - తాళపత్ర గ్రంథము... డా. గంధ్ర లక్ష్మణరావు 23
బందారం కథలు - భాషా విశేషాలు ... డా. వి. శంకర్ 25
తెలంగాణ సాంస్కృతిక చిత్తరువు ... బూర్ల వెంకటేశ్వర్లు 28
గురజాడ 'సుభద్ర' కావ్యం - పరిశీలన ... డా. బోచ్కర్ ఓమ్ప్రకాశ్ 31
తెలుగు ఆకర వెబ్‌సైట్లు - పరిశీలన ... డా. గొల్లపల్లి గణేశ్ 35
రేఖల్లో మూలాలు ... రంగరాజు పద్మజ 38
వికీపీడియా - తెలుగు సాహిత్యం ... మ్యాదం అభిలాష్ 41
కవితామృతమయం ఎన్.గోపి 'రేపటి మైదానం' ... డా. గిన్నారపు ఆదినారాయణ 43
హృదయాన్ని కదిలించే 'రెండు జ్ఞాపకాలు' ... సుప్పని సత్యనారాయణ 47
స్త్రీ జీవన సమరానికి తార్కాణం - వెండిమేఘం ... డా. ఎం. ఫామిద బేగం 49
మనదారి 'మళ్ళీ మనిషి లోకి...' అంటున్న ఉదారి ... మడిపల్లి రాజ్‌కుమార్ 51
విషాదాంత నవలా కావ్యం - జిగిరి ... డా. కె.యన్.వి.వి.యస్. నారాయణ మూర్తి 54

## సమీక్షలు

2025 ఆకాశవాణి 'సర్వభాషా కవి సమ్మేళనం' సమీక్ష ... అయినంపూడి శ్రీలక్ష్మి 57

## కవితలు

వాగీశ్వరీ! శారదా!! ... జి.లింగేశ్వర శర్మ - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; పుస్తకాలు జ్ఞాన ప్రదాతలు ... డా. గన్నోజు శ్రీనివాసాచార్య - 19; నన్నేమి అడగకండి! .. డా. దత్తయ్య అట్టెం - 30; రంగు ... బింగి శ్రీకాంత్ - 34; గంప ... విను - 34; మనుషులు కూడా కాయలు కాస్తారు ... డా. నలిమెల భాస్కర్ - 62

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

*Printed, Published and Owned by :*
**B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు
నీవే వెలుగై వ్యాపించు**





# కారణం

కరోతి కారణం. చేయునది అని అర్థం. హేతువు, బీజార్థాలలో కూడా దీనిని వినియోగిస్తారు. ప్రతి విషయానికి కారణాన్ని అన్వేషించడం మనందరి జీవభాగంగా ఉంది. నిత్యజీవితం నుండి సృష్టిమూలం వరకు కారణాన్వేషణ చేయడం ద్వారా నూతనమైన విషయ జ్ఞానం ఏర్పడుతుంది.

కనిపించే వెలుగుకు సూర్యుడు కారణం. రాత్రి వెలుగులకు చంద్రుడు కారణం. పగలు రాత్రి ఏర్పడటానికి భూభ్రమణం కారణం. ఋతువులు ఏర్పడి భూమిపైన వాతావరణాదుల్లో అనేక మార్పులు ఏర్పడడానికి భూమి పరిభ్రమణం కారణం. కట్టుకునే వస్త్రం ఒకటి ఉంటే దానికి మూలాలను అన్వేషిస్తే కారణం పత్తి అవుతుంది. పత్తి పెరగడానికి రైతు పంట వేయడం కారణం. భూమి, నీరు, సూర్యరశ్మి, వాయువులు వృక్షజాతులు పెరగడానికి కారణం. వాటిలోని ఆ యా శక్తులకు కారణం? విత్తనంలోని బీజానికి కారణం? సూర్యునిలోని తేజస్సుకు కారణం? భూమిలోని ఉత్పాదకశక్తికి కారణం? మనం సంతోషాన్ని, బాధను అనుభవిస్తుంటే దానికి కారణం?

ఇలా కారణాన్వేషణ చేస్తూ పోతే కొంత దూరం వెళ్ళిన తర్వాత మూలం 'శక్తి' 'చైతన్యం'గా అంగీకరించక తప్పడం లేదు. ఒక సినిమా నాకు సంతోషాన్ని కలిగించిందంటే .. అది ఆ సినిమాలోని ప్రత్యేకతనా? అది నాలోని తత్త్వాన్ని ప్రేరేపించిందని గుర్తించాలా? ఆ సంతోషం అందరికీ సమానంగానే ఉందా? అన్ని సమయాల్లోనూ అదే సంతోషం మనం పొందగలుగుతున్నామా? మనం కారణం అనుకునే అంశాలన్నీ ప్రేరేపకాలా? నిజమైన కారణాలా? అనేది ఆలోచించాల్సిన అంశం.

అన్నింటికీ కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, అన్నింటికీ మూలకారణం అన్వేషించడంలో మాత్రం విఫలమవుతూనే ఉన్నాం. ఏదైనా విషయానుభవం మనకు కలుగుతుంటే దానిలోని సంతోష, దుఃఖాలకు కారణం మనమే అయి ఉంటాం. కారణం అంటే చేయునది అనే అర్థం తీసుకున్నా.. ఎప్పుడో మనం చేసిన పనికి ఫలితం ప్రస్తుతం అనుభవిస్తుంటామన్న విషయం అర్థం చేసుకోవడంలో ఇబ్బంది పడుతూనే ఉన్నాం. అన్నింటికీ చుట్టు ప్రక్కల అంశాలను కారణాలుగా గుర్తించడం కోసం ప్రయత్నం చేస్తున్నాం. ఒక అంశం మన అనుభవంలోకి వస్తున్నప్పుడు దానికి కారణం చుట్టూ ఉన్న అంశాలా? మనమా? మరీ మరీ ఆలోచించాలి.

ఒక వైవాహిక జీవనంలో సంతోషం కలిగించే భాగస్వామి లేరు అనుకుంటే.. ఆ భావన పొందుతున్నది ఎవరనేది గమనించాలి. భావన ఎవరు పొందితే వారే ఆ లోపానికి కారణం అవుతుంటారు. రెండవవారు కేవలం దానికి ప్రేరకులు మాత్రమే అవుతారు. శారీరక, మానసిక వ్యాధులు ఏవైనా మనకు ప్రబలంగా ఏర్పడుతున్నాయంటే, వాటికి కూడా కారణం మనమే కదా! ఆశించిన అంశాల్లో ఎంత పొందగలమనేది మన పరిమితిని బట్టే ఉంటుంది కదా! అన్నింటికీ ఇతర ప్రదేశాలలో కారణం వెతుక్కోవడం ఎందుకు?

మన సంతోషానికైనా, సంపాదనకైనా, విషాదానికైనా, లోపానికైనా, గుణానికైనా అన్నింటికీ ఇప్పుడో, ఎప్పుడో మనం చేస్తున్న కర్మలే కారణం అవుతుంటాయి. చేసేరోజున మనం పట్టించుకోం, అనుభవం లోకి వచ్చే సందర్భంలో అది మనకు అర్థం కాదు. ఈ రెండింటి మధ్యలో దూరం అధికం కదా. చెట్టు మొదట్లో నీరు పోస్తే పూలు, పండ్లు కొమ్మల చివర వస్తాయి కదా! అందుకే గుణదోషాలు, ఉన్నతి, పతనాలు అన్నింటికీ మనమే కారణం. మన మనస్సును తగ్గిస్తూ ఉంటే ఈ కారణాలు తగ్గుతాయి. ఆలోచనలు పెరుగుతున్నా కొద్దీ కారణాలు, అన్వేషణలు జరుగుతూనే ఉంటాయి.

# వాగేశ్వరీ! శారదా!!





శ్రీమన్మంగళకారిణీ శశిధరే చిద్రూపిణీ శారదే
సామాంపాతు సరస్వతీ భగవతీ సంస్తూయమానాత్మికే
హేమాలంకృతభాసమాన త్రిపురా హ్రీంకార బీజాక్షరీ
శ్రీమాతాఖిల లోకపావనకరీ శ్రీచక్ర సంచారిణీ

అజ్ఞానమ్మును పారద్రోలి జననీ యానందసంధాయినీ
జిజ్ఞాసన్ కలిగింపజేసి హృదిలో చిద్రూపిణీ భారతీ
విజ్ఞానమ్మును పొందజేయముగదే విశ్వాన శోభిల్లగా
ప్రజ్ఞావంతులుగాను నీదుకృపచే ప్రార్థించెదన్ భక్తితో

హేవీణా వరదండ మండితకరా యిందీవరాలోచనీ
దేవీభారతి బ్రాహ్మి బ్రహ్మసతి దేదీప్యమానఃప్రభా
మావాణిన్ భువినాలకించి గనుమా మాహాత్మ్యమున్ జూపుచు
శ్రీవాణీ సురపూజితాంఘ్రియుగళా శ్వేతాంబరాధారిణీ

వందేజ్ఞానసరస్వతీం భగవతీం వాగీశ్వరీం శారదాం
వందేశ్రీ వరదండమండితకరాం పద్మాసనే సంస్థితాం
వందే గౌతమితీరవాసి జననీం వాగ్దేవతాం భారతీం
వందే వ్యాసపురేశ్వరీం సురనుతాం వందే జగన్మాతరం

వీణాపుస్తకధారిణీ మభయదాం విజ్ఞానసంవర్ధినీ
వీణానాద మృదంగవాద్య రసికాం విద్యాప్రదే శారదే
వాణీభారతి బ్రాహ్మిపద్మనిలయా వాగ్దేవతా నందినీం
జ్ఞానాభీష్ట ప్రదాయినీం భగవతీం జ్ఞానామృతావర్షిణీ

విద్యాబుద్ధులనందజేసి మదిలో విజ్ఞానముం బెంచగా
విద్యోద్యానమునందు వెల్లివిరియన్ విద్యాప్రసూనమ్ములై
విద్యోద్భాసితమై విశాలజగతిన్ విజ్ఞానమున్ నింపవే
విద్యాజ్ఞాన ప్రదాయినీ భగవతీ శ్వేతాంబరాహ్లాదినీ

గీర్వాణీ సకలాగమాదివినుతా గీర్దేవి వాగీశ్వరీ
సర్వాభీష్ట ప్రదాయినీ శశిధరే సంసేవ్యమానాత్మికే
సర్వాలంకృత భూషిణీ భగవతీ జాడ్యాంధకారాపహా
గర్వంబంతయు రూపుమాపమనుచున్ కైమోడ్చి ప్రార్థించెదెన్..

హస్తంబందున పుస్తకమ్ముగలనా యానందసంధాయినీ
అస్తోకామృతశక్తిదాయకములై నా దివ్యనామంబుచే
శస్తంబైన ఫలమ్మొసంగి జననీ సాఫల్యమందించవే
విస్తారమ్మగు జ్ఞానసంపదలనే విజ్ఞానసంవర్ధినీ

శ్రీజ్ఞానామృతవర్షిణీ భగవతీ చిద్రూపిణీ భారతీ
అజ్ఞానమ్మనె యంధకారమననే యంతంబు గావించియున్
ప్రజ్ఞానమ్మును బెంచమంచు జనని ప్రార్థించి పూజించగా
విజ్ఞానాంబుధిలోన మాకొసగవే విద్యాదిగంధంబునే

విద్యాగంధమునొందగోరి బడిలో విద్యార్థులై జేరగా
విద్యాబుద్ధులనందజేసి జననీ విద్యాప్రదే శారదా
సద్యస్స్ఫూర్తిని నందజేసి మదిలో సంస్కారమందించుచున్
ప్రద్యోతించగజేయవే భగవతీ ప్రార్థించగా భక్తితో

వాగ్దేవీ వదనారవిందములనే స్పర్శించి ప్రార్థించెదన్
వాగ్దోషమ్ములనేవిలేక సతమున్ వారించి రక్షించుచున్
వాగ్ధాటిన్ కొనసాగజేసి ఘనమౌ పద్యాలతో వేడగా
వాగ్దివ్యామృతధార నాకొసగవే వాగీశ్వరీ! శారదా!!

**జి. లింగేశ్వర శర్మ**
ఫోన్ : 960 338 9441

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 4 6 హైదరాబాద్ ఫిబ్రవరి : 2025

## మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రక్రియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. **ఉపోద్ఘాతం :** ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. **విషయం :** పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యధాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. **ముగింపు :** పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
4. **ఉపయుక్త గ్రంథసూచి :** ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. ప్రచురణ సంవత్సరం). గ్రంథం పేరు, ప్రచురణసంస్థ, ప్రచురణ స్థలం.) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. **'భారత ధ్వని దర్శనము'**. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యధాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

## తుకారాం అభంగం

చిత్తమా స్థిర చిత్తమవ్వవే
చిగురించు కోరికల దాస్యమాపవే
పరమానందము పీఠమెక్కి నిలబడె
పదములతో ప్రస్తుతించ కదలవే

అదే చంద్రభాగ అదే పండరీపురి
అదే భక్త సందోహము అదే ఆనందము
చిత్తమా నీ చిలిపి పనులు మానవే
చిగురించు కోరికల దాస్యమాపవే

జయ జయధ్వాన బృంద మేళాలు
ఏకతార నాదాలు ప్రభుకీర్తి గానాలు
చిత్తమా పరుగున ఆడి పాడవే
పరమాత్మ విఠలు కూడి చూడవే

తుకా పలుకు సత్యము మరిగి చూడవే
హరినామ జపము మహదానందమే
చిత్తమా శ్రీధరుని చేతు బట్టవే
చిగురించు కోరికల దాస్యమాపవే




అనువాదం

డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 4  UGC CARE List Approved Journal
హైదరాబాద్ ఫిబ్రవరి : 2025

# శ్రీ మహాభాగవతం – భక్తి యోగం

**డా. పి. వరలక్ష్మి,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నగరి. ఫోన్ : 90008 74713

**సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదంతి న పండితాః ।**
**ఏకమప్యాస్థితః సమ్యక్ ఉభయోర్విందతే ఫలమ్** ॥ భగవద్గీత5.4

సాంఖ్య, కర్మ యోగాలు వేరువేరు ఫలితాలని ఇస్తాయని అవివేకులు భావిస్తారు. అయితే ఈ రెండింటిలో ఏ ఒక్కదానినైనా సరియైన విధంగా ఆచరిస్తే రెండింటి ఫలాన్ని పొందుతారని వివేకులు ప్రబోధిస్తారు. జ్ఞానయోగులు ఏ స్థానాన్ని పొందుతారో కర్మయోగులు కూడా అదే స్థానాన్ని పొందగలరని ఈ శ్లోకం నిరూపిస్తుంది.

ఏకకాలంలో జ్ఞాన, కర్మ యోగాలకు భక్తి యోగాన్ని జోడించి తత్త్వజ్ఞానాన్ని ప్రత్యక్షప్రమాణంగా అనుభూతించేలా ఉద్బోధించింది మహాభాగవతంలోని భక్తియోగం.

ఆంధ్ర మహాభారతానికి ఆత్మ,హృదయం శ్రీమద్భగవద్గీత. ఈ గీతకు / మార్గానికి భాష్యమే భాగవతం. కనుక భగవద్గీతలోని భక్తియోగానికి భాష్యమే భాగవతంలోని భక్తియోగం. ఈ యోగం అనన్యమైనది, అత్యున్నతమైనది. మనిషిని ఆవరించిన పాముకాటు కంటే బలీయమైన అజ్ఞానమనే విషాన్ని తొలగించగల్గిన దివ్యౌషధం.

కపిల మహర్షి బ్రహ్మసంకల్పం నుండి పుట్టినవాడు కనుక ఇతన్ని బ్రహ్మమానస పుత్రుడు అంటారు. జ్ఞానోదయం పొందిన వారిలో అగ్రగణ్యుడు కపిల మహర్షి. సాంఖ్య సంప్రదాయం ప్రకారం 26మంది సాంఖ్య ఉపాధ్యాయులు ఉన్నట్లు తెలుస్తుంది. అయితే ప్రప్రథమ స్థానం కపిల మహిర్షిదే! ఒక క్రమబద్ధమైన మార్గంలో జ్ఞానాన్ని అందించడానికి సాంఖ్య శాస్త్రాన్ని ప్రతిపాదించాడు. కర్దమ మహర్షి భార్య అయిన దేవహూతి తన పుత్రుడైన కపిలాచార్యునితో ఓ పుణ్యాత్ముడైన కపిలమునీ! ధర్మమార్గాన్ని విడిచి తద్విరుద్ధమైన దుర్మార్గాలలో ప్రవర్తిస్తున్న ఇంద్రియాల పోరాటంచేత అలసిపోయి విరక్తురాలినై కుమిలిపోతున్న నాకు ఈ సాటిలేని ప్రాపంచికపు వ్యామోహమనే చీకటి నశించిపోవడం ఎలా? అని వేడుకుంటుంది. అప్పుడు కపిల మహర్షి సాంఖ్య శాస్త్రం ద్వారా తత్త్వజ్ఞానోపదేశం చేసి తన తల్లిని అజ్ఞానపు సంకెళ్ళ నుంచి విడిపిస్తాడు. ఈ సందర్భంలో బోధించిన తత్త్వజ్ఞానానికి భక్తియోగాన్ని జోడించి జ్ఞానోదయం కలిగిస్తాడు కపిలమహర్షి.

ఇంద్రియాలు అసత్తులు. అవి కలిగించే సుఖాలు ఎండమావులే..! ఈ విషయం తెలియకమోహమనే సాగరంలో మునిగి వాటినే నిజమైన సుఖాలుగా భ్రాంతి చెంది భ్రమలో చిక్కుకొని వలలో చిక్కిన పిట్టలాగా రెపరెపలాడుతూ ఉంటారు. దిక్కుతోచక దారి తెలియక అగమ్య గోచరంలో మనిషి తనకు తానుగా ఇరుక్కుంటాడు. అలా పోరాడి పోరాడి ఆరాటపోరాటాలతో అలసిసొలసిపోయిన మానవుడు దేవహూతిలాగా అజ్ఞానాన్ని పోగొట్టుకునే ఉపాయాన్ని అన్వేషిస్తూ ఉంటారు. అలాంటి అన్వేషకులకు భాగవతంలోని భక్తియోగం ఓ వరం.



మనిషి తన భార్య, భర్త, పిల్లలు స్నేహితులు బంధువులు మొదలైన వారికంటే వేరై ఉన్నాడు. ఈ సత్యాన్ని అజ్ఞానపు మనిషి గ్రహించలేకపోతున్నాడు. అందుకే శిశువు దశనుంచి మహాభారతం, మహాభాగవతం, భగవద్గీత మొదలైన సద్గ్రంథాల పఠనం, అధ్యయనం, ఆచరణ అలవరచాలి. అప్పుడు అగ్నిదేవుడు తన నుంచిపైకి ఎగిసే అగ్నికణాలు, కొరువులు మొదలైనవాటి కంటే తాను వేరుగా ఉన్నట్లు మనిషి కూడా శరీరానికంటే వేరుగానూ, దృశ్యమాన మవుతున్న జగత్తుకంటే వేరుగానూ వున్నాడన్న జ్ఞానం అలవడతుంది. ఇదే తత్త్వజ్ఞానం. ఈ విధంగా 25 ఇంద్రియాల తత్త్వాన్ని, 96 ఉప ఇంద్రియాల తత్త్వాన్ని వాటి పని తీరును తన బిడ్డయైన కపిలాచార్యుల ద్వారా విన్న దేవహూతి మళ్ళీ ఇలా అంటుంది.

మహాత్మా! మహత్తు, అహంకారం, భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం అనే ఏడింటికీగల అన్యోన్య సంబంధం; ప్రకృతి, పురుషుల లక్షణాలు వాటి నిజస్వరూపం మొదలైన అంశాలు వివరించావు! సాంఖ్య శాస్త్రాన్ని భక్తి యోగ వైశిష్ట్యాన్ని, అసంగత్వాన్ని అలవరచుకునే విధానం మరింత విపులంగా తెలుసు కోవాలనుకుంటున్నాను. వీటన్నింటినీ మించి నీ నిజస్వరూపం ఏమిటి? నువ్వెవరు? తెలుసుకోవాలను కుంటున్నాను. అంతేకాదు! నీకు భయపడి ప్రజలు ధర్మకార్యాలు చేస్తున్నారు. మనిషికి మిథ్యాభూతమైన శరీరంపై అభిమానం ఎక్కువగా ఉంది. మూర్ఖత్వంతో కర్మాసక్తుడై సంసార వృక్షమనే అశ్వత్థవృక్షపు చీకటి



గుహలోనే మ్రగ్గుతున్నాడు. అలాంటి మానవుణ్ణి అజ్ఞానమనే నిద్రావస్థ నుండి మేల్కొలపడానికి నీవు యోగరూపం దాల్చిన పుణ్యాత్ముడవు కావున ఈ అన్ని విషయాల్ని నాకు వివరించు అని కోరింది. అప్పుడు కపిలుడు దేవహూతికి భక్తియోగాన్ని ప్రబోధిస్తాడు. అమ్మా! ప్రజల ఫలాశలు / ఫలితాన్ని ఆశించే తీరు పలురకాలు. కాబట్టి వారి భక్తియోగపు పోకడలు కూడా అనేక విధాలు. వాటిని స్థూలంగా విభజించి వివరించి చెప్తాను విను! అంటూ కపిలాచార్యుడు భక్తియోగాన్ని ప్రబోధిస్తాడు.

తామసం, రాజసం, సాత్త్వికం అని భక్తులు 3 రకాలు. పరులను బాధపెట్టడం, కపటవర్తనం, అసూయవంటి గుణాలు కల్గివుండి ఎల్లప్పుడూ భేద దృష్టిగలవారై భగవంతునిపట్ల భక్తిని ప్రదర్శించేవారు. వీరిది తామస భక్తి. వీరిని తామసులు అంటారు. విషయ భోగాలలో నైపుణ్యం కల్గి సంపద కోసం, కీర్తి కోసం భగవంతుని పట్ల భక్తిని ప్రదర్శించేవారు.. వీరిది రాజస భక్తి. వీరిని రాజసులు అంటారు. నిషిద్ధ కర్మల్ని నివారిస్తూ లోకానికి ఆదర్శప్రాయులుగా ఉంటూ సత్కర్మల్ని ఆచరించే వారు సాత్త్వికులు. వీరి భక్తి సాత్త్వికం. వీరిని సాత్త్వికులు అంటారు. అమ్మా! మను పుత్రీ! నేను పాపభావాలు లేనివాడిని. పైన తెలిపిన సత్త్వరజస్తమోగుణ భావాలకంటే అతీతుడను. అందుకే నన్ను త్రిగుణాతీతుడు అంటారు. అయితే పై మూడు విధాలకంటే విలక్షణమైన త్రిగుణాతీత తత్త్వాన్ని భక్తితో కొలిచే భక్తుల మనోభావాలు సముద్రాన్ని చేరే దేవగంగలాగా ఫలవంత మవుతాయి అంటూ ఉద్బోధిస్తాడు.

భగవంతునిపై భక్తి అంటే ఏమిటి? అని మనం మన అంతరాంతరాళంలోకి వెళ్ళి పరిశీలిస్తే బోధపడుతుంది. భక్తి అంటే ఏమిటో ఈ అంశం మనకు నిరూపిస్తుంది. కపిల మహర్షి పేర్కొన్న భక్తియోగ లక్షణాలు త్రిగుణాతీత భక్తులు అనుసరించే భక్తి, నిష్కామ భక్తి. వీరికి ఫలాపేక్ష ఉండదు. సాలోక్యం, సారిష్యం, సామీప్యం, సారూప్యం, సాయుజ్యం అనే ముక్తి సాధనం వైపు వీరు పయనిస్తూ ఉంటారు. వీరు అత్యంతిక భక్తులు. త్రిగుణాలకతీతమైన ఇలాంటి మానవుడు "నా ఆకారాన్ని" పొందుతాడు అని కపిలుని ఉవాచ.

వర్షపు చినుకు భూమిపైన తప్ప మరెక్కడా పడదుకదా! నదులు నదీ జలాల్ని ఎక్కడా విడిచి పెట్టకుండా సముద్రాన్ని వెతుక్కుంటూ వెళ్ళి తన నామరూపాల్ని వీడి సముద్రంలో కలిసిపోయే రీతిగా భక్తుడు తన భావాలన్నింటినీ ఏకత్రితమొనర్చి ప్రేమతో నిండివున్న వాడై భగవంతునితో ఏకం కావాలి. ఐక్యం కావాలి. నేను అనే భావాన్ని కూడా కలిపి భగవంతునిలో ఐక్యమొందించాలి. స్థావర జంగమాదులన్నింటిలోనూ నాకు భిన్నమైనవాటిని తలచకుండా ఉండటమే ఈ భగవదైక్య స్థితి. నిజమైన భక్తి. దీనికి భిన్నమైన మరే విధానాలు భక్తి కాదు. ఈ విధమైన ఐక్యావస్థ లభించనప్పుడు 'నా' స్వరూపాన్ని గురించి సరైన జ్ఞానం సిద్ధిస్తుంది. కొయ్యలో అగ్ని ఉంటుంది. కానీ అది మండిన తరువాత దాని నామరూపాలు ఏ మాత్రం మిగిలియుండక అగ్ని రూపాన్నే పొందుతుంది. ఆకాశమంతా అంధకారంగా ఉండి సూర్యోదయం కాగానే నలువైపులా వెలుతురు వచ్చే విధంగా 'నా' స్వరూప సాక్షాత్కారం కల్గినవెంటనే అహంకారం అంతమైపోతుంది. అహం అంతమైపోగానే ద్వైత భావం కూడా తనంతట తానుగా వీగిపోతుంది. అప్పుడు నేను వారు అనే రెండు స్వభావాలు కలిసి 'నేనే' అవుతుంది. ఆ భక్తుడు నా లో కలిసి ఏకరూపుడౌతాడు. ఇదే భక్తి అంటే.

ఈ ఘట్టంలో కపిలాచార్యులు తల్లికి ప్రబోధించిన భక్తిమార్గం 5 విధాలుగా ఉంది.

**1. తామస భక్తి :** హింస, దంభం, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు. తద్వారా లోభ దృష్టి. క్రోధం భేద దృష్టిని కల్గి ఉంటారు. **2. రాజస భక్తి :** కీర్తి, సంపదలు మొదలైన వాటికోసం విగ్రహారాధన మొదలైనవి చేస్తుంటారు. **3. పాప విముక్తికై భక్తి :** దోష నివారణకు లేదా పాప విముక్తి కొరకై శాస్త్రగతిని అనుసరించి భగవంతునిపై భక్తిని ప్రదర్శించడం. **4. నిర్గుణ భక్తి :** ఫలాపేక్ష లేని త్రిగుణాలతో సంబంధం లేని భక్తి. **5. అత్యంతిక భక్తి :** భగవంతుని సేవ తప్ప తక్కినదేదీ కోరని భక్తి.

కర్త, భోక్త లేని ప్రదేశం. కోరికలు తెలియని స్థితి. అంటే భగవంతుని నిజస్వరూపం ఏదో ఆత్మిక విచారణ ద్వారా తెలిసి ఆ సర్వవ్యాపక వాసుదేవత్త్వపు, త్రిగుణాతీతపు దైవిక తత్త్వానికి సేవ చేయడం. అంటే తత్త్వజ్ఞానార్థాన్ని తెలుసుకొని ఆచరిస్తున్న తత్త్వవిదులు అదే తత్త్వజ్ఞానార్థాన్ని ఇతరులకు కూడా తెలియజేస్తూ ఉంటారు. ఇదే వారు దైవశక్తికి చేసే సేవ.

**అనిశము సర్వభూత హృదయాంబుజవర్తి యనం దనర్చు నీ**
**శు నను నవజ్ఞ సేసి మనుజుం డొగి మత్ప్రతిమార్చనావిడం**
**బనమున మూఢుఁడై యుచిత భక్తిని నన్ను భజింపఁడేని న**
**మ్మనుజుఁడు భస్మకుండమున మానక వేల్చిన యట్టివాఁడగున్**

శ్రీమహాభాగవతము – తృతీయ స్కంధము 964 వ పద్యం

చరాచరా భూతాల్లో సర్వదా సర్వత్రా సమంగా వసిస్తున్న నన్ను తెలియక కేవలం నా విగ్రహాన్ని మాత్రమే కొలుస్తూ నా పై అనన్య భక్తిని పెంపొందించుకోని వారి కార్యాలన్నీ బూడిదలో హవిస్సు వదిలినట్టి వారవుతారు. వీరు వ్యర్థ జీవులు అని తేల్చి చెప్పాడు కపిల మహర్షి.

పరమేశ్వరుడు తప్ప అన్య విషయాలయందు స్పృహలేని భక్తే అనన్య భక్తి. ఇది లేకుండా భగవంతుని పొందడం వీలుకాదు. భక్త్యాతు అనన్యయా శక్యః – 11.54. అనన్య భక్తి భిన్న భావాల్ని ద్వంద్వాల్ని అంతరింపజేసి సమస్త ఇంద్రియాలు ఒక్క భగవంతునితో (ఆత్మస్థంతో) సంతృప్తి చెందుతాయి. భగవంతుడు వినా మరే విషయాలయందు తృప్తి చెందని పరిస్థితిని సంప్రాప్తింపజేసేదే అనన్య భక్తి. నేను ధర్మశాస్త్రం, అర్ధశాస్త్రం ఇంకా అనే శాస్త్రాలు చదివాను ముఖ్యమైన గొప్ప శాస్త్రాలు అన్నీ చదివి చదువులలోని సారాన్ని రహస్యాన్ని తెలుసుకున్నానంటున్న ప్రహ్లాదభక్తి అనేది ఓ పవిత్రమైన భావన. ఇదే అనన్య భక్తి.

**అబ్జాక్షి! నిఖిల భూతాంతరాత్ముఁడ నైన**
**నాయందు భూతగణంబునందు**
**నతిభేదదృష్టి మాయావులై సతతంబుఁ**
**బాయక వైరానుబంధ నిరతు**
**లగు వారి మనములఁ దగులదు శాంతి యె**
**న్నటికైన నేను నా కుటిల జనుల**
**మానక యెపుడు సామాన్యాధిక ద్రవ్య**
**సమితిచే మత్పదార్చన మొనర్ప**
**నర్థి నా చిత్తమున ముదం బందకుందు,**
**ననుచు నెఱిఁగించి మఱియు నిట్లనియెఁ గరుణఁ**
**గలిత సద్గుణ జటిలుఁ దక్కపిలుఁ డెలమిఁ**
**దల్లితోడ గుణవతీమతల్లితోడ**

శ్రీమహాభాగవతము – తృతీయ స్కంధము 965వ పద్యం

అంతేకాదు తల్లీ! సమస్త భూతాల్లో ఉన్న నాకు ఈ భూత ప్రపంచానికి విడదీయరాని సంబంధం ఉంది.కుటిలాత్ములైన జనానికి ఇది తెలియదు. వారికి నాయందు ఈ భూతాలయందు ఎల్లప్పుడు తేడాయే కన్పిస్తుంది. అలాంటి మాయావులకు ఎప్పటికీ శాంతి లేదు. వారు సామాన్య ద్రవ్యంతోగానీ విశేష ద్రవ్యంతోగానీ నన్ను పూజించినా నాకు సంతోషం కలగదు.

**తలఁప బ్రాహ్మణు లుత్తములు, వారికంటెను**
**వేదవేత్తలు, వేదవిదులకంటె**
**విలసిన వేదార్థ విదులు, వారలకంటె**
**సమధిక శాస్త్ర సంశయము మాన్పు**
**మీమాంసకులు, మఱి మీమాంసకులకంటె**



**నిజధర్మ విజ్ఞాననిపుణు, లరయ**
**వారికంటెను సంగవర్జిత చిత్తులు**
**దగ వారికంటె సద్ధర్మపరులు**
**ధార్మికులకంటె నుత్తమోత్తముఁడు వినుము,**
**మత్సమర్పిత సకల కర్మ స్వభావ**
**మహిమములు గల్గి యితర కర్మములు విడిచి,**
**సమత వర్తించు నప్పుణ్యతముఁడు ఘనుఁడు**

శ్రీమహాభాగవతము – తృతీయ స్కంధము 969వ పద్యం

మానవుల్లో నాలుగు జాతులు, ఆ జాతుల్లో బ్రాహ్మణులు, వారిలో వేదజ్ఞులు, వారికంటే వేదార్థం తెలిసినవారు, వారికంటే శాస్త్ర సందేహాల్ని తీర్చగల మీమాంసకులు, వారికంటే స్వధర్మమెరిగినవారు, వారికంటే సంగవిముక్తులు, వారికంటే ఉత్తమధర్మపరాయణులు, వారికంటే కూడా ఎవడు అన్యదేవతారాధనల్ని త్యజించి, తన కర్మలన్నింటినీ నన్నుదేశించి చేస్తాడో వాడు ఉత్తమోత్తముడు. వాడే నిజంగా సమభావంతో వర్తించే గొప్పవాడు.

**సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని ।**
**ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥**భగవద్గీత 6.29

సర్వవ్యాప్తమైన అనంతచైతన్యమందు ఏకీభావస్థితిరూపయోగ యుక్తమైన ఆత్మగలవాడును, అంతటను అన్నింటిని సమభావంతో చూసేవారైన యోగి, తన ఆత్మను సర్వప్రాణులలో స్థితమైవున్నట్లుగా, ప్రాణులన్నింటినీ తన ఆత్మయందు కల్పితాలుగా భావిస్తారు (చూస్తారు).

జీవుని ఆవేదనతో నిండిన స్తోత్రం చూస్తే.....

**ఎవ్వఁడు నిఖిల భూతేంద్రియ మయ మగు**
**మాయావలంబన మహిత కర్మ**
**బద్ధుడై వర్తించు పగిది దంఢహ్యామా**
**నంబగు జీవచిత్తమ్మునందు**
**నవికారమై శుద్ధమై యఖండ జ్ఞాన**

**మున నుండు వానికి ముఖ్యచరితు**
**నకు నకుంఠిత శౌర్యునకుఁ బరంజ్యోతికి**
**సర్వజ్ఞునకుఁ గృపాశాంతమతికిఁ**
**గడఁగియుఁ బ్రకృతి పురుషులకంటెఁ బరముఁ**
**దైవవానికి మ్రొక్కెద నస్మదీయ**
**దుర్భరోదగ్ర భీకర గర్భనరక,**
**వేదనలఁ జూచి శాంతిఁ గావించుకొఱకు**

పాంచభౌతికం, దశేంద్రియమయమైన కర్మలతోకూడినది శరీరం. అందులో మాయామయమైనకర్మవాసనలతో వేగిపోతున్నది మనసు. ఇలాంటి పాంచభౌతిక దేహిచిత్తంలో స్వచ్ఛంగా ఆత్మతేజస్సుతో వెలుగుతున్నవాడు, పరమాత్మ. ఆయన చరిత్ర కొనియాడదగింది. ఆయనకు తెలియనిదేదీ లేదు ఆయన పరాక్రమం తిరుగులేనిది. దయా శాంత గుణాలకు ఆయన నెలవు. ఆ స్వామి ప్రకృతి పురుషుల కంటె భిన్నమైనవాడు. పరంజ్యోతి స్వరూపుడు. నా యీ నరకతుల్య మైన గర్భబాధల నుండి విముక్తి పొందటానికి నేను ఆయనకు నమస్కరిస్తున్నాను. (శ్రీమహాభాగవతము - తృతీయ స్కంధము 995వ పద్యం)

**దీనవదనుఁ డగుచు దేహి యీ దేహంబు,**
**వలన నిర్గమింపఁ దలఁచి చనిన**
**నెలల నెన్నుకొనుచు నెలకొని గర్భంబు**
**వలన వెడలఁ ద్రోయువారు గలరె?**

గర్భస్థ జీవుడు దీనుడై తల్లి శరీరం నుండి విడివడాలని ఆవేదన చెందుతూ తాను చేసినటువంటి పనులను జన్మాంతరాలుగా తనతో తెచ్చుకున్న సంస్కారాలను చూసి ఇకపైన భగవంతుని స్మరణవినా అన్యమార్గానికి వెళ్ళను! అనన్య భక్తితో నిన్నే పొందుతాను అని వాపోతాడు. ఈ నరకకూపం నుంచి నన్ను బయటకు త్రోసివేయి భగవంతుడా! అని వేడుకుంటాడు.

**నెలకొని బహుదుఃఖములకు నాలయమైన**
**యీ గర్భనరకము నేను వెడలఁ**
**జాల బహిః ప్రదేశమునకు వచ్చి**
**ననుపమ దేవమాయా విమోహి**
**తాత్ముండనై ఘోరమైనట్టి సంసార**
**చక్రమందును బరిభ్రమణ శీలి**
**నై యుండ వలయుఁ దా నది గాక గర్భంబు**
**నందుండు శోకంబు నపనయించి**
**యాత్మ కనయమ్ము సారథియైన యట్టి,**
**రుచిర విజ్ఞానమునఁ దమోరూపమైన**
**భూరి సంసార సాగరోత్తారణంబు,**
**సేసి యీ యాత్మ నరసి రక్షించుకొందు**

ఇకపై ఈ గర్భశోకం నుంచి బయటపడి విజ్ఞానంతో భగవంతుని మార్గంలో ప్రయాణించి సంసార బంధాల నుంచి విముక్తి చెంది ప్రత్యగాత్మను గ్రహించి నన్ను నేను భగవంతునికి సమర్పించుకుంటాను.

**పరఁగుచు నున్న దుర్వ్యసనభాజనమై ఘనదుఃఖమూలమై**
**యరయఁగఁ బెక్కుతూట్లు గలదై క్రిమిసంభవ మైనయట్టి దు**
**స్తర బహుగర్భవాసముల సంగతి మాన్పుటకై భజించెదన్**
**సరసిజనాభ భూరి భవ సాగర తారక పాదపద్మముల్**

అందుకే సమదర్శిన తత్త్వాన్ని పరమగురువు ద్వారా అలవరచు కొని సంసార సముద్రాన్ని దాటి దైవత్వాన్ని సంతరించుకోవడానికి కృషి చేయడానికి శ్రీమద్భాగవతం - భక్తి యోగమైన శ్రీమద్భగవద్గీతా మార్గం (భగవంతుని చేర్చే గీత/దారి/పథం) వినా వేరే మార్గం లేదు.


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

# మూసీ

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక**
**మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి**
**వెంటనే శాశ్వత చందాదారులు కండి.**
**సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక**
**పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక**
**యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక**
**శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-**
**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 4  హైదరాబాద్ ఫిబ్రవరి : 2025

# మను చరిత్ర – పాఠ పరిష్కరణ

**డా. టి.ఎన్. వెంకటేష్,** అసోసియేట్ ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం. నెల్లూరు.

మనుచరిత్రను మొట్టమొదటగా1842వ సంవత్సరంలో ముద్రించినట్లుగా తెలుస్తోంది. దీని ముద్రణకర్త ఎవరన్నది ప్రతిని చూస్తేతప్ప చెప్పలేము. కానీ వ్యాఖ్యానసహితంగా మొట్టమొదట 1851లో ముద్రించినది మాత్రం సి.పి.బ్రౌన్. వీరు జూలూరి అప్పయ్య శాస్త్రిచేత చేయించిన వ్యాఖ్యానం ఎంతో ప్రసిద్ధమైంది. మద్రాసు ఓ.ఆర్.ఐలో మనుచరిత్రకు చెందిన 19 తాళపత్ర ప్రతులు, రెండు కాగితపు ప్రతులూ ఉన్నాయి[1]. బ్రౌన్ పండితమండలి ఈ మనుచరిత్ర పాఠపరిష్కరణ చేసిన విధానం గమనించండి.

ఉదా : 1) సీ. "తీర్థసంవాసు లేతెంచినారని విన్న
నెదురుగా నేగు దవ్వేంతన
నేగి తత్పదముల కెఱగి యింటికి దెచ్చు
దెచ్చి సద్భక్తి నాతిథ్యమిచ్చు
నిచ్చి యిష్టాన్న సంతృప్తులుగా జేయు......."
............................(మను. 1-68వ పద్యం)

ఈ పద్యంలో 'ఇష్టాన్న' అనే పాఠానికి 'మృష్టాన్న' అనే పాఠాంతరం కలదు. 'మృష్ట' అనగా 'పక్వము చేయబడిన'అని అర్థం. పక్వము చేయబడిన అన్నాన్నే వడ్డిస్తారు కానీ పక్వము చేయని అన్నం ఉండదు కదా? కాబట్టి 'ఇష్టాన్న సంతృప్తులుగాఁజేసి' అంటే ఆ తీర్థవాసులకు ఇష్టమైన అన్నంపెట్టి తృప్తులుగాజేసి అనటమే సరియైన పాఠం.

ఉదా: 2) "అతడట్లౌషధ హీనుడై నిజపురీ యాత్రామిళత్కౌతుకో
.......................................................
........యీ ఘోరవన ప్రదేశమునకున్ సిద్ధాపదేశంబునన్"
– (మను.2-14వ పద్యం)

పై పద్యంలో నాల్గవపాదంలో "సిద్ధాపదేశంబునన్" అనే దానికి "సిద్ధోపదేశంబునన్" అనే పాఠాంతరం కలదు. అట్లాగే సిద్ధంఅపదేశంబునన్, సిద్ధాపదేశంబునన్ సిద్ధుడనే నెపంచేత అనిఅర్థం. అట్లాగే సిద్ధం ఉపదేశంబునన్, సిద్ధోపదేశంబునన్ సిద్ధుని ఉపదేశంచేత అనిఅర్థం. వీటిలో "సిద్ధాపదేశంబునన్" అనే పాఠమే సరసమైంది. సిద్ధుడు ప్రవరుని పాదానికి పాదలేపనం పూసి హిమాలయ పర్వతానికి వెళ్ళమని ఉపదేశించలేదు. ప్రవరుడే తన చిరకాలవాంఛను తీర్చుకోవటానికై సిద్ధుని ప్రార్థించి, అతని అనుగ్రహంచేత హిమాలయ పర్వతానికి వచ్చాడు. కాబట్టి "సిద్ధాపదేశంబునన్" అనే పాఠమే ఈ సందర్భంలో సరియైనపాఠం అని నిర్ణయించారు.

ఉదా : 3) "అనుకూలగతి" నాదు మనసులో వర్తించు
కులకాంత మదినెంత కుందునొక్కొ
.................................. (మను.2-17వ పద్యం)

ఈ పద్యంలోని "అనుకూలగతి" అనే పాఠానికి "అనుకూలవతి" అనే పాఠాంతరం



కలదు. 'అనుకూలము', 'ఆనుకూల్యవతి' అవుతుందేకాని 'అనుకూలవతి' కాదు. "అనుకూలగతి" అంటే "అనుకూలమైన వర్తనముతో" అని అర్థం. ఇదే సమంజసమైన పాఠం.

ఉదా: 4) మనసుగ్రక్కియెడు రీతిని.......

............................
(మను.3-160)

ఈ పద్యాన్ని తాము సరిపోల్చిచూసిన ఐదుప్రతుల్లోను లేనట్లుగా, ఒక్క క్రిష్ణమూర్తిప్రతిలో మాత్రమే ఉన్నట్లుగా పరిష్కర్తలు తెలిపారు. ఇది అక్కడికథకు అసందర్భంగాను, అన్వయం కుదరనిదిగాను ఉండటంచేత, ప్రక్షిప్తమేమో అనే సందిగ్ధం వల్ల ఆ పాఠానికి తీర్పుగానీ, టీకగానీ చేయనట్లు సూచించారు.

జూలూరివారు ఈ విధంగా పాఠపరిష్కరణ చేసినట్లు కనిపిస్తుంది.

**వేటూరి ప్రభాకరశాస్త్రి పరిష్కరణ:**

1926లో వేటూరి ప్రభాకరశాస్త్రి పీఠికతో వావిళ్లవారు ముద్రించారు. తర్వాతి ముద్రణలు 1951, 1955లో వెలువడ్డాయి. ఈపీఠికలో

మనుచరిత్ర ప్రబంధాన్ని గూర్చి, రచనాశైలిని గురించి, ఇతరకవులపై పెద్దన ప్రభావవంటి విషయచర్చ, పెద్దనచేసిన శాబ్దికదోషాల ప్రస్తావనలవంటివి కనిపిస్తాయేగానీ పాఠపరిష్కరణ, పాఠాంతరాల గురించిన చర్చ అంతగా కనిపించదు. వేటూరి ప్రభాకరశాస్త్రి ఈగ్రంథ ఆశ్వాసాంతంలో చేసిన వ్యాఖ్యాతృగద్యలో **"అనేక పూర్వవ్యాఖ్యానాభిప్రాయంబుల బర్యాలోచించి రచించబడిన రుచిసమ వ్యాఖ్యానమని పేర్కొన్నారు".** దీనినిబట్టి పరిశీలిస్తే సి.పి.బ్రౌన్ తనతోటి పండితులచే మొట్టమొదట మనుచరిత్రను పరిష్కరించి పెట్టిన కాగితపు ప్రతిని ప్రభాకర శాస్త్రి ప్రామాణికంగా స్వీకరించి ఉంటారని తెలుస్తుంది.

పీఠికలో కుదపకాలచర్చలు చేసి పెద్దన సమయాన్ని కచ్చితంగా సూచించలేదని చెప్పారు. పెద్దన చేసిన కొన్ని సంస్కృత వ్యాకరణవిరుద్ధ ప్రయోగాల్ని ప్రస్తావించి **"పణినసూను కణాదబాదరాయణ సూత్రఫక్కి విద్వాంసులుపన్యసింప"** అని పెద్దన **"ప్రాతఃకాలము వాయసంబు పణినాపత్యోక్త శాస్త్రంబులోన్"** అనే శ్రీనాథుని ప్రయోగాన్ని అనుసరించాడు. ఇందులో పాణిని పాణినముని కుమారుడు కాని పణిన మునికుమారుడు కాడు."పణనం పణి - పణోస్యాస్తీతి పణీ". నకారాంతమైన ఈ 'పణిన్' శబ్దంపై గోత్రాపత్యార్థంలో 'అణ్' ప్రత్యయంరాగా 'పాణిన' అనే రూపం ఏర్పడినది. ఈ యువాపత్యార్థమున 'ఇ' ప్రత్యయం రాగా 'పాణిని' అనే రూపం ఏర్పడినది. ఎట్లైనా బాణిని పాణిననూనుడగును గానీ, పణినసూనుందు గాడు. ఇది సమర్థింప వెరవుగానరాదు"[1] అని వేటూరివారు తెలిపారు.

అదేవిధంగా మనుచరిత్ర కృత్యవతరణమున "కొఱంతంబడున్ గుకవి పృథ్వీభృత్సమీపస్థలిన్" అనుచో న్యూనతయనునర్థమున "కొఱంత" యను పదము సరియగునుగానీ, "శూల" మను రెండవ యర్థమున "కొఱత" యను రూపము సరికాదు. కొఱు శబ్దమునుండి యట్టిరూపమేర్పడనేరదు-అని సూచించారు.

**వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి పాఠ పరిష్కరణ :**

వీరు మనుచరిత్రకు రచించిన వ్యాఖ్యానం ప్రసిద్ధమైంది. దీనిని 1968లో వెంకట్రామా అండ్ కో గ్రంథమాలద్వారా ప్రచురించారు. వీరు వావిళ్లవారి ముద్రితప్రతినే ప్రధానంగా పెట్టుకొని వ్యాఖ్యానం కొనసాగించారు. కానీ జూలూరి అప్పయ్యగారి వ్యాఖ్యానం, తన వ్యాఖ్యానం కొంత ముద్రితమైన తర్వాత లభించిందని అదే ముందు లభించినట్లయితే బాగుండేదన్న భావనను వ్యక్తం చేశారు.[2] ఆ తర్వాత జూలూరి అప్పయ్యశాస్త్రి పరిష్కృతప్రతి బ్రౌన్ ఆధ్వర్యంలో జరిగిందన్న ప్రేమను ప్రదర్శిస్తూనే, అందులో లేఖక ప్రమాద పతితములైన కొన్ని పాఠాలు త్యజించవలసినవి కనిపిస్తున్నాయని, ఆ పాఠభేదాన్నింటినీ గ్రంథంలో ఒక పట్టికలా చూపించారు. వెంపరాలవారు తన మనుచరిత్ర పీఠికలో **"బ్రౌను దొరగారి మనుచరిత్ర పాఠభేదములు"**- అని కొన్నింటిని ఈక్రింది విధంగా చర్చించారు.

**1) "కురంగనాభము"** (1-1) : ముద్రిత పాఠములన్నింటి యందును, బ్రౌన్ పాఠమునను నిట్లేకలదు. కానీ సాహిత్య అకాడమివారి ప్రతియందు అథోజ్ఞాపికలో "కురంగనాభి"యను పాఠాంతరము (ఎందలిదోగానీ) చూపబడినది. అథోజ్ఞాపికలందు బ్రౌన్‌గారి పాఠములే హెచ్చుగా నందుండుటచే - బ్రౌన్‌గారి పాఠముగా నిన్నటిదాకా దలంపబడెనుకానీ యది లభించినను నందును "కురంగనాభము' అనియే యుండుటచే అకాడమీ వారథస్సూచిక యందుఁజూపిన "కురంగనాభి" అనుపాఠము ఈనాటికి ఎచటిదో తెలియలేదు. కానీ 'కురంగనాభి' యనియే కవి ప్రయుక్తమై యుండునని వ్యాఖ్యయందు చర్చించబడినది.

**2) అనుకూలవతి** (2-17) : ఈ తావున "అనుకూలగతి" యను బ్రౌన్‌గారిపాఠమే గ్రాహ్యము. ముద్రిత పాఠములననుసరించి యాశబ్దము నర్థమును శ్రమించి సాధించుట నిరర్థకము. "నాకు హితమగురీతిని" అనగా "నాకెట్లు హితమగునో అట్లు" అని చక్కని యర్థము కుదురుచున్నది. కాన 'అనుకూలగతి' అని సవరించి చదువుకోఁగోరిక.

**3) "పొగరనన్"** (3-9వ వచనము) : పొగరు- గర్వము? అని వ్యాఖ్య. కాని 3-117లో కురులపొగరు అను తావున "నల్లదనము" అను వర్ణమున పొగరుశబ్దమున్నది. కాన ఇచటగూడ ''నల్లదనము'' అనియే గ్రహింపదగును. గర్వము అని సంశయముతో- పూర్వ వ్యాఖ్యలు చెప్పిన "నలుపు" అనునర్థమును స్వీకరింపకపోవుట పొరపాటు. కావున 3-9 వచనమందలి "పొగరు" పదమునకు నల్లదనము అనునర్థమే గ్రాహ్యము.

**4) పయ్యెదకున్ ననుపైన** (3-48): అను చోట "పయ్యెద కున్ననువైన" అని బ్రౌన్ పాఠము కనబడుచున్నను "పయ్యెదకున్ అనువైన'' అనునెడ ద్రుతద్విత్వసంధిచేయ జంకి 'అనువును' 'ననుపుగా' మార్చిన ముద్రిత పాఠములననుసరించి యట్లే యిందును వ్యాఖ్యానింపబడినది. కాని యుక్తము, అర్థము - అనుననర్థముగ "అనువు'' శబ్దమే యిట సముచితముగా కానవచ్చుటచే కవి ప్రయుక్తము "ననుపు" కాదనియు 'అనువు' అనునదే యగునని తోచుచున్నది.

**5) విడువు మాయలటంచు** (3-109): అనుదానికి "విడువు విరీల యటంచు" అని బ్రౌన్, శ.ర.పాఠము. 'ఈలన్ వంచన' యని బ్రౌన్ వ్యాఖ్య. 'సిగ్గు' అని శ.ర. కానీ బ్రౌన్ వ్యాఖ్యయే సముచిత మనిపించుచున్నది.

**6) ఆపద్దలు** (2-7) : అని బ్రౌన్ దొరగారి పాఠము. ఇది (ఆవు ం పద్దలు) అనుదానిలోని 'వు' వర్ణము లుప్తముకా గా శేషించిన 'ఆ' శబ్దమునకుఁబరుష పరకత్వమున నుగాగమ రహిత రూపమనినట్లు కనబడుచున్నది. ''ఆవుంతోకన్ ఆదోక, ఆవుంపెయ్యన్ 'ఆబెయ్య'వంటి ప్రయోగముల ననుసరించి 'ఆబద్దలు'అని యుండి నుండవచ్చును. తదనురోధమున బ్రౌన్ పాఠమునకెక్కి యుండవచ్చునుకాని, అంతమాత్రమున సాజాత్యమును విడిచి దీనికి కొత్త రూపకల్పమనావశ్యకము లుప్తశేషము కాని 'ఆ' యనునొకశబ్దము 'ఆవు' ననునర్థమున్నన్నచో రాపొడి (రావొడి 2-36 (బ్రౌ.పా) మున్నగు వానియందువలెనే నుగాగమరహిత రూపమున్నదనవచ్చును.

**సవరించిన పాఠాలు :**

తృతీయాశ్వాసంలో సీ. "మృగనాభినికరంపు" (3-111) అనే పద్యంలోని మూడవ పాదం "పసవిరీఋ సెలయేఋ లిసుక వెట్టినచోట" అనే పాదంలో "పసవిరీఋ సెయేఋలు" అనే పూర్వ పాఠమున సెలయేళ్లు పసవిరీతినవనుటకంటె సెలయేళ్ళు పసవిరీఋనట్లుగా నిసుకవెట్టిన యని- క్రీడింప ననువుగాఁబెద్దపెద్ద యిసుక తిన్నెలు వేసిన వన సముచితముగా నుండునని "పసవిరీఋ" అని సవరింపబడినది.

అలాగే ఈ పద్యంలోని నాల్గవపాదంలో **"నవమాలికల తేనెనట్లొట్లు పడుచోట" అనే పాదాన్ని "నవమాలికల తేనెనట్టట్టు పడుచోటొజాజుల యొక్క మధువక్కడక్కడ" అని బ్రౌన్ పాఠమును, వ్యాఖ్యయును, ఆ పాఠమున నఖండయతి యంగీకరింపవలెను. "నవమాలికల తీవెనట్లు"- అను ముద్రిత పాఠమునందు - 'నట్లు' అన 'అంట్లు' అని యొక వ్యాఖ్యయు, ఉయ్యెలత్రాళ్లని మతొకటియుఁ గనబడుచున్నవి. ఆపదమునకాయర్థములేని నిఘంటువులును కనఁబడవు. ఆయంట్లుగాని, యుయ్యెలత్రాళ్లుగాని ఉట్టిపడుట, రాలుట, ఊడిపడుట అనునర్థముతో సంబంధింపవు. అప్పుడేదియో లాక్షణికార్థమునాశ్రయింపక తీఱదు. కావున నాపాఠమమాని, వ్యాఖ్యాతలు పాఠాంతరమని చూపినదియు, ఆంధ్రభాషార్ణవము పష్టంభకముగా సూర్యరాయాంధ్ర నిఘంటువు స్వీకరించినదియున్నైన 'నవమాలికల తేనెనట్లొట్లు' అను పాఠము గ్రహింపబడి యిందు వ్యాఖ్యాతమయ్యెను.** (పుట.352)

గ్రంథంలో ఉండియుండకపోవచ్చునన్న పూర్వపరిష్కర్త అభిప్రాయాన్ని చర్చించి, అది ప్రక్షిప్తమై ఉండవచ్చని, అది లేకున్నా కావ్యానికి నష్టంలేదని తెలిపే సందర్భాన్ని గమనిద్దాం.

ఉదా: వరూధిని గర్భవతిగా ఉన్నప్పుడు మనసు కక్కుర్తితో రతిని కోరుకునే సందర్భాన్ని వర్ణించే పద్యం "మనసు కక్కురితి మెల్లనలేచె".... అనే పద్యం బ్రౌన్ ప్రతిలో లేదు. కానీ ఇది ప్రక్షిప్తమై ఉండవచ్చునని వావిళ్లవారి ప్రతిలోను, వ్యాఖ్యానంలో ఉన్నదని అందులోని విషయాన్ని ప్రస్తావించి, బ్రౌన్ దొరగారి గ్రంథమున లేనిదియు అనుచితము, ననహ్యామునగు నీ పద్యము పెద్దనామాత్యునిది కాదని త్రోసిపుచ్చుటయే యిటనౌచిత్యాదాయకము. ఈ పద్యము లేకున్నయెడఁగథకుఁగాని, వర్ణనమునకుఁగాని యెట్టి లోపమును గలుగను గలుగదు.

పూర్వపాఠాలను కాదని తాను కొత్తగా పాఠాన్ని స్వీకరించిన సందర్భం పరిశీలించండి.

స్రగ్ధర: గ్రుద్దున్ గోత్రాచలంబుల్ గులగులలయిపో గోతముల్ గ్రుద్దులీలన్

ఖద్దిన్ జెండాడు ప్రాఁకున్ కవుగిటికొలదుల్ కత్తినొక్కొక్కఘాతన్ (4-8)

(ఇందులో 'ఖద్దిన్' అనుతావున - గ్రద్దన్, గ్రద్దనన్ - అని బ్రౌన్ పాఠము) 'క' ప్రతిలో కద్దిన్ కోరిక -అని కలదు. కాన కద్దిశబ్దమా? అని సూ.ని సంశయము చూపినది.

'గోతములు' - మల్లసాధన విశేషమని సీ.తత్సాధనంబుల్కె తగుఁ గంబము కొంత కటికనలోదు సంగడము బాల, సంగడము నీల గోతామనంగఁగొన్ని - (ఆం.భా.2-207). 'ఘాతన్' అని పూర్వపాఠము. ఘాతము అనియే కాని 'ఘాత' అని చరిత్రాదిగణ పతిత రూపముతోఉబ్రయుక్తము కాకుండుటచేతను సూ.ని, శ.ర పాఠము 'గాతన్' అని యుండుట చేతను 'గాతన్' అను పాఠమే యిందు గ్రహింపబడినది. ప్ర. ఘాతము - వి. గాత కావచ్చును (పుట.394)

**పాదసూచికలు:**

1) మనుచరిత్ర- ద్వితీయ ముద్రణ, వావిళ్ల, వేటూరి ప్రభాకరశాస్త్రి పీఠిక, పుట. 25

2) మనుచరిత్ర- వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి వ్యాఖ్యానం- పుట.174

**ఉపయుక్త గ్రంథాలు :**

1) మనుచరిత్ర, అల్లసాని పెద్దన, పీఠికాకర్త-వేటూరి ప్రభాకరశాస్త్రి, ద్వితీయ ముద్రణ, వావిళ్ల ప్రెస్, మద్రాసు 1955.

2) మనుచరిత్ర, వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి వ్యాఖ్యానం, వేంకట్రామా గ్రంథమాల, విజయవాడ 1963.

3) వేటూరివారి పీఠికలు- మొదటి సంపుటం, తి.తి.దే ప్రచురణ, తిరుపతి 2012.

4) బ్రౌన్ తెలుగుకావ్య సముద్ధరణము, డా.ఆర్. పద్మావతి, నవ్యపరిశోధక ప్రచురణలు, తిరుపతి,1986.

❖ ❖ ❖ ❖ ❖

## ఆదిత్య హృదయ మహిమ

**"ఆదిత్యః సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్**
**సువర్ణ సదృశో భాను ర్హిరణ్యరేతా దివాకరః"**

ఇందులో ఆదిత్యుడు, సవిత, సూర్యుడు, ఖగుడు, పూష, గభస్తిమంతుడు, సువర్ణసదృశుడు, భానువు, హిరణ్య రేతసుడు, దివాకరుడు అని పది నామాలు ఉన్నాయి.

(గత సంచిక తరువాయి)

**ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొక్కక్కడై తోచు పో**
**లిక నే దేవుడు సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్న జ**
**న్య కదంబంబుల హృత్సరోరుహములన్ నానావిధానూన రూ**
**పకుడై యొప్పుచునుండు; నట్టి హరినే సేవింతు నశ్రాంతమున్**

ఇందులో 'హృత్సరోరుహములన్' అనే మాటను చాలా జాగ్రత్తగా పరిశీలించాలి. 'పరమాత్మ' "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః" అన్న శ్రుతి వాక్యం ప్రకారం హృదయాలలో కూడా ఉంటాడు. దీనిని మనం గుర్తిస్తూ ఉండాలి. ఇంకొక విషయం. ఇక్కడ సూర్యునితో 'దేవునకు' పోలికయే కదా చెప్పింది. సూర్యుడే దేవుడెలా అవుతాడు? అనే శంక తొంగిచూస్తూ ఉంటుంది. దానికి మనం తప్పనిసరిగా సమాధానం చెప్పుకోవాలి. నిజానికి పరమాత్మకు సమానవస్తువంటూ వేరొకటి లేదు. ఉపమానోపమేయభావం రెండు భిన్న వస్తువులకు మాత్రమే చెప్పటానికి సాధ్యమవుతుంది. కాబట్టి అనన్వయాలంకార లక్షణంతో ఇక్కడ సూర్యుడే దేవుడు. దేవుడే సూర్యుడు అనే అర్థం సిద్ధిస్తుంది.

'గగనం గగనాకారం సాగరః సాగరోపమః' వంటివి అనన్వయాలంకార ఉదాహరణలు. గగనము గగనాకారము, సాగరము సాగరోపమము. ఎందుకయ్యా ఇలా చెప్పటం అంటే శాస్త్రకారులు "ద్వితీయవస్తు వ్యవచ్ఛేదార్థం" అంటారు. గగనముతో సమానమైన వస్తువు రెండవది లేదు అని చెప్పటానికి అన్నారు. అలాగే ఈ పోతనగారి పద్యంలో కూడా సూర్యుడే పరమాత్మ అనే తాత్పర్యం ధ్వని మార్గంలో వ్యక్తమవుతుంది. ఈ పద్యంలో సూర్య పద ప్రయోగం కూడా శబ్ద పాకానికి సంబంధించిన విషయం.

**4. ఖగః :** ఆదిత్యునకు 'ఖగుడు' అనే గౌణ నామం కూడా ఉన్నది. ఖగం అంటే 'ఖే–ఆకాశే, గచ్ఛతి" – ఆకాశమున పోవువాడు. ఆకాశానికి ఒక నిర్దిష్టమైన అవధులు లేవు. అది పరమాత్మ మొదటి అవిర్భావ సంబంధమైనది కనుక పరమాత్మునకు వలెనే ఇందుగల దందులేదని సందేహము వలదు అని సంభావించడానికి యోగ్యమైనది. ఆదిత్యుడు అటువంటి ఆకాశంలో గమనశీలం కలవాడు అని ఖగ శబ్దం తెలియజేస్తున్నది. ఇది సర్వవ్యాపకతకు సంకేతం. (సశేషం)

(ఆచార్య శలాక రఘునాథ శర్మగారి 'ఆదిత్య హృదయం' నుండి)

## సత్సంగం

### మాయ



బ్రహ్మంతో నిండిన ప్రపంచం, జీవంతో నిండిన దేహంవలె సత్యం. బ్రహ్మంతో నిమిత్తం లేని ప్రపంచం స్వయం సమృద్ధమనుకోవటం, కళేబరం వలె కల్ల అంటారు శ్రీ భగవాన్.

యథార్థానికి వికృత రూపం మాయ. యథార్థ మొక్కటే గాని బహుళంగా కనబడుతుంది. ఉన్నదల్లా స్వచ్ఛమైన తెల్లని కాంతి ఒక్కటే కాని ప్రిజమ్ ద్వారా వెళ్ళినప్పుడు ఏడు రంగులుగా కనబడుతుంది. అవి అందంగా, ఆకర్షవంతంగా ఉంటాయి. మనం వాటి వల్ల ఆకర్షితులవుతాం. కాని సత్యమేమంటే ఆ ఏడు రంగులకీ మూలం స్వచ్ఛమైన తెల్లని కాంతే. ప్రిజమ్‌ను తీసివేయగానే రంగులు మాయమవుతాయి. మనస్సనబడే ప్రిజమ్‌ని తీసివేస్తే ప్రపంచమంతా స్వచ్ఛమైన జ్యోతివలె ప్రకాశిస్తుంది. అదే బ్రహ్మం. మనస్సు ఆత్మలో లీనమయిపోతే మనకి కూడా అన్నిట్లో బ్రహ్మమే కనబడుతుంది. అసలు అప్పుడు ద్రష్ట అంటూ ఎవరూ ఉండరు. దృశ్యము, ద్రష్టా, కారణమూ, కార్యమూ, ఒక్కటవుతాయి. ఈ స్థితి వాఙ్మనోతీతం. ఇది అనుభవ వేద్యమే కాని ఇంకేమీ కాదు.



సినిమా కనబడాలంటే హాలులో చీకటి ఉండాలి. తెరమీద మనం బొమ్మల్ని ఆ చీకటి వల్లనే చూడగలుగు తున్నాం. అజ్ఞానాంధకారం వల్లే ప్రపంచాన్ని పేర్లతో, రూపాలతో నిండిన ప్రదేశం వలె చూస్తున్నాం. వెలుగులో తెరమీద బొమ్మ కనబడదు. అంతా తెల్లగా ఉంటుంది. అంటే, తెల్లని తెరలో బొమ్మ కలిసిపోతుంది. బొమ్మా తెరా ఒకటే అయిపోతాయి. అందువల్లనే అజ్ఞానాంధకారం తొలగినప్పుడు అనుభవమయ్యేది ఒకటే, అనేకం కాదు. ఉన్నదల్లా ఒక్కటే. మనస్సు కల్పించే బ్రహ్మ వలె అది అనేకంగా కనబడుతుంది. మనస్సు హృదయంలో కలిసిపోయినప్పుడు అంతా ఏకమే. అనేకం లేనే లేదు!!

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 4  హైదరాబాద్ ఫిబ్రవరి : 2025

# చదువు, సంస్కృతి ఆయుధాలుగా ప్రతిఘటన : బయో పాలిటిక్స్ సిద్ధాంత నేపథ్యంలో 'వెలుగు దారులలో' ఆత్మకథ

**ఆచార్య గంపా వెంకటరామయ్య,** ఆచార్యులు, భారతీయ ఆధునిక భాషల శాఖ, ఢిల్లీ విశ్వవిద్యాలయం.
ఫోన్ : 995 860 7789

నంబూరి పరిపూర్ణ రచించిన **వెలుగు దారులలో** ఆత్మకథ సమకాలీన తెలుగు సాహిత్యంలో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ ఆత్మకథ 2017లో వెలువడింది. సామాజిక నిర్మాణం, విద్య, రాజకీయాలు, జెండర్ మొదలైన అంశాలను చర్చించిన ఒక ముఖ్యమైన రచనగా విమర్శకులు పేర్కొన్నారు. వ్యక్తిగత వ్యవస్థకు, సామూహిక కట్టుబాట్లకు మధ్య ఉద్రిక్తతలను స్పష్టంగా చిత్రించిన రచన. ఈ ఆత్మకథ సమకాలీన సాహిత్యంలో బయోపాలిటిక్స్ (జీవరాజకీయాలను) అన్వేషించడానికి సమాచారాన్ని అందిస్తుంది. బయో పాలిటిక్స్ అనేది ఒక రాజకీయ సిద్ధాంతం. ఇది సామాజిక, సాంస్కృతిక అధ్యయనాలలో ముఖ్యమైన విషయాలను చర్చించే సిద్ధాంతాలలో బయోపాలిటిక్స్ సిద్ధాంతం పేర్కొనదగినది.

సామాజిక నిర్మాణాలు, సంస్థలు, అధికారం మొదలైన అంశాలు వెలుగు దారులలో రచనలలో ఏ విధంగా చర్చించబడ్డాయో బయోపొలిటికల్ సిద్ధాంతం ద్వారా పరిశీలించడం ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశం Michel Foucault తమ సిద్ధాంతంలో పేర్కొన్న విషయాలు, వెలుగు దారులలో రచనలు కనిపించే ప్రధాన పాత్ర మనస్సు, భావోద్వేగ జీవితాలను బహిరంగ మరియు సూక్ష్మమైన జీవ రాజకీయ శక్తులు ఎలా నియంత్రిస్తాయో ఈ వ్యాసంలో చర్చించడం జరిగింది. కులం, వర్గం, లింగం, వ్యక్తిగత స్వేచ్ఛ అనే ఇతివృత్తాలను పరిశోధించడం, ఈ రచన రాజకీయ దృశ్యాన్ని ఎలా విమర్శిస్తుందో వివరించడం, వ్యవస్థాగత నియంత్రణ మరియు వ్యక్తిగత స్వయంప్రతిపత్తి మధ్య ఉద్రిక్తతలను ఈ వ్యాసంలో వివరించే ప్రయత్నం జరిగింది.

**బయో పాలిటిక్స్ సిద్ధాంతం : సంక్షిప్త పరిచయం**

వెలుగు దారులలో రచనను పరిశీలించే ముందు బయోపాలిటిక్స్ సిద్ధాంతాన్ని క్లుప్తంగా పరిచయం చేయడం అవసరం. బయో పాలిటిక్స్ అనే పదం ఫ్రెంచ్ తత్వవేత్త Michel Foucault తో చాలా దగ్గరి సంబంధం కలిగి ఉంది. సిద్ధాంతకర్త ఆధునిక సమాజంలో అధికారం యొక్క మారుతున్న స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి బయోపాలిటిక్స్ అనే సిద్ధాంతాన్ని పరిచయం చేశారు. ఆధునిక యుగంలో రాచరిక పాలన లేదా నియంతృత్వ రూపాల ద్వారా అధికారాన్ని కొనసాగించడం కష్టమని, అటువంటి చర్యలు ఇకపై పనిచేయవని Michel Foucault తన The Birth of Biopolitics (LECTURES995 AT THE COLLÈGE DE




FRANCE, 1978–79) అనే రచనల్లో వివరించారు. ఆధునిక కాలంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రారంభమైన తర్వాత అధికారం ఎక్కువగా 'జీవశక్తి' రూపాన్ని తీసుకుంటుంది, ఇది రాష్ట్రాలు లేదా ఇతర అధికార రూపాలు మానవ జీవితాన్ని నియంత్రించే ప్రయత్నం చేస్తాయని Michel Foucault వివరించారు. అధికారం అనేది శరీరం, పునరుత్పత్తి, ఆరోగ్యం మరియు ప్రజల శ్రేయస్సుపై దృష్టి పెడుతుంది. Michel Foucault అభిప్రాయం ప్రకారం అధికారం వ్యక్తి జీవితాన్ని తయారు చేసే వ్యవస్థగా మారుతుందని, ఇది క్రమంగా వ్యక్తి జీవితాన్ని తీసుకుంటుందని పేర్కొన్నారు. Michel Foucault అభిప్రాయం ప్రకారం వ్యక్తి యొక్క జీవితం పూర్తిగా అధికారం నియంత్రణలో ఉంటుంది. ఈ అధికారం వ్యక్తిగత మరియు సామూహిక జీవన మార్గాలను రూపొందించే సంస్థగా మారుతుంది. అధికారమనేది కొన్ని పద్ధతులు, నిబంధనల ద్వారా పనిచేస్తుంది. ఉదాహరణకు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు, విద్యా సంస్థలు, జెండర్, పునరుత్పత్తిని నియంత్రించే చట్టాలు, సాంస్కృతిక పద్ధతుల ద్వారా బయోపాలిటిక్స్ నియంత్రణ వ్యక్తమవుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే వ్యక్తులు తమ జీవితాన్ని తమకు నచ్చినట్లు కాకుండా అధికారం లేదా వ్యవస్థ రూపొందించిన చట్రంలో జీవించడం అనేది జరుగుతుంది. పైకి అన్ని సవ్యంగా కనిపించి నప్పటికీ అధికారమనేది వివిధ రూపాలలో వ్యక్తి జీవితాన్ని, ఆలోచనలను నియంత్రిస్తూ ఉంటుంది.

సమకాలీన సాహిత్యంలో వ్యక్తుల జీవితాలపై ఆధునికత, వలసవాదం, వలసానంతర వాదం యొక్క విస్తృత ప్రభావాలను ప్రశ్నించడానికి బయోపాలిటిక్స్ సిద్ధాంతం రచయితలను

అనుమతిస్తుంది. రాజకీయ వ్యవస్థలు, సామాజిక నిర్మాణాలు, సాంస్కృతిక నియమాలు జీవితంలోని అత్యంత మౌలిక అంశాలను నియంత్రించడానికి ప్రయత్నించే మార్గాలను వెలుగు దారులలో వంటి రచనలు చర్చిస్తాయి. బయో పాలిటిక్స్ అనేది కేవలం సైద్ధాంతిక అంశం మాత్రమే కాదు; స్వయంప్రతిపత్తి, స్వేచ్ఛ మరియు గుర్తింపు కోసం ప్రయత్నించే వ్యక్తులు తమ ఉనికిని శాసించే రాజకీయ శక్తులతో పోరాడే పాత్రలకు సజీవ వాస్తవ రూపం వెలుగు దారులలో రచనలో కనిపించే నంబూరి పరిపూర్ణ.

అణగారిన వ్యక్తుల జీవితాలను నియంత్రించడానికి కులం, వర్గం, జెండర్, క్లాస్ ఎలా పనిచేస్తాయో నంబూరి పరిపూర్ణ ఆత్మకథ వెలుగు దారులలో కనిపిస్తుంది. బయోపాలిటిక్స్ సిద్ధాంతం ఆధారంగా చర్చించడానికి ఈ రచన ఒక ముఖ్యమైన ఆకరంగా ఉపయోగ పడుతుంది.

బయో పాలిటిక్స్ సిద్ధాంతం ఆధునిక సమాజాలలో అధికారం యొక్క పనితీరుతో అనుసంధానిస్తుంది. బయో పాలిటిక్స్ వ్యక్తిగత మరియు సామూహిక శరీరాలను ప్రభావితం చేసే అంశాలతో పాటు నియంత్రించే మార్గాలను విశ్లేషిస్తుంది. అదే విధంగా వ్యవస్థ పనిచేసే విస్తృత సామాజిక నిర్మాణాలను కూడా ఈ విభాగం పరిశీలిస్తుంది.

**బయో పాలిటిక్స్ సిద్ధాంతం – చారిత్రక నేపథ్యం:**

బయో పాలిటిక్స్, ఒక సైద్ధాంతిక నిర్మాణంగా, 20 వ శతాబ్దం మధ్యలో ఈ ఆలోచనను అభివృద్ధి చెందింది. ఈ సిద్ధాంత వ్యాప్తికి కృషి చేసిన వారు Michel Foucault. ఆధునిక సమాజాలలో అధికారం మరియు పాలనపై విస్తృతంగా అధ్యయనం చేశారు. ముఖ్యంగా అతని ప్రధాన గ్రంథాలు ది హిస్టరీ ఆఫ్ సెక్సువాలిటీ (1976) మరియు సొసైటీ మస్ట్ బి డిఫెన్స్ (2003). Michel Foucault ప్రకారం, బయో పాలిటిక్స్ రాజ్యం, ఇతర సామాజిక సంస్థలు అధికారాన్ని ఉపయోగించే విధానంలో మార్పును సూచిస్తుంది. యుద్ధం, శిక్ష వంటి సార్వభౌమాధికారం యొక్క శక్తిపై దృష్టి పెట్టడానికి బదులుగా, బయో పాలిటిక్స్ జీవితాన్ని శాసించే శక్తి యొక్క పెరుగుదలను సూచిస్తుంది, మానవ జీవన విధానం ఉత్తమంగా ఉండడానికి రూపొందించిన సంస్థలు క్రమంగా నిబంధనలు మరియు విధానాలను రాజ్యానికి అనుకూలంగా మార్చడం ద్వారా రాజ్యం వ్యక్తిని నియంత్రిస్తుంది. Michel Foucault ప్రకారం, ఈ మార్పు 17 వ శతాబ్దం చివరిలో మరియు 18 వ శతాబ్దం ప్రారంభంలో సంభవించింది, ఆధునికత ఆవిర్భావంతో పాటు సార్వభౌమాధికారం వ్యక్తి జీవితంపై దృష్టి పెట్టడంగా మార్పు చెందింది. Michel Foucault యొక్క బయో పాలిటిక్స్ సిద్ధాంతం రోజువారీ జీవితంలో అధికారం బహిరంగ హింస లేదా అణచివేత ద్వారా కాకుండా, వ్యక్తి నియంత్రణ, వ్యక్తిగత గుర్తింపును రూపొందించే నిబంధనల నిర్మాణం గురించి ఎక్కువగా చర్చిస్తుంది. రాజ్య నియమాలు ప్రజలు ఏమి చేస్తారో మాత్రమే కాదు, వారు ఎలా ఆలోచిస్తారు, ఏ విధంగా అనుభూతి చెందుతారు? తమ అభిప్రాయాలను ఎలా వ్యక్తపరుస్తారు? మొదలైన అంశాలపై దృష్టిపెడుతుంది.

**బయో పాలిటిక్స్ సిద్ధాంతం వ్యక్తిగత శరీరం మరియు రాజకీయ శరీరం :**

బయో పాలిటిక్స్ లోని ప్రధాన ఆలోచనలలో ఒకటి వ్యక్తిగత శరీరం మరియు రాజకీయ శరీరం మధ్య సంబంధం. Michel Foucault యొక్క బయో పాలిటిక్స్ శరీరం యొక్క భావన వ్యక్తిగత శరీరాలను సంస్థలు రూపొందించే, నిర్వహించే మరియు నియంత్రించే విధానాన్ని సూచిస్తుంది. ఈ అర్థంలో శరీరం రాజకీయ నియంత్రణకు, వ్యక్తులపై అధికారాన్ని సాధించడానికి ఒక సాధనంగా మారుతుంది.

నంబూరి పరిపూర్ణ కమ్యూనిస్టు విద్యార్థి సంఘంలో పనిచేశారు. అదే సంఘంలో ఉన్న దాసరి నాగభూషణం అనే విద్యార్థి నాయకునితో వివాహం జరిగింది. **"అసమాన విద్యార్థి నాయకుడుగా పేరుబడి ఉన్న ఎన్.ఆర్. దాసరి అంతటి వ్యక్తి నన్ను తన సహచరిని చేసుకునేందుకు ముందుకు రావడం అనేది ఓ అసాధారణ విషయంగా తోచింది నాకు. అతనితో జీవితాన్ని పంచు కొనడాన్ని మించింది ఇంకేముంటుందీ అనిపించింది. అది ఒక వెర్రి మోజుతో గూడిన వ్యక్తి ఆరాధన!"** (పరిపూర్ణ, నంబూరి. వెలుగు దారులలో, పుట–92) అని రచయిత్రి చెబుతారు. అతనికి గతంలో వివాహం అయ్యింది. కానీ కొన్ని సమస్యలతో వివాహం కొనసాగలేదని ఎన్.ఆర్. దాసరి నంబూరి పరిపూర్ణ కుటుంబ సభ్యులకు చెప్పారు. **"చిన్నతనం, అమాయకత్వం వల్ల ఆ అసత్యాన్ని నేను నమ్మడమనేది సహజమే. కానీ అన్నయ్యలూ, అమ్మా నాయనా కూడా నమ్మడ మేమిటి? అందుకు కారణముంది మరి. ఆరోజుల్లో కమ్యూనిస్టు లన్నవాళ్లు నూటికి నూరుపాళ్లు నిఖార్సయిన నిజాయితీపరులు. ఎట్టి పరిస్థితులలోనూ అబద్ధమాడరు అన్న భావన, నమ్మకం అందరికీ వుండేది. అన్నయలిద్దరూ కమ్యూనిస్టు నేతలు. సాటి కమ్యూనిస్టు విద్యార్థి నాయకుడు అసత్యం చెప్పి వుంటాడని ఎలా అనుకొంటారు? అంతే గాదు పెద్ద కుటుంబానికి చెందిన విద్యార్థి నాయకుడు మన అమ్మాయిని ఇష్టపడి వివాహమాడడానికి సిద్ధపడడం, మనకది ఒక గర్వకారణం అన్న రీతిగా ఆలోచించి దాసరితో చెల్లి పెళ్లి జరగడం చాలా ఘనమైన విషయంగా భావించారు"** (పైదే. పుట– 94). కానీ అదే కమ్యూనిస్టు నాయకుడు ముగ్గురు సంతానం కలిగిన తరువాత కుటుంబాన్ని విస్మరించారు.

అప్పటికి రెండేళ్ల తర్వాత దాసరిగారొచ్చారు. సంతోషంలో తలమునకలవుతూ పోస్టింగ్ ఆర్డరు చూపించాను. చూచి అయిష్టంగా నొసలు విరిచారు. **"నేను ఈ ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తున్న**

**కమ్యూనిస్టును, మరి నా భార్య ఇదే ప్రభుత్వ ఉద్యోగిని ఎలా కాగలుగు తుంది? ఈ ఉద్యోగంలో నువ్వు చేరడానికి వీల్లేదు."** అన్నారు గట్టిగా, **"పిల్లల కోసం, వాళ్ల భవిష్యత్తు కోసం కాస్త పైస్థాయిలో ఉన్న ఈ ఉద్యోగంలో చేరడం మంచిది కదా! మీకిష్టమైనా కాకపోయినా నేను చేరకతప్పదు. తప్పకుండా వెళ్లి జాయినవుతాను"** అని నిక్కచ్చిగా చెప్పాను. ససేమిరా ఏల్లేదంటూ గట్టిగట్టిగా కేకలు వెయ్యసాగారు. అమ్మ కలుగజేసుకుని, నన్ను అనంతపురం వెళ్లి జాయినవ్వనియ్యమని నచ్చజెప్పే ప్రయత్నానికి పూనుకుంది. **"మాకు సంబంధించిన విషయమిది. ఇందులో నీ జోక్యమెందుకు? మాట్లాడక,"** అంటూ గదిమారు. ఆయనింకే మాత్రం అనుమతించేట్టు లేరని అర్థమై, **"అమ్మ పెట్టా పెట్టదు, అడుక్కు తిననివ్వదు అన్నట్టు – పిల్లనెందుకు అడ్డుకుంటున్నారు. రాకరాక వచ్చిన ఓ మంచి ఉద్యోగంలోకి వెళ్లనియ్యకుండా?"** అంది అమ్మ ఉక్రోషంగా, ఇంకేముంది చర్రున లేచి కొట్టడానికి ఆమె మీద మీదకెడుతుంటే నేను రెండు చేతుల్తో చుట్టేసి, ఆయన్ని అడ్డుకున్నాను. **"ఎంత అవమానకరమైన సంఘటన ఇది? అత్తగారు తన సాటికులం మనిషయి వుంటే కొట్టడానికి ఇలా ఎగబడేవారేనా అని మనస్సు కలుక్కుమంది."** (పైదే. పుట–101)

ఒక వ్యక్తి జీవితాన్ని సంస్థలు రాజకీయ నాయకులు నియంత్రించాలనే ప్రయత్నం చేయడం బయోపాలిటిక్స్ లో కనిపించే ముఖ్యమైన అంశం. భావజాలం ఏదైనాప్పటికీ సంస్థలు/ సంస్థ ప్రతినిధులు వ్యక్తులను నియంత్రించే ప్రయత్నం జరుగుతూ ఉంటుంది. అటువంటి ప్రయత్నమే నంబూరి పరిపూర్ణ విషయంలో కనిపిస్తుంది. ఒక దశ తర్వాత భర్త గారైన దాసరి సంతానాన్ని, భార్యను పూర్తిగా విస్మరించినట్లు రచయిత్రి రచనలో పేర్కొన్నారు. వ్యక్తులు తమ ప్రమేయం లేకుండానే వ్యవస్థ రూపొందించే విధానాలకు అనుకూలంగా జీవన విధానాలను మార్చుకుంటారు.

**బయోపాలిటిక్స్ సంస్థల పాత్ర మరియు సాంస్కృతిక నిబంధనలు**

జీవితాన్ని క్రమబద్ధీకరించడంలో సంస్థల పాత్ర బయోపాలిటిక్స్ యొక్క మరొక కీలక అంశం. వెలుగు దారులలో రచనలో పాత్రల అస్తిత్వాలను నిర్ణయించడంలో కుటుంబం, గ్రామం, కుల ఆధారిత సంస్థల పాత్ర ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఈ సంస్థలు పాత్రలపై సామాజిక నియమాలను విధిస్తాయి, వారు ఎలా ప్రవర్తిస్తారు? ఎవరితో సహవాసం చేస్తారు? వారు తమ స్వంత విలువను ఎలా గ్రహిస్తారో ప్రభావితం చేస్తాయి. పాత్రలు ఈ సంస్థల అధికారానికి లోబడి ఉంటాయి. ఇవి ఎల్లప్పుడూ కనిపించే లేదా స్పష్టంగా కనిపించని కానీ లోతుగా అనుభూతి చెందే విధంగా వారి జీవితాలను రూపొందిస్తాయి.

బయోపాలిటిక్స్ సిద్ధాంతంలో సాంస్కృతిక నియమాలు కూడా శక్తివంతమైనవిగా పనిచేస్తాయి. ఈ సాంస్కృతిక నిబంధనలు, సంస్థాగత విధానాల మాదిరిగానే, శరీరాలు, భావోద్వేగాలు మరియు గుర్తింపులను నియంత్రిస్తాయి, సామాజిక వ్యవస్థను నిర్వచించే అధికార నిర్మాణాలను బలోపేతం చేస్తాయి. **"బ్రాహ్మణ పురోహిత వర్గాలు తమ వృత్తితోపాటు 'యాయవారం' (యాచన) జరుపుకున్నట్లు గానే దాసర్లలో కూడా నిరుపేదలు 'యాయవారానికి' వెళుతుండే వారు. అది తమ కులాచారమని తలచేవారు. అయితే వీరిలో అధిక సంఖ్యాకులు ఆయుర్వేదాన్ని తమ వారసత్వ వృత్తిగా చేపట్టి, గ్రామాల్లో పర్యటిస్తూ వైద్యసేవ లందించేవారు. కాలక్రమాన ప్రజలు ఆధునిక వైద్యం వైపు మొగ్గుతూ వీరి వైద్య సేవల్నేగాదు, ఆయుర్వేద వైద్యానికీ దూరమవుతూండడం మనం ఎరిగిన విషయమే.**




**ఈ దాసర్లు లేక 'దాసుళ్ల'లో కొన్ని వంశాలవారు ఏ సానుకూల పుణ్యం వల్లనో మంచి కవులూ కళాకారులుగా, నాటక ప్రదర్శకులుగా మనుగడ సాగించుతుండడం కొన్ని శతాబ్దాలపాటు జరిగింది. అలాగే చాలామంది ఇళ్లల్లో ఆంధ్రపద కోశము, శబ్దార్థ చంద్రిక, ఇతర ఛందస్సులకు చెందిన గ్రంథాలు భద్రంగా వుండేవి. రసపిపాస, భాషాపాటవం కలిగిన వీరు పాటలు, పద్యాలు ఛందోబద్ధంగా అల్లి శ్రుతివక్యంగా పాడుతూండేవారు."** (పరిపూర్ణ, నంబూరి. వెలుగు దారులలో. పుట సంఖ్య–12). వివిధ సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు వారి వృత్తులను అనుసరించి జీవనాన్ని కొనసాగించడం నేటికీ కొనసాగుతుంది. ప్రభుత్వాలు సైతం కొన్ని వృత్తుల వారికి ఉపాధి అవకాశాల పేరుతో ఆ వృత్తులు కొనసాగేలా ప్రోత్సహిస్తూ ఉంది. వ్యవస్థను గతంలో ఉన్న విధానాన్ని అనుసరించి కొనసాగించడం, సామాజిక నిర్మాణ నిచ్చెన సంప్రదాయ పద్ధతులు నిర్మించే ప్రయత్నం చేయడం గమనించవచ్చు. అదే విషయం వెలుగు దారులలో రచనలు కనిపిస్తుంది.

**వెలుగు దారులలో రచన : అధికారం – బయో పాలిటిక్స్ పాత్ర**

ఈ విభాగంలో, వ్యక్తిగత మరియు సామూహిక ఉనికిని శాసించే అధికార నిర్మాణాల ద్వారా వ్యక్తి శరీరం, జీవితం మరియు భావోద్వేగ నియంత్రణపై దృష్టి సారించి, వెలుగు దారుల్లో బయోపాలిటిక్స్ సిద్ధాంత లక్షణాలు ఎలా వ్యక్తమవుతాయో పరిశీలిస్తాము. సంస్థలు, అధికార వ్యక్తులు, సాంస్కృతిక నియమాలు అన్నీ వివిధ పాత్రలపై నియంత్రణను కలిగి ఉండడం, రచనలోని కొన్ని పాత్రలు నియమాలను దాటి వెళ్లడం కనిపిస్తుంది. రచనలోని ప్రధాన పాత్రను, కీలక ఘట్టాలను నిశితంగా విశ్లేషించడం ద్వారా, బయోపాలిటిక్స్ విధానాలు పాత్రల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తాయో ఇందులో గమనించవచ్చు.

**నంబూరి పరిపూర్ణ మరియు అధికారంతో వారి సంబంధం**

ఈ ఆత్మకథలో నంబూరి పరిపూర్ణ కుల వ్యవస్థలోని సామాజిక, సాంస్కృతిక శక్తులచే నిర్బంధించబడిన ఒక వెనుకబడిన కులానికి చెందిన స్త్రీ. కుటుంబం ఎంతో చైతన్యవంతమైనప్పటికీ చాలా సందర్భాలలో సమాజంలో ఉన్న కుల ఆధారిత వ్యవస్థ ద్వారా సమస్యలను ఎదుర్కొన్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. నంబూరి పరిపూర్ణ మనసు, శరీరం, జీవితం బయోపాలిటిక్స్ విస్తృత శక్తులకు వ్యతిరేకంగా ప్రతిఘటనను కోరుకుంటుంది. వ్యక్తిగత గుర్తింపు, గౌరవం మరియు స్వయంప్రతిపత్తి కోసం పరిపూర్ణ పోరాటం వ్యక్తిగత జీవితం మరియు సామాజిక నియంత్రణ మధ్య బయోపాలిటిక్స్ ఉద్రిక్తతను ప్రతిబింబిస్తుంది. కులం, ఆధిపత్యం, వ్యవస్థ కట్టుబాట్ల యొక్క సరిహద్దులను సవాలు చేయడానికి నంబూరి పరిపూర్ణ చేసిన ప్రయత్నం ఆమె వ్యక్తిగత ఉనికిని మరియు భావోద్వేగ జీవితాన్ని నియంత్రించడానికి ప్రయత్నించే వ్యవస్థకు వ్యతిరేకంగా బయోపాలిటిక్స్ ఆలోచన విధానాన్ని ప్రతిఘటించినట్లు రచనలో కనిపిస్తుంది. ఇందులో నంబూరి పరిపూర్ణ కుల, జెండర్ అణచివేత అనే ద్వంద్వ భారాన్ని ఎదుర్కొంటుంది.

వివాహం అయిన తరువాత ఒక దశలో వెలుగు దారులలోని ప్రధాన పాత్ర అయిన నంబూరి పరిపూర్ణ తమ చర్యలను, భావోద్వేగాలను నియంత్రించే సామాజిక, రాజకీయ శక్తుల సంక్లిష్ట వలయంలో చిక్కుకున్నారు. కానీ స్వయంకృషితో, పట్టుదలతో సమస్యల నుంచి వ్యవస్థ సృష్టించిన సంప్రదాయ పద్ధతుల నుంచి బయటకు వచ్చి తన జీవితాన్ని సంతానం యొక్క భవిష్యత్తును నిర్ణయించే మార్గాన్ని ఎన్నుకున్నారు. కమ్యూనిస్టు భావజాలంతో ప్రభుత్వ ఉద్యోగాన్ని విడిచిపెట్టమని చెప్పిన భర్త నిర్ణయాన్ని పక్కనపెట్టి ఉద్యోగంలో చేరి తన ప్రతిభను నిరూపించుకోవడమే కాకుండా తన తరువాత తరాలవారికి ఉత్తమ భవిష్యత్తును చూపించడంలో తన వంతు పాత్ర పోషించారు.

వ్యవస్థలో స్త్రీలు తరచుగా పురుష దృష్టి, సామాజిక ఆకాంక్షలు మరియు సాంస్కృతిక నిబంధనలకు లోనైన శరీరాలుగా మాత్రమే చిత్రించబడతారు. రచనలో నంబూరి పరిపూర్ణ తన జీవిత భాగస్వామి ద్వారా అణిచివేతకు గురయ్యారు. నంబూరి పరిపూర్ణ భర్త విద్యార్థి నాయకుడిగా ఆదర్శ భావాలు ఉన్నవాడుగా కనిపించినప్పటికీ చివరికి అతనిలోనూ పితృస్వామ్య నిర్మాణ లక్షణాలు కనిపించడం బయోపాలిటిక్స్ సిద్ధాంత లక్షణం. అయినప్పటికీ రచనలో నంబూరి పరిపూర్ణ శరీరం మనసు ప్రతిఘటనకు వేదికగా కనిపిస్తుంది. నంబూరి పరిపూర్ణ వివాహం తర్వాత స్త్రీ స్వయంప్రతిపత్తిని నియంత్రించడానికి ప్రయత్నించే పితృస్వామ్య నిర్మాణం ద్వారా ఆమె భావోద్వేగాలు–ఆమె కోరికలు, ఆమె కోపం మరియు ఆమె కలలు ఒక దశ వరకు అణచివేయబడ్డాయి. ఒక మహిళగా ఆమె జీవితంపై భర్త ఉంచిన నిబంధనలు ఆమె భావోద్వేగ జీవితంలో ప్రతిబింబిస్తాయి. వామపక్ష భావజాలంలో కూడా స్త్రీ జీవితం అణచివేయబడుతుంది అని రచన ద్వారా తెలుస్తుంది. వామపక్ష భావజాలంలోనూ కుటుంబం, వివాహం మరియు కులం వంటి సంస్థలు నియంత్రణ యంత్రాంగాలుగా పనిచేస్తాయి, వారు తమను తాము ఎలా చూస్తున్నారో మరియు ఇతరులతో ఎలా సంబంధం కలిగి ఉన్నారో నిరంతరం రూపొందిస్తారు. ముఖ్యంగా స్త్రీలు తమ శరీరాలను ఎలా ఉపయోగించాలో, వారి భావోద్వేగాలను ఎలా వ్యక్తపరచాలో, సమాజంలో వారు ఎలా ప్రవర్తించాలో నిర్దేశించే నిబంధనల వ్యవస్థను సంస్థలు అమలు చేస్తాయి. అదే పద్ధతి నంబూరి పరిపూర్ణపైన భర్త తన అధికారాన్ని అమలు చేసే ప్రయత్నం చేశారు.

**శరీరం, జీవితం, భావోద్వేగాల నియంత్రణ**

బయోపాలిటిక్స్ సిద్ధాంతంలో వ్యక్తుల శరీరాల నియంత్రణ అనేది కూడా ఒక ముఖ్యమైన భావన. ఈ నియంత్రణ శారీరక పరిధిని దాటి జీవితంలోని భావోద్వేగ మరియు మానసిక అంశాలకు విస్తరించింది. వెలుగుదారులలో రచనల్లో పరిశీలించినట్లయితే నంబూరి పరిపూర్ణ కుటుంబం సామాజికంగా వెనుకబడిన వర్గంలో జన్మించారు. చాలా సందర్భాలలో తెలుగు ప్రాంతాలలో ఉండే కుల వివక్షత చవిచూశారు. కొన్ని సందర్భాలలో కట్టుకున్న భర్తతోను మరికొన్ని సందర్భాలలో చదువుకుంటున్నప్పుడు.. సామాజికంగా ఉన్న కట్టుబాట్లు కుల వివక్షత ఎదుర్కొన్నారు. వ్యవస్థలో ఉన్న అంతర్గత అసమానతలను అవగతం చేసుకొని జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు వెళ్లారు. శారీరక శ్రమతో పాటు మేధోపరమైన ఆలోచనతో జీవితంలో నిర్దేశించుకున్న గమ్యాన్ని చేరుకున్నారు. తను నిర్దేశించుకున్న స్థానానికి చేరే సందర్భాలలో ఎన్నో రకాలైనటువంటి సమస్యలను ఎదుర్కొన్నారు. ఆ క్రమంలో భావోద్వేగ నియంత్రణ నంబూరి పరిపూర్ణ జీవన పోరాటంలో స్పష్టంగా కనిపిస్తుంది. కొన్ని సందర్భాలలో కోపం, శక్తిహీనత యొక్క భావాలు సమాజంలో తన స్థానాన్ని అర్థం చేసుకోవడం ద్వారా రూపుదిద్దుకున్నాయి. నంబూరు పరిపూర్ణ తన జీవితం తాను

పనిచేసిన ఏజెన్సీ యొక్క వనరుగానో, సంప్రదాయ భావజాలంతో కూడిన భార్యగా ఇంటికి పరిమితమై దుఃఖంతో జీవితాన్ని ముగించడానికి బదులు, వ్యవస్థ నిర్మించిన నిబంధనలను ప్రతిఘటించడానికి ఆమె చేసిన ప్రయత్నం సామాజిక వ్యవస్థలో తన స్థానాన్ని నిర్మించుకున్నారు.

**స్వయంప్రతిపత్తి VS సామాజిక నియంత్రణ**

వ్యక్తిగత స్వయంప్రతిపత్తికి, సామాజిక నియంత్రణకు మధ్య సంఘర్షణ వెలుగు దారులలో ఒక ప్రధాన అంశం. వెలుగు దారులలో ఆత్మకథలో క్రమబద్ధీకరణ చేయడానికి ప్రయత్నించే వ్యవస్థలు నంబూరి పరిపూర్ణ తన ఉనికిని చాటుకోవడానికి ఎంతో కష్టపడాల్సి వస్తుంది. యుక్త వయసులో ఉన్న ఒక స్త్రీ భర్త విధించే సనాతన సంప్రదాయ నిబంధనలను వ్యతిరేకించడం, ముగ్గురు బిడ్డల బాధ్యత తీసుకొని ముందుకు వెళ్లాలనుకోవడం, తనకోసం తన సంతానం కోసం ప్రభుత్వ ఉద్యోగం చేయాలనుకోవడం మొదలైన అంశాలు వ్యక్తి స్వాతంత్రానికి, కనిపించని సామాజిక కట్టుబాట్లకి జరిగిన సంఘర్షణ రచనలు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ ఆత్మకథలో పరిపూర్ణ జీవన ప్రయాణం భర్త నిర్ణయాన్ని ధిక్కరించి ముందుకు వెళ్లాలనుకోవడం సాహస చర్యగా పేర్కొనాలి. కులాంతర వివాహంలో అందులోను ఒక అగ్రవర్ణ వ్యక్తిని వివాహం చేసుకున్నప్పుడు ఆ వ్యక్తి లేదా ఆ వ్యక్తి కుటుంబ నిర్ణయాల ప్రకారం జీవితాన్ని కొనసాగించడం భారతదేశంలో కొనసాగుతున్న ఒక పద్ధతి. కానీ భర్త సంప్రదాయ నిర్ణయాల కంటే పిల్లల ఉజ్వల భవిష్యత్తు కాంక్షించిన నంబూరి పరిపూర్ణ జీవన ప్రయాణం తర్వాత కాలంలో ఉత్తమ ఫలితాలను అందించింది.

**ఉపయోగించుకున్న పుస్తకాలు**

**ప్రాథమిక ఆధారం**

పరిపూర్ణ, నంబూరి. వెలుగు దారులలో. హైదరాబాదు: ఆలంబన ప్రచురణలు, 2017.

**ఆంగ్ల పుస్తకాలు**

Foucault, Michel (Ed.) Birth of Biopolitics (LECTURES AT THE COLLÈGE DE FRANCE, 1978-79) Hampshire: PALGRAVE MACMILLAN, 2008.

Prozorov Sergei & Simona Rentea (Ed.). THE ROUTLEDGE HANDBOOK OF BIOPOLITICS. New York: New York: Routledge, 2017.

❖ ❖ ❖ ❖ ❖

## పుస్తకాలు జ్ఞాన ప్రదాతలు ..!

**డా. గన్నోజు శ్రీనివాసాచార్య, ఫోన్ : 8555899493**



పుస్తకాలు చదువ మస్తకానికె తెల్వి
తెలియని విషయాలు తేటపరచి
మంచిచెడులరీతి మనకు తెల్పియుచూడ
పఠితల కిల జ్ఞానపథము చూపు!

గ్రంథపఠన మెపుడు కమనీయ లక్ష్యమ్ము
పెక్కుపుస్తకాలు పెంచు తెలివి
సమయమింత దొరక చక్కగా చదువుము
కోరుకున్న పదవి చేరు నీకు!

విద్య ఎల్లలేని విస్తృత జ్ఞానమ్ము
నిష్ఠ తోడ చదువ కష్టమేమి
మనసు బెట్టి నేర్చ మర్మ మరయుచూడ
విద్య నేర్పు వల్ల విశదమగును!

వివిధ ప్రక్రియలన్ని విధిగా చదవగా
నవ్య కవితల కిల నాందియగును
సమయభావ తోడ చక్కగా చదివినా
మస్తకంబు జ్ఞానపుస్త కంబు!

నీతిశాస్త్రములను నిష్ఠగా నేర్చినా
పండితుండు గాను ప్రముఖుడయ్యు
కవి కవితల వ్రాసి ఖ్యాతి నార్జించుచు
పఠితుల మదిలోన పరవశించు!

పొత్తములను చదువ పోవు నజ్ఞానము
తెలివి మదిని హెచ్చి తేజరిల్లు
చదువు మర్మమెల్ల చక్కగా తెలిసినా
ఎదురులేదు మీకు బెదురు లేదు!

ISSN 2457-0796

UGC CARE List Approved Journal

మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 4  హైదరాబాద్ ఫిబ్రవరి : 2025

# చరిత్రలో ఒక ప్రేమ ఆనవాలు "నాగలాదేవి" నవల (శ్రీకృష్ణదేవరాయల ప్రేమకథ)

**ఆచార్య ఎం. గోనానాయక్,** తెలుగు విభాగం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ. ఫోన్ : 98490 93300




చారిత్రక నేపథ్యంలో పరిశీలించినప్పుడు ఒక చరిత్రను ప్రక్రియలో ఇమిడ్చి తెలియ జేసినప్పుడు ఏ రచయిత అయినా వాస్తవికత నేపథ్యంలో భాషను భావనతో కలిపి ప్రక్రియను పండిస్తాడు. ప్రధానంగా నవలా ప్రక్రియ అయితే వివరణాత్మకంగా విశదం చేసే వెసులుబాటు ఉంటుంది.

గతాన్ని, అందులో జరిగిన పరిణామాలను వివరణాత్మకం చేసేటప్పుడు పరిశోధన ఎంతో అవసరం. ఇది ఒక కోణమైతే మరొక కోణంలో నేటివిటీకి దగ్గరగా నవలను తీర్చిదిద్దడంలో ఎన్నో విషయాలనాశ్రయిస్తాడు. ఎందరినో సంప్రదిస్తాడు. అప్పటికీ నవల, అందునా చారిత్రక నవలను తీర్చిదిద్దడంలో అతని శ్రమ నూటికి నలభై అయిదు శాతం విషయ సేకరణ ఆధారాలపై ఆధారపడితే, మిగిలిన యాభై అయిదు శాతం స్వకపోల సృజనపై ఆధారపడి ఉంటుంది. ఇవి భారతీయ సమాజంలో స్వాతంత్ర్యానికి పూర్వం, అనంతర ఇతర భాషల్లోలాగనే తెలుగులోను చోటు చేసుకున్నాయి. ప్రధానంగా తొలితరం, మలితరం అని వింగడించి పరిశీలిస్తే – నాటి కవి సమ్రాట్ నోరి నరసింహశాస్త్రి గారి నుండి ఆచార్య ముదిగొండ శివప్రసాద్ గారి దాకా అందరూ పై విధానాలనే అనుసరించారు. ఇది ఒక పార్శ్వం అయితే ఈ విధానాలకు, ఆ చారిత్రక నవలా రచయితలకు భిన్నంగా 2022 సం॥లో శ్రీ భగీరథ గారు ఆవిష్కరించిన 'నాగలాదేవి' శ్రీకృష్ణదేవరాయల ప్రేమకథ పేరుతో ఉన్న చారిత్రక నవల విషయపరంగానూ, విశదీకరణ పరంగానూ ఉన్నత, ఉత్తమ ప్రమాణాలతో ఉందంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు.

రచయిత విషయానికొస్తే భగీరథ గారు వృత్తిరీత్యా జర్నలిస్టు. ప్రవృత్తిపరంగా ఈ 'నాగలాదేవి' నవలను అపూర్వంగా తీర్చిదిద్దారు. ఈ నవల ద్వారా వారు చారిత్రక నవలా రచయితల జాబితాలో చేరిపోయారు. ఇది పొగడ్త కాదు. మనసులో నుండి ఒక అనుభూతితో వచ్చిన మాటలన్నది నిర్ద్వంద్వంగా ఒప్పుకోవాల్సిన విషయం.

ఈ నవలను శిల్ప నేపథ్యంలో పరిశీలిస్తే ప్రధానంగా తెలుగు విమర్శలో 'శిల్పం' అన్నదానికి ఒక ప్రత్యేకమైన అర్థంలో వ్యాప్తం చేసినవారు విశ్వనాథవారే. ఈ విషయాన్ని విశ్వవ్యాప్తం చేసినవారు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారే. అయితే శిల్పాన్ని కట్టమంచి వారు 'కళ' అనే నేపథ్యంలో వాడారు. తిక్కన 'భారతం' గమనిస్తే ఈ శిల్పం గద్య పద్య సమ్మిశ్రణమే అని కూడా కట్టమంచి వారు తెలియజేసారు. ఇక భగీరథ గారి నవల పరంగా శిల్పాన్ని వివేచింపవలసివస్తే ఈ నవల్లో శిల్పం భగీరథ గారి ప్రతిభకు నూటికి నూరుపాళ్ళు ప్రయోజనాన్ని కలిగించింది. వివరాల్లోకి వెళ్ళి ఈ నవలలోని శిల్పాన్ని స్పర్శిస్తే శిల్ప విషయపరంగా ఎన్నో విషయాలు వెలుగు చూస్తాయి.

నవలను భగీరథ గారు ఎందుకోసం వ్రాస్తున్నది స్పష్టంగా తెల్చుకున్నారనడానికి రూఢీ పాఠకులకు అవగతం కావడమే. ఈ నవల ఆది నుంచి చివరి దాకా కవితాత్మకంగా జరిగిందనవచ్చు. అలాగే ఈ నవల్లో రచయిత ప్రతి సంఘటనకు వెనక నేపథ్య వాతావరణాన్ని కంటికి కట్టినట్లు చేసారు.

ఈ నవల్లో పాత్రల రూపకల్పనతో పాటు స్వభావాలను కూడా స్పష్టంగా పాఠకులకు అనుభూతిలోకి వచ్చేటట్లుగా చిత్రించారు. వర్ణనలను నవల పరమార్థానికి దోహదపడేటట్లుగా చిత్రణ చేసారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ–

**"రంగమండపం దగ్గరకు వెళ్లి ఓ మూల నుంచున్నాడు.**

**దేవాలయంలో గంటలు మ్రోగాయి.**

**పూజారులు మంత్రాలు చదువుతున్నారు.**

**అర్చన తర్వాత ఆమెను ఆశీర్వదించారు.**

**ఆమె గర్భగుడిలో నుంచి రంగ మండపంలోకి వచ్చింది.**

**అప్పుడే నట్టువాంగం మొదలైంది." (నాగలాదేవి, భగీరథ, పుట 27)**

అలాగే అధ్యాయాల విభజన యుక్తంగా చేసి, ముగింపుకి అవి సమన్వయం చేశారు. నవల్లో ఆయా సందర్భాలలోని విషయాలు ఔచిత్యాన్ని ప్రదర్శించారు. కృష్ణరాయలు, నాగలాదేవి పాత్రలు పవిత్రతకు ఆనవాళ్ళుగా నిల్చాయి. నాగలాదేవి వేశ్య కుటుంబంలో పుట్టినా గుణ గణాల విషయంలో ఉదాత్తంగా తీర్చిదిద్దారు రచయిత.

ఈ నవల్లో నాగలాదేవి పాత్ర ఈ నవలకు కేంద్రకం, కీలకంగా కూడా రచయిత తెలియజేసారు. ఉదాత్తతకు, త్యాగానికి, నిష్కల్మషతకు ప్రతీకగా కన్పిస్తుంది. తామరపువ్వు బురదలో పుట్టినా మలిన మంటనట్లు నాగలాదేవి వేశ్య కులంలో పుట్టినా నాట్యాన్ని నమ్ముకుందే తప్ప పర పురుషుడిని కన్నెత్తి చూడలేదు. పన్నెత్తి పలకలేదు. తన మనసులో స్థానం శ్రీకృష్ణదేవరాయలకు ఇచ్చింది. అందుకే కృష్ణరాయలను మనసా, వాచా, కర్మణా త్రిగుణాత్మకంగా నమ్ముకుంది. కృష్ణరాయలెవరో తెలియనప్పుడు ఒక వీరునిగా తనని అభిమానించే సామాన్యునిగా భావించుకుంది. కృష్ణరాయలెవరో తెలిసాక తనకంటూ హద్దు లేర్పరచుకుంది. కృష్ణరాయలు ఆమె హద్దులను చెరిపేసి తన జీవితంలో దేవేరిగా నిలబెట్టాడు.

నాగలాదేవిని మానవతావాదిగా రచయిత అనేక కోణాల్లో తెలియజేసారు. ప్రజలే ఆమెకు ప్రాణమన్న విషయాన్ని రచనా శిల్పంలో భాగంగా తెలియజేసారు.

**ప్రజలు బాగా ఇబ్బంది పడుతున్నట్టు చిన్నాదేవి గ్రహించింది.**

**ఎక్కడా పొయ్యి వెలిగించినట్టు కూడా కనిపించలేదు.**

**మంత్రులు, దళపతులు పరిస్థితిని అంచనా వేస్తున్నారు.**

**చిన్నాదేవి వచ్చిందని తెలుసుకున్న ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. చిన్నాదేవికి అందరూ అభివాదం చేశారు.**

**ప్రజల దగ్గరగా గుర్రాన్ని పోనిచ్చి క్రిందకు దిగింది. వతలప్ప, నాయకుడు, తిరుమల దేవ రాయలు ఇద్దరూ అప్రమత్తంగా ఉన్నారు. సాయుధులైన సైనికులు కూడా చిన్నాదేవికి రక్షణగా ఉన్నారు.**

**"చిన్నమ్మవారూ మా కోసం వచ్చారా? అన్నం లేకపోయినా ఫర్వాలేదమ్మా. ఈ ఆనందంతో కడుపు నిండిపోయింది" అన్నది ఓ మహిళ.**

**"మీ మానవతా హృదయం చాలా గొప్పదమ్మా" మరో వృద్ధుడు.**

**"రాయలవారు రాజధానిలో లేరు మా కష్టాలు తీర్చేవారు లేరనుకున్నాము. మా తల్లిలా వచ్చావమ్మా" మరొక బాలుడు.**

**ప్రజల మాటలకు చిన్నాదేవి చలించిపోయింది.**

**వర్షం కారణంగా వారంతా భోజనం చెయ్యలేదని అర్థమైంది.**

**ప్రజలనందరినీ సమీపంలోని దేవాలయానికి తరలించమని వితలప్పతో చెప్పింది. (నాగలాదేవి, భగీరథ, పుటలు 158, 160)**

పై సన్నివేశంలో నాగలాదేవిని హిమాలయం అంత సమున్నతంగా గుణప్రాతిపదికతో రచయిత వివరణాత్మకం చేసాడు.

ఈ నవల ద్వారా రచయితను మూడు వినూత్న కోణాలలో దర్శిస్తాం. మొదటిది రచయిత కోణం. రెండవది పరిశోధక కోణం. మూడవది జ్ఞాన కోణం. ఈ మూడు కోణాల్లో భగీరథ గారు తామేమిటో నిరూపించుకున్నారనిపిస్తుంది. ఒక కోణంలో వారు ఏది తేలికగా తీసుకోనివారుగా దర్శనమిస్తారు.

భగీరథ గారు రాసిన రచనలన్నీ ఒక ఎత్తు అయితే 'నాగలాదేవి' చారిత్రక నవల మరొక ఎత్తు. తులసీదళంతో కృష్ణుడంతటివాడ్ని తూచి తానేమిటో లోకానికి చాటింది రుక్మిణి. అలాగే నాగలాదేవి తన ప్రేమతో, మానవతా హృదయంతో కృష్ణరాయని మనసు గెలుచుకుంది. ఇది యాదృచ్ఛికం కాదు. రచయితలోని తపన, తాత్త్వికత, మరుగునపడిన పాత్రను వెలికితెచ్చే ప్రయత్నం వెరసి ఈ నాగలాదేవి నవలైంది.




నాగలాదేవి నవల చదువుతున్నప్పుడు రుద్రమ్మ, మాంచాల వంటి ఉదాత్త స్త్రీ పాత్రలు పాఠకుని కన్నెదుట నిలుస్తాయి. అంతకంటే హుందాతనంతో, తానెక్కడ పుట్టినా, ఎంత సార్వభౌముని చేపట్టినా నిగర్వితా, దేశాభిమానం ఉన్న స్త్రీమూర్తిగా రచయిత నాగలాదేవిని ఉత్తమ స్త్రీజాతి రత్నంగా తెలిపారు. ఈ సందర్భంలో డా॥ సి.నారాయణరెడ్డి గారి పాట భావం నాగలాదేవికి చక్కగా అమరుతుంది. ఆ భావం – **"మానవజాతి మనుగడకే ప్రాణం పోసింది మగువ. త్యాగంలో అనురాగంలో తరగని పెన్నిధి మగువ"**. ఈ పాదాలు నాగలాదేవి పాత్ర ఔన్నత్యాన్ని చాటిచెప్తాయి. ఈ నవల్లో నాగలాదేవి పాత్ర కేంద్రకం. నాగలాదేవి జీవితాన్ని పొందికగా తీర్చిదిద్దారు భగీరథ గారు.

రచయిత భగీరథ సునిష్టార్థంగా లేని శిల్ప సిద్ధాంతానికి కొత్త అర్థాలను తొడిగిన విశ్వనాథ మార్గాన్ని అనుసరించారు. నవలలో ఆయా సందర్భాలలో చేసిన చర్చలు కథకు అడ్డంకి కాకుండా రచయిత జాగ్రత్తలు తీసుకున్నారు. విశేషమేమిటంటే ఈ నవల్లో ప్రధాన పాత్రతో పాటు ఇతర పాత్రలు కూడా పోటీ పడతాయి.

భగీరథ గారు ఈ నవల్లో నాలుగు విషయాలను ప్రాధాన్య మిచ్చారు. అవి - (1) రచయిత రచనలో ఇమిడ్చిన పరమార్థం (2) ప్రకృతి వర్ణనల సార్థకత (3) ప్రతీకాత్మక పాత్రలు వాటి ఉనికికి సహజత్వానికి దగ్గరగా నిలవడం (4) ఔచిత్యాన్ని, సందర్భాన్ని శుద్ధి చేసే దిశలో ప్రయోగించి చూపడం. దీనివల్ల 'నాగలాదేవి' నవల వాస్తవికతకు దగ్గరగా సంచరిస్తూనే చదివించే గుణాన్ని కలిగి ఉంది.

నాగలాదేవి, కృష్ణరాయల దాంపత్యం మాటలకందనిది. వివాహానికి పూర్వం వారి మధ్య ప్రేమ ఎలా ఉందో, వివాహానంతరం అదే కొనసాగడం విశేషం. మరో విశేషం ఏమిటంటే - ఈ నవల్లో మనుజ ధర్మం అనేది సంఘటనల్లో ఆయా సంఘటనలకు అనుకూలంగా రచయిత శక్తివంతంగా తెలియజేసారు.

రచయిత వృత్తిరీత్యా పత్రికకు సంబంధించిన వ్యక్తి. వార్తనెంత వైవిధ్యంగా అందించారో ఈ నవల్లో చారిత్రకాంశాలను అంత నిబద్ధతతో తీర్చిదిద్దారు. ప్రధానంగా మిగిలిన చారిత్రక నవలల్లో నవలాకర్తలు ఇదమిద్ధంగా నవలా సందర్భానికి అనువైన సమాచారాలనందించే విషయంలో కొంతమేరకే న్యాయం చేసారు. కానీ భగీరథగారు ఈ నవల్లో అంశాలకు నిర్ధారణగా తెలియజేసే కాల సంకేతాలను రోజు, నెల, సంవత్సరం వంటి విషయాలను వివరణాత్మకం చేసారు. నేలటూరు వారు విజయనగర శాసనాలను వెలికి తీస్తే భగీరథ గారు ఆ శాసనాలంతర్గత తేది, సంవత్సరం సమాచారాన్ని సాధికారికంగా అందించారు.

నిజానికి ఈనాడు వ్యాప్తంలో ఉన్న కృష్ణరాయలవారి జీవితానికి సంబంధించిన అనేక వక్రీకరణల వెనుక వాస్తవాలను భగీరథ గారు వెలికితీసే ప్రయత్నం చేసారు. అలాగే మధ్య యుగాల నాడు జరిగిన ఒక ప్రేమకథ ఈ 'నాగలాదేవి' నవల అన్న భగీరథ మాటలు, వారిలోని పరిశోధకుడిని దర్శింప చేస్తాయి.

సంభాషణల్లో అదును, పదును ప్రదర్శించి ఈ నవలలో కథనానికి కొత్తదనం తీసుకు వచ్చారు. అంతేకాకుండా నవల్లో పురంధరదాసు, అన్నమయ్యల పదకవిత్వాన్ని సందర్భం పండించేందుకు వాడుకున్నారు. హృదయం ద్రవించే విధంగా వీరుడు, ప్రేమమూర్తి అయిన కృష్ణరాయలు నాగలాదేవి అంతిమ దశలోని ఆమె అంతరంగాన్ని ఇలా ఆవిష్కరించాడు-

**"మహారాజుగా, మహా మనీషిగా, సమర్థుడైన పాలకుడుగా, ఆరాధకుడుగా, నీ కీర్తి అసరామరంగా ఉంటుంది. నీలాంటి చక్రవర్తి, రాజనీతిజ్ఞుడు, ఈ భూమ్మీద మరొకరు ఉండరు. కాలాలు మారినా, తరాలు గడిచినా, జాతి నిన్ను ఎప్పుడూ మర్చిపోదు. భాషను శ్వాసించి, మతాన్ని శాసించి, సంస్కృతిని పరిరక్షించావు. జాతికి అభయహస్తం అందించావు." (నాగలాదేవి, భగీరథ, పుట 268)**

పై మాటల వలన నాగలాదేవి ఆంతర్యం కడవరకు నిష్కామ కర్మకు, జాతి పట్ల ఆమెకు గల గౌరవం, తనలాగే ప్రభువు నిలబడడం ఆమె జీవితానికి పరిపూర్ణతనిచ్చే విధంగా భగీరథ గారు ఆ పాత్రను తీర్చిదిద్దారు. నాగలాదేవి భగీరథగారి శ్రమ నుంచి పురుడు పోసుకున్న పాత్ర. అందుకే ప్రతి ఘట్టంలోనూ తన ఔదార్యాన్ని ప్రకటించుకుంది.

ఈ నవల్లో వర్ణనలు చదువుతుంటే ఒక బాపిరాజు గారు దర్శన మిస్తారు. అలాగే ధర్మ చర్చల నేపథ్యంలో నోరి నరసింహశాస్త్రిగారు దర్శనమిస్తారు. కథనంలో ముదిగొండ శివప్రసాద్ గారు దర్శనమిస్తారు.

చరిత్రను చక్కని పాలు తేనెల సమ్మిశ్రణంలో భావం జాలువారేలా తన కలం బలంతో శ్రమించి భగీరథ గారు తెలుగు వారిండ్లలో నిల్పిన పదహారణాల తెలుగు అమ్మాయి 'నాగలాదేవి'. ఇంతటి చక్కని నవలను శ్రమ మూలధనంతో ఫలంగా అందించిన భగీరథ గారు నాడు శ్రమతో పట్టుదలతో గంగను భూమిపైకి దింపిన భగీరథునితో సాటి, సరిసాటి. ఇదే వారి నవలకు అందించే పవిత్ర నీరాజనం.


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-

సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక

మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి

వెంటనే శాశ్వత చందాదారులు కండి.

సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక

యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక

శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-

సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 4  UGC CARE List Approved Journal
హైదరాబాద్ ఫిబ్రవరి : 2025

# నీతి శాస్త్రము – తాళపత్ర గ్రంథము

డా. గండ్ర లక్ష్మణ రావు, విశ్రాంతాచార్యులు ఫోన్ : 98493 28036

*( గత సంచిక తరువాయి )*

*యింగితాకార శాస్త్రజ్ఞో బలవాన్ ప్రియదర్శనః*
*శుచి క్లేశామహోద్యక్షో ఫణిహారే విధీయతే-49*

*పద్యానువాదం -*

*చక్కదనము‌ను శాస్త్రవిజ్ఞాన గుణము*
*శత్రువుల గెల్చు బలధైర్య శక్తి గలిగి*
*ప్రియముగాజూచు రాజుకు నయము జేయ*
*భారమును మోయ నగు ఫణిహార మగును*

*అర్థం - యింగిత శాస్త్రజ్ఞానం తెలిసినవాడు, బలముతో కూడీన ధీరత్వం గలవాడు,పలుచని దేహం గలవాడు, ప్రియులను దర్శించేది, శత్రువులను జయించేవాడు, దక్షుండైన రాజుకు బరువు గావలదని తానే భారం మోసేవాడే రాజుకు ఫణిహారములు గాదగుననిన రీతి.*

*భృత్యా బహువిధిజ్ఞయో వుత్తమాధమ మధ్యమా*
*కేన యోగ్య యథాయోగ్యం యో2త్యుత్తమంచ ప్రభు -50*

*పద్యానువాదం -*

*మంచివారలు కొందరు మధ్యములును*
*మరియు తక్కువ వారు ముత్తెరుగులుగను*
*సేవకులుగల్గ తగురీతి జీతమిచ్చి*
*తగువిధంబుగ జూడ నతండె రాజు*

*అర్థం - రాజుకు భృత్యులు బహువిధముల్లై యుందురు. ఉత్తమ మధ్యమ కనిష్ఠకుల సుగుణ దుర్గుణము లెరింగి వారికి తగినజీతమిచ్చి వారి వారిని యటువలె ను మన్నించినవాడె రాజన్న రీతి.*

*వేదవేదాంగ తత్వజ్ఞో జపహెూమ పరాయణః*
*ఆశీర్వాద సహెూనిత్యం యేషు రాజ పురోహితః -51*

*పద్యానువాదం -*

*వేదవేదాంగ వేత్తయై, వివిధ శాస్త్ర*
*వేది యై జపహెూమ పవిత్ర నిష్ఠ*
*రాజు నాశీర్వ దించెడు ప్రాజ్ఞు డెవరొ*
*అతడె రాజపురోహితుడనగ తగును*

*అర్థం - నాలుగు వేదములున్ను, ఆరు శాస్త్రములున్ను , వేదాంత తత్వమున్ను సమస్త గ్రంథ పారాయణం చేసే నిపుణుడైన వాడు , గుణాఢ్యుడైన రాజునకు పురోహితుడు కాదగుననిన రీతి*

*సద్వక్తా గ్రహేత్యాతు లఘుహస్తా జితాక్షరం*
*మేధావీ వాక్పటుత్వో ప్రాజ్ఞోరాజు సలేఖగా -52*



*పద్యానువాదం - ( 8వ పత్రము)*

*పలుకు వెడలినంత ప్రతియక్షరమ్మును*
*వ్రాయ నేర్పు గలిగి వాక్కు గలిగి*
*ప్రాజ్ఞుడైన యట్టి పండితవర్యుడు*
*ప్రభువు దయకు నెపుడు పాత్రుడగును*

*అర్థం - రాజు వొక్క మాట చెప్పిన గ్రహించి వ్రాయ నేర్పుగల్గి, అక్షరజయం గల్గి బుద్ధిమంతుడై వాక్పటుత్వం గల్గి చతుర్విధ ప్రాజ్ఞుండైన వాడు రాజునకు కరుణగాదగునన్న రీతి*

*అనాగత వయో మంత్రి అనాధివ పురోహితః*
*ఉత్తమ క్షత్రియ రాజా అతిశీఘ్రం వినశ్యతి -53*

*పద్యానువాదం -*

*అనుభవమ్ములేని యతడు ప్రధానియై*
*రాజనీతి లేని ప్రభువు గలుగ*
*అక్షరమ్ము రాని యతడుపురోహితు*
*లైన రాజ్య మపుడె భ్రష్టమగును*

*అర్థం - తరతరాలుగా రాజుగాని, ప్రధాని గాని వాన్ని, ప్రధానత్వ మిచ్చి, నుడి యక్షర జ్ఞానం లేనివాణ్ణి పురోహితుడిని చేసినను ఉత్తం క్షత్రియునకు రాజజ్ఞానం లేకున్నను రాజ్యం వేగమే చెడునన్న రీతి.*

*అన్నాదష్టగుణం పిష్టం పిష్టాదష్టగుణం పయః*
*పాయాదష్టగుణం మాషః మాషాదష్టగుణం ఘృతం- 54*

*పద్యానువాదం -*

*అన్నమునకన్న అష్టగుణమ్ము పిండి*
*పిండి కన్ననెన్మిదియు గుణాలు పాలు*
*మరియు నెన్మిది రెట్లగు మాషములును*
*అంతకన్ననెన్మిది యింత లాజ్యమగును*

*అర్థం – అన్నముకన్న పిండి ఎనిమిది గుణాలెక్కువ, పిండి కన్న పాలు ఎనిమిది గుణాలెక్కువ, పాలకన్న మినుములు ఎనిమిది గుణాలెక్కువ. మినుముల కన్న నేయి ఎనిమిది గుణాలెక్కువయని తెలిసేది.*

*అధమా ధనమిచ్ఛంతి ధనం మానం చ మధ్యమా*
*ఉత్తమా మానమిచ్ఛంతి మానోహి మహితాం ధనం – 55*

*పద్యానువాదం –*

*ధనమునే యిష్ట పడువాడధముడనబడు*
*మానమును ధనమును కోరు మధ్యముండు*
*ఉత్తముడు మానమొక్కటే చిత్తమనును*
*ధనము కన్నమానము గొప్ప ధరణిలోన*

అర్థం – అధముడయినవాడు ధనమే యిచ్ఛగించును. మధ్యముడైనవాడు ధనము మానమును యిచ్ఛగించును. ఉత్తముడు మానము మాత్రమే యిచ్ఛగించునన్న రీతి.

*జితా జనపతీ నారీ జితావస్త్రావద్రా సభా*
*జితేన కృషి దుర్భిక్షం గోభిరభ్యాగతో జితా – 56*

*పద్యానువాదం –*

*ప్రభుత గల్గి యున్న పడతిని గెల్చును*
*చదువు సంస్కారములతోడ సభల గెల్చు*
*కష్టపడి నేల పండించ కరువు గెలుచు*
*ఆవులుండిన యతిథి మర్యాద గెలుచు*

అర్థం – రాజత్వం గలిగిన ధనము గలిగిన స్త్రీలను జయించును, విద్య గలిగి వస్త్రాలు గలవాడు సభ గెల్చును. కృషి గలవాడు కరువు గెల్చును. గోవు గలవాడు అనగా పాడీగలవాడు అతిథి అభ్యాగతుల గెల్చుననిన రీతి.

*బాలార్క ప్రేతధూమంచ వృద్ధస్త్రీ పల్వలోదకం*
*రాత్రౌ ధధ్యాన్న భుక్తంచ ఆయుక్షీణే దినే దినే –57*

*పద్యానువాదం –*

*బాల సూర్యుని కిరణాల బారి పడుట*
*ఈడు గడిచిన వనితతో కూడుకొనుట*
*మురికి నీటనుస్నానము , పెరుగు తోడ*
*రాత్రి తినుటలాయువును రాల్చు చుండు*

అర్థం – ప్రొద్దటి యెండ నుండుట, కాటి పొగబారుట, వృద్ధస్త్రీని రమించుట, నిత్యం అశౌచపు నీటిలో స్నానం చేయుట, రాత్రి పెరుగుతో అన్నం తినుట, దినదినం ఆయువు తరుగుననిన రీతి.

*వృద్ధార్క హోమ ధూమంచ బాలస్త్రీ నిర్మలోదకం*
*రాత్రౌ క్షీరాన్న భుక్తంచ ఆయుర్వృద్ధిర్దినే దినే – 58*

*పద్యానువాదం –*

*మాపటెండయు, హోమధూమమ్ము సోక*
*యువతితో రతియును నిర్మలోదకముల*
*స్నానమును రేయి పాలయన్నమును, నిత్య*
*మాయువును పెంచు ,పాటించు మానవులకు*

అర్థం – మాపటి యెండనున్నను, యజ్ఞయాగాదుల పొగబారినను, యీడుగల బాలతో రమించినను, స్వచ్ఛమైన నీటిలో స్నానం చేసినను, రాత్రి పాలతో భోజనం చేసినను దినదినము ఆయువు వృద్ధి యగు ననిన రీతి.

*అధమా ధనమిచ్ఛంతి ధనం మానం చ మధ్యమా*
*ఉత్తమా మానమిచ్ఛంతి మానోహి మహితాం ధనం – 60*

*పద్యానువాదం –*

*ధనమునేయిష్ట పడువాడధముడనబడు*
*మానమునుధనమును కోరు మధ్యముండు*
*ఉత్తముడు మానమొక్కటే చిత్తమనును*
*ధనము కన్నమానము గొప్ప ధరణిలోన*

అర్థం – అధముడయినవాడు ధనమే యిచ్ఛగించును. మధ్యముడైనవాడు ధనము మానమును యిచ్ఛగించును. ఉత్తముడు మానము మాత్రమే యిచ్ఛగించునన్న రీతి.

*తోయలేఖేనభానవం తత్కృతంత మధ్యశ్యతే*
*వాత్సల్య మన్య సాధూనాం శిలాలేఖేవ దృశ్యతి – 61*

*పద్యానువాదం –*

*నీచులకు చేయు మేలును నిలువదెపుడు*
*నీటిపై వ్రాత రాసిన పాటియగును*
*సజ్జనులకును సేయగా సార్థకమ్ము*
*అదిశిలాక్షర మట్టుల పదిలమగును*

అర్థం – నీచునికి చేసే వుపకారం నీళ్ళమీద వ్రాసిన అక్షరం వలెను, వుత్తములకు సాధు జనులకు చేసిన వుపకారెం రాతి మీద వ్రాసిన అక్షరం వలెను గనుక భయమున్ను వాత్సల్యమున్ను అతిథుల కిచ్చేదనిన రీతి. (సశేషం)



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 4 (25) UGC CARE List Approved Journal
హైదరాబాద్ ఫిబ్రవరి : 2025

# బందారం కథలు – భాషా విశేషాలు

**డా. వి. శంకర్,** తెలుగు అధ్యాపకులు, విమర్శకులు. ఫోన్ : 94407 98954

కవిగా ప్రసిద్ధుడైన నందిని సిధారెడ్డి ప్రతిభావంతుడైన కథా రచయిత కూడా. కవిగా ఆయనకు వచ్చిన ఖ్యాతి వెనుక ఆయనలోని కథా రచయిత వెనుకబడిపోయాడు. వామ పక్ష విప్లవోద్యమం, ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటం, తెలంగాణ అస్తిత్వ సాహిత్యోద్యమం, మనిషిలో అంతరించిపోతున్న తడి కోసం తపన – సందర్భం ఏదైనా ఆయన కవిత్వమై పలవరించడం మనకు తెలుసు. ఐదు దశాబ్దాల ఆయన రాతలు, మాటలు, చేతలు కూడా నిబద్ధత గల కవిగానే నిరూపిస్తున్నాయి. అయితే, ఆయనలోని కథా రచయిత సృజనకారునిగా ఆయనను తెలుగుసాహిత్యంలో మరింత ఉన్నత స్థానంలో నిలబెడుతాడని ఆయన కథలు చదివినవారికి తెలుస్తుంది.

జీవితంలోని విభిన్న శకలాల్ని చిత్రించడంలో కథ ఒక శక్తివంతమైన ప్రక్రియ. వ్యక్తి జీవితం, సామాజిక జీవితం, ఈ రెండింటి చుట్టూ అల్లుకున్న పల్లె జీవితం చిత్రించడానికి కథకు మించిన ప్రక్రియ లేదు. తెలంగాణ పల్లె జీవితానికున్న వైవిధ్యం విలక్షణమైనది. ఇక్కడి బతుకులోని ఆరాట పోరాటాలు, సంఘర్షణలు, వ్యవసాయం, కులవృత్తులు, కూలీలు, విశ్వాసాలు, వివాదాలు, సాంస్కృతిక ఆచరణలు అన్నీ ఆర్ద్రంగా తడిమిచూడవలసిన అంశాలు. వీటి గురించి రాయాలంటే ఆ పల్లె మూలాల నుంచి వచ్చిన వారికే సాధ్యం. అందునా వాటిని సున్నితంగా, కళాత్మకంగా మలచడం నైపుణ్యంతో కూడిన విద్య. అలాగే సాహిత్యంలో ప్రత్యేకించి కథలో వస్తు శిల్పాల ప్రాధాన్యత ముఖ్యం. అయితే వాటిని ఎంత గొప్పగా మేళవించినా అందులో వాస్తవిక జీవితం లేకుంటే పరిమళం లేని పుష్పంగానే మిగిలిపోతుంది. కథా వస్తువులో యథార్థ జీవితంతో పాటు ఆ జీవితాన్ని ప్రజల జీవద్భాషలో రూపుకట్టించగలిగితే ఆ కథలు పాఠక హృదయాన్ని హత్తుకుంటాయి. 'బందారం కథలు' చదివితే ఇవన్నీ స్ఫురణకు వస్తాయి. తెలంగాణ బతుకు మూలాల్ని, మూలల్ని, ఆర్ద్రంగా, ఉన్నది ఉన్నట్లుగా స్పృశించిన ఈ కథలు చదవగానే మనల్ని కొంతకాలం దాకా వెంటాడుతాయి.

తెలంగాణ పల్లె బతుకుల్ని నందిని సిధారెడ్డి ఎంత సున్నితంగా చిత్రిస్తారో ఆయన మొదటి కథల సంపుటి 'చిత్రకన్ను' నిరూపిస్తుంది. ఈ రెండో సంపుటి 'బందారం కథలు'. ఇది ఆయన సొంతూరు కేంద్రంగా తెలంగాణ పల్లె ప్రజల జీవితాన్ని భిన్న పార్శ్వాల్ని స్వచ్ఛ స్ఫటికంలా దర్శనీయం చేస్తుంది.

'బందారం కథలు'లో మొత్తం 24 కథలున్నాయి. ప్రసిద్ధ సాహితీ పత్రిక 'మూసీ'లో సీరియల్ గా వచ్చి ఎంతో ఆదరణ పొందినాయి. వాటిని మహేందర్ రెడ్డి భావగర్భితంగా చదివి యూట్యూబ్ లో అప్




లోడ్ చేయగా వందలాదిమంది వీక్షించారు. ఆ కథలిప్పుడు పుస్తకంగా వెలువడుతున్నాయి.

బందారం కథల్లో అడుగడుగునా తెలంగాణా పల్లె జీవితం కనిపిస్తుంది. ఈ కథలన్నీ సిధారెడ్డి బాల్యంలో చూసిన దృశ్యాలు, ఘటనలు, ఇరుగు, పొరుగు జీవితాల ఆధారంగా రూపు దిద్దుకున్నవే. పాత్రలూ తాను దగ్గరగా చూసిన మనుషులే. ఈ కథల్లోని జీవితాలు తెలంగాణా భాషతో పరిమళిస్తాయి. తెలంగాణా నుడులు, పలుకుబడులు పరవళ్ళు తొక్కుతాయి. పల్లె గుండెల్లోంచి ఉబికివచ్చే భాష కథా గమనానికి మెరుపులద్దుతుంది. సామెతలు సంభాషణలకు బలం చేకూర్చుతాయి.

ఈ కథల పేర్లలోనే ఓ ప్రత్యేకత కనిపిస్తుంది. అవి పక్కా తెలంగాణ పదాలో, పలుకుబడులో అయి ఉంటాయి. చూడండి– జంజాటం, కుంజీ, శానతనం, బంగారు గురిగి, చెద్ద గడియ, మనసు పాడుగాను మనసు, గడీవాసం, ఎటమటం, ఆమె సుత ఒక తల్లే, జాయిజాదు, పసరు రెక్కలు, నన్నె జీవులు. ఒక్కో పదం, పదబంధానికి ఒక్కో నేపథ్యం ఉంటుంది. అవి ప్రత్యేకంగా వివరించవలసిన విస్తృతి కలిగి ఉంటాయి.

తెలంగాణ పల్లె ప్రజలు మాటకో సామెత ప్రయోగిస్తుంటారు. నుడుగుకో నుడికారం వదులుతుంటారు. అవన్నీ ప్రయత్న పూర్వకంగా కాకుండా యథాలాపంగా సంభాషణల్లో వచ్చి చేరుతుంటాయి. వాటిని బందారం కథల్లో అడుగడుగునా చూడవచ్చు. స్థానిక పలుకుబడులు, సామెతలు, నుడికారాలు అన్ని కథల్లో కనువిందు చేస్తాయి. ఇక తెలంగాణాకు మాత్రమే ప్రత్యేకమైన పదాలకు కొదవలేదు. అట్లాగే తెలంగాణా పల్లెల్లోని వ్యవసాయ, వృత్తి సంబంధమైన పదాలు పుష్కలంగా కనిపిస్తాయి. ఇక్కడి పలుకుబడుల సొగసులు సజీవంగా పలుకరిస్తాయి. ఇవన్నీ సహజసిద్ధంగా కథల్లో ఒదిగిపోయాయి. ఎక్కడా కృతకత్వం కనబడదు. కథలో అదొక సజీవ ప్రవాహంగా సాగుతుంది.

**స్థానిక పలుకుబడులు - ప్రయోగాలు**

బందారంలోని స్థానిక పలుకుబడులు, వాటి ఆధారంగా చేసిన పద ప్రయోగాలు ఈ కథల నిండా పరుచుకొని ఎంతో ఔచిత్యంగా ఇమిడిపోయాయి. సంభాషణల్లో మాట మాటకు ప్రవాహంలా పొంగి వస్తాయి. కథకు జీవం పోస్తాయి. చూడండి–

**'జంట గుండ్ల పౌరుషమన్నా ఉండాలె, బందారం పుటక పుట్టి భయపడితే ఎట్లరా!'** అంటాడు యాదగిరి మొదటి కథ **'మా ఊరు తీరు'** లో. (పు.4), **'ఊరంతా తౌసు దీస్తున్నది'** (పు.7) **'మబ్బు మోసం జేస్తదా, మనుసులే మోసం జేస్తరు'** అన్నది కమల.(కుంజీ పు.31) అమ్మను అమ్మలెక్కనే జూడాలె, పెండ్లాం ను పెండ్లాం లెక్కనే జూడాలె (పు.37), నలుగురిని కూసుండవెట్టి మాట్లాడుకోవాలే (పు.34), ఊరికి ఏదొచ్చినా శిగమస్తది (పు.71) అని సూత్రీకరిస్తాడు. ఒక కథ పేరే **'మనసు పాడుగాను మనసు'** అని ఉంది. ఇది పల్లె ప్రజలు ముచ్చట్లలో యథాలాపంగా మాట్లాడుకునే నుడికారం. **'గీ దారం బెట్టిపో బిడ్డా, గట్కకు ఎసరొచ్చింది'** (పు.98), ముడ్డి కిందికి మూడేండ్లచ్చినయి (పు.100), ఉంచుతవా సంపుతవా (పు.101), పిల్లను బాయిలేసినట్టయింది. (పు.129)

వర్ణనలోనూ తెలంగాణ నుడికారంతో అద్భుతంగా దృశ్యమానం చేస్తాడు. చెరువు... కడుపుతో నున్న ఆడిదాని లెక్కున్నది' అంటాడు ఒకచోట.(పు.66), **'తాటికమ్మలు జుట్టు విరబోసుకొని శిగమూగుతున్నాయి'** అని వర్ణిస్తాడు మరోచోట.(ఆమెసుత ఓ తల్లే'– పు.132). **'ఊరికి తాళ్లుండాలే. తాళ్ళకు గౌళ్ళుండాలే. గౌళ్ళకు ఎల్లమ్మ గుడి ఉండాలె'** అనుకుంటాడు కిష్టాగౌడు. (పు.133). తెలంగాణ లో **'ఏడిపించటానికి పాటే, ఊకుంచటానికి పాటే'** పాడుతరు (పు.155). **'ఎవలవ్వా, గీడచ్చి ఏడుస్తున్నవు'.** (పు.166) **'మీ పటేలుకు కొమ్ములున్నయా!'** (పు.168) **'పెండ్లిపిల్ల కుదిరిందో లేదో'** (పు.171) **'ఏం బత్కిది, బత్కు పాడుగాను'** (పు.182) **'బంగారమసొంటి పనోనివి'** (పు.186)

**తెలంగాణ నుడికారం - జాతీయాలు**

ప్రతి కథలో తెలంగాణ నుడికారం, జాతీయాలు సందర్భోచితంగా మెరుస్తాయి. కథకు జీవం పోస్తాయి. 'వాగుడుకాయ' (పు.4), 'ఏం గాదు నేనున్న పో' (పు.5). 'ఎవడు పొందిచ్చిండో ఊరు' (పు.6). 'కసికెడు నీళ్ళు' (పు.7). 'వచ్చె వచ్చె వాన' (పు.9) 'ఊరు బతుకాలె' (పు.11). 'పైన మదం' (పు.14) 'ముసల్దానికేం పనిలేదు, చాతగాకున్నా యెంటోస్తది' (పు.16) 'అమాసకో పున్నానికో' (పు.18) 'గటక తినే ఇంట్లో' (పు.19) 'సంటిపోరడేం గావాలె' (పు.20) 'ఏదీ సగవెట్టరు' (పు.21) 'నువ్వెవతివే జేష్ట ముండా' (పు.22) 'నోట్లె నాలిక లేనోనివి, 'అత్త వొర్రుతునే' (పు. 31), 'అందరు గిట్లనే జేస్తుండ్రా' (పు.33) 'ఈన్నే ఉండు' (పు.36) 'అమ్మ ఎట్లంటే గట్లంటదు' (పు.37) 'మొద్దు మీన సుత కూసోవద్దా' (పు.42), 'వండింది సుత తినది' (పు.48) 'పోరగాండ్లకు పొక్కలకెట్లా ఎల్లాలే' (పు.54), 'నడీడు మనిషి' (పు.58) 'జరన్ని మంత్రాలస్తయి గద – జయమ్మ మీద ఊదిండు' (పు.60) 'జరమచ్చి శాత గాకుంటున్నడు' (పు.61) 'ఇంక ఇశారం జేయాల్నా' (పు.62) 'ఎవలకు గావాల్రా' (పు.63) 'పొయ్యి జేల్ల గూసుంటం' (పు.64) 'ఊకూకే బెదిరిస్తది' (పు.65), 'బొలబొలమని చప్పుదు' (పు.66) 'నరుకుడు కాదు' (పు.68) 'ఇజ్జత్ కా సవాల్' (పు.70) 'మొగ బాజిగాని లెక్క' (పు.72) 'అంత బిర్రు పనికిరాదు' (పు.74)

'ఇసొంటి పిచ్చి పనులు చేస్తే తోలు పలుగుతది' (పు.75) 'ఇంటి మీదికి దొంగలచ్చింద్రు ...రాంద్రుల్లో'...(పు.84) 'దొంగలెట్లుంటరో చూసొద్దాం పొంద్రి' (పు.87) 'సత్తెవ్వ కొంచెపడలేదు (పు.92) 'బీడీ పడెయ్యరాదు' (పు.93) 'జిద్దొద్దు, దయ తల్వు' (పు.96) 'ఈపంతా వాయగొట్టిండు' (పు.102) 'నరజల్మ తాసిలి జల్మ' (పు.106) 'ఎవని కన్ను మండిందే అవ్వా! (పు.110), 'మేం తాగిపిస్తే ఒట్లేసింద్రు. ఉత్తగేసింద్రా' (పు.116) 'గిదేనా, నీ ఉద్దార్కం' (పు.119) 'ఇజ్జద్దీస్తాంటే ఇకారమనిపిస్తది' (పు.123) 'పొతే పజీత' (పు.125) 'పాలోల్ల ముంగట నల్లమొకం' (పు.125) 'మొగొల్ల కాబిలేనా' (పు.129) 'అల్కగ సంపాయించాలె' (పు.144) 'జాయిజాద్ ఖాందాన్ నిలవెట్టాలె' (పు.146) 'కుండలో ఎసరు వెట్టింది' (పు.151) 'భూతల్లి బొబ్బ వెట్టింది' (పు.156)

**'అంబెటాల్ల కాంగనే సంటిదానికి తినవెట్టు'** అన్న అయ్య మాటలు గుర్తుకొచ్చాయి బాలరాజుకు అంటాడు 'పసరు రెక్కలు కథలో. (పు.158) **'గీడ బజార్ల గూసోని ఏం రాజీర్కం జేస్తున్నవయ్యా!'** అడిగింది లచ్చవ్వ. (పు.162) **'ఓ పెండ్లిపిలగా...బాసింగాలు జరుపు'** అని అడిగారు ఆడవాల్లు. (పు.171)

**తెలంగాణ పదాలు**

బందారం కథల్లో తెలంగాణ పల్లెల్లో ప్రయోగించే పదాలు ప్రతి వాక్యంలోనూ కనిపిస్తాయి. మచ్చుకు కొన్ని– చిర్రగోనే (పు.4), బండి కాని (పు.6), ఎల్తదా (పు.15), గోజలెట్లా (పు.7), ఊదుబత్తుల పొగ (పు.8), శిగాలు (పు.8), బాయి సొరికెల్లో (పు.7), బద్నాం (పు.12), లొల్లి (పు.12), మేలిక (పు.13), సావుకారి (పు.13), కొనుపులు (పు.13), కచ్చురం (పు.14), పసురం (పు.15), నొగలు

(పు.15), గ్యాసునూనె (పు.17), సొప్పబెండ్లు (పు.18), జేజేకు పెడితే (పు.19), బాజాప్త (పు.19), ఎవుసం (పు.19), లంపటం (పు.22), సమితి తోని (పు.22), గొగ్గాళ్ళ మీద (పు.29), బుదగరిస్తే (పు.30), మునుపటి లెక్క (పు.30), ఇగం (పు.31), తోల్కపోవా (పు.33), మలీద ముద్దలు (పు.34), అర్రలో (పు.34), జుర్మాన (పు.35), సాకలోల్ల పీరి (పు.38) నేమిలీకల కట్ట (పు. 38), పాటకి (గేటు) (పు.39), కొత్త పటువ (పు.39) మజ్జుగా (పు.40), కొలుపు (పు.40), అవుసరం (పు.42), పదుతల (గిట్టుబాటు) (పు.45), బనీను కీస, అద్మరాత్రి, ఇసొంటి (పు.46), పత్త (చిరునామా), రికాముండదు (పు.47) మోతుకులు (మోదుగలు) (పు.47), తాపింది (పు.48), అజం (పు.51), చల్లంబలి (పు.53), ఇడిసిపెట్టది (పు.55),దావత్ (పు.57), సంపింద్రు (పు.60), బాడుకావ్ (పు.61), పీకేయ్యంద్రి (పు.63), అంబటాల్ల (పు.67) షర్తు (పు.68), పొద్దింజాముల (పు.72), పెట్టు పోతల, అవులదానా (పు.76), పెద్దిర్కం (పు.77), మొగ పోవడి (పు.78), కట్టె బేడం (పు.82), నిమ్మలంగా (పు.93), ఆర్మాని, ఇస్పెటాట, (పు.94), దూలాలకు, సరాలకు (పు.95), కులకశ్శి (పు.98), చెక్కరిగోలి (పు.99)

దిగూల్లలో (పు.101), దర్వాజ చేరెల్లు (పు.102), తీటనోరు (పు.124), సమరు (చమురు) (పు.133), పీకెలు, బచ్చీస పేర్లు (పు.137), కైలికోడే (పు.140), జిమ్మేదారి, కొర్రాయి మంట (పు.169), నిమ్మలంగ (పు.170), దీవెనార్తి (పు.171), చేదగిర్కలు (పు.179), గోలెం (పు.184), పులెగండోడు (పు.185)

### క్రియా పదాలు

తెలంగాణకు మాత్రమే పరిమితమైన క్రియారూపాలు ఈ కథల్లో ప్రతిచోటా కనిపిస్తాయి. పాత్రోచిత సంభాషణల్లో విస్తృతంగా ప్రయోగించాడు రచయిత. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే – తొవ్వినా (పు.3), రావాలె (పు.11), ఉండాలె (పు.12), పోయిందు, వస్తదు (పు.28), ఇయ్యదు (పు.40), కూసొంద్రి, ఏడిసిందు, పొందిందు, ఇకారమనిపిస్తది (పు.123)

### సామెతలు

పల్లెల్లో పెద్దలు హితబోధ చేసే సందర్భాల్లో సామెతలు సర్వసాధారణం. ఈ కథల్లోని పాత్రల సంభాషణల్లో సామెతలు పుష్కలంగా ఉన్నాయి. కొన్ని చూడండి – బతికుంటే బలుసాకు తిని బతుకొచ్చు' (పు.5), కప్పతల్లి కప్పతల్లి లగ్గమంటా, కాలమై చెరువు నిండితే భోగమంటా (పు.8) ఈనెతోని సంసారం ఇసుకతోని తాడు పెనినట్టు (పు.37) ఊకొంగానే లోకం ఊకోవన్నా- ఎవల నోరు ఎవలాపుతారు (పు.59), ఎచ్చులకు పొతే పానం బోతది, పజీతయితది (పు.69), తీట సిగ్గెరుగది (పు.69), నీళ్ళతోని పరాశికాలోద్దు (పు.69), తెగిన బొక్కెన నూతిల దాకా (పు.71), పని కాడ ఆడేంది, మొగేంది?.. పెయిల బలముండాలే గని (పు.72), తిండి కాడ ముందుండాలె, పనికాడ ఎనకకుండాలె (పు.72), దొంగలకు సద్ది కడుతవు (పు.87), పెండ్లయినంక సంసారం జెయ్యాలే గదా (పు.126), కోతిని జెయ్యవోతే కొండెంగ అయినట్టు (పు.128), పటేలే గని పటేల్ తనం లేదు (పు.128), బంగారం కేటుదైతే అవుసులోన్ననేదేముంది? (పు.130), తీర్థంలో తీర్థాన్ని పట్టించుకుంటారు గానీ, ఎండనెవరు పట్టించుకుంటరు (పు.137), వోయినాలైనా వైభవాలైనా మనిషికెన్నో దేవతకన్ని (పు.139), పెద్దకులమనంగానే పెద్ద బుద్ధులుంటయా (పు.144), నచ్చిన నగ వెట్టలే. మెచ్చిన శీర గట్టలే (పు.146), దొరికే ఇంటికే కాళ్ళు కదుల్తయి (పు.149), కథల దమ్ముంటే కమ్ముతది, పాటల బలముంటే పందుతది (పు.153), ఇయ్యం ఇయ్యం మంచిదే. దయ్యమచ్చి కయ్యం పెట్టినట్టు (పు.163), కాపోల్లకు కనికరం లేకపోయినా మనకుండాలె గదా (పు.168), కల్లుదాగిన మొకం క్యాలి దప్పిన మొకం (పు.174), వొచ్చి రాని వోయినపోదు సాము చేస్తే వొయ్యారం గుయ్యారమైతది (పు.174), అసలు పైసే నల్లటిది. తెల్లది నల్లదంటది. నల్లది తెల్లదంటది (పు.176), ఇల్లిటపల్లుదు ఇంటికి లోకువ (పు.179)

ఇట్లా తెలంగాణ జీవితం తెలంగాణ భాషలో దృశ్యమానం అవుతుంది బందారం కథల్లో. ఈ కథలు మనల్ని చిటికెన వేలు పట్టుకొని మన మూలాల్లోకి తీసుకెళ్తాయి. మన అనుభవాలు, జ్ఞాపకాలు ముసురుకుంటాయి. ప్రతి కథలో మనల్ని చూసుకునేలా పురికొల్పుతాయి.

కథలు పాఠకుని వెంటాడాలి. సంఘటనలు కండ్లముందు కదలాడాలి. చదవటం పూర్తికాగానే కాసేపు ఆలోచింపజేయాలి. అందుకు వస్తు శిల్పాలే కాదు. జీవితం సజీవంగా ప్రతిబింబించాలె. భాష, నుడికారం, పలుకుబడులు పరిమళించాలె. బందారం కథల్లో ఇవన్నీ దర్శించవచ్చని ఘంటాపథంగా చెప్పవచ్చు. తెలంగాణ జీవితం అనుభవించి, ఇక్కడి జీవితం పట్ల ప్రేమ ఉన్నవాళ్ళు, తెలంగాణ భాషా పరిమళం ఆస్వాదించ దలచుకున్నవాళ్ళు తప్పనిసరిగా చదువాల్సిన పుస్తకం బందారం కథలు.

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 4 (28) హైదరాబాద్ ఫిబ్రవరి : 2025

# తెలంగాణ సాంస్కృతిక చిత్తరువు

**బూర్ల వేంకటేశ్వర్లు,** తెలుగు సహాయాచార్యుడు, ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ కళాశాల, కరీంనగర్, ఫోన్ : 9491 598 040

చరిత్రల తెలంగాణ ప్రాంతపు సంస్కృతికి, వ్యవహారానికి ఎప్పుడూ పెద్దపీట దక్కలే. ఒకదిక్కు నైజాం, మరో దిక్కు మరాఠీ, ఇంకోదిక్కు కన్నడ సంస్కృతుల ముప్పేట దాడి అలుముకొని ఉండే తెలంగాణ మీద. నాగరికమనబడే అనాగరిక సంస్కృతికి దూరంగ ఉన్నది తెలంగాణ. జానపద జీవనాడిని నాగరికపు దాడినుండి కాపాడుకున్నది. ఆర్థికంగా సామాజికంగా గ్రామీణ జీవిత చట్రంలో ఉంది. తనను తాను కళలు, యక్షగానం, జానపదం వంటి కళలద్వారా అలరింపజేసుకున్నది. తన భాషల తానే కైగట్టి పాడుకున్నది, బతుకమ్మె ఆడుకున్నది. తనను తాను ప్రకటించు కోవడానికి దశాబ్దాలుగా ఎదురు చూసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనంక అన్ని రంగాలలో తనను తాను ఇది అని ప్రకటించు కుంటున్నది. ఈ క్రమంల చరిత్ర, భాష, సాహిత్యం, కళలు, రాజకీయ రంగాల పాత నిర్ధారణలను తుడిపేసి కొత్త ప్రమాణాలను నెలకొల్పుతున్నది.

తెలంగాణ గ్రామీణ సమాజం వ్యవసాయాధారితం. ఇది పునాదిగా విలసిల్లిన ఆత్మీయ సంస్కృతి పల్లె పట్టులనిండా పరుచుకొని ఉన్నది. వ్యవసాయ నాగరికతల ప్రకృతితోని మమేకమయ్యే పండుగలు, పబ్బాలు, ఆచారాలు, తిండి తీర్లు ఎన్నెన్నో పురుడుపోసుకున్నయి. సబ్బండ వర్ణాలతో అల్లుకుపోయిన కట్టుబాట్లు, కలబోతలు, ఆత్మీయతల ముచ్చట్లు ఇక్కడి ప్రత్యేకతను పట్టిస్తయి. వీటి మధ్య పుట్టి పెరిగిన వ్యవసాయ దారి కుటుంబంల పుట్టిన మట్టా సంపత్ కుమార్ రెడ్డి ప్రత్యక్ష సాక్షి కథనాలు గంగ దర్వాజ పేరుతొ ముచ్చట్లు రాసి పెట్టిండు. వ్యవసాయపు కుటుంబంల పుట్టడం ఒక ఎత్తు. తెలుగు జానపదం మీద పట్టు ఉండడం మరొక ఎత్తు. పల్లె సంస్కృతి పరిశీలన చేసి పావురంగ రాతలోకి తీసుకచ్చుడు ఇంకొక ఎత్తు. తెలుగు భాషల పరిశోధనా స్థాయి పట్టా పుచ్చుకొని, ప్రాంతీయ మూలాలను మరువని ఎరుకతో ముందు తరాలకు అనుభవాలను అందించడం తెలంగాణ ప్రాంతీయ సాహిత్య సంస్కృతులకు సంపత్ కుమార్ రెడ్డి అందించిన మంచి చేర్పు ఈ గంగ దర్వాజ ముచ్చట్లు.

**నేపథ్యపు ముచ్చట్లు**

పాలగోకుల కండ శెక్కరి దంచి, కలిపి, మయ్య మయ్య తినిపిస్తె ఎట్లుంటది? పల్లాకిల కూసోవెట్టి, ఒహెూమ్ ఒహెూమ్ అని పదంబాడుకుంట, పీకలూదుకుంట తోలుకపోయినట్టుంటది. పల్లె మురిపాల ముచ్చట చెప్పుతె, ఒడువది దంగది. బయటి నుంచి దర్వాజ తెరిస్తే ఇల్లంత దర్శనమిస్తది. ఇంట్లకెల్లి దర్వాజ తీస్తే ప్రపంచమంత కనిపిస్తది. ఇగో, ఇట్ల మట్టా సంపత్కుమార్ రెడ్డి మనల్ని పల్లె వైభవాన్ని సూడుండ్రి సూడుండ్రి అని, మట్టవట్టి గుంజుకపోతడు. మట్టుకొయ్యకు కట్టేసిన ల్యాగ దూడ తల్లి ఆవుకోసం తల్లడిల్లినట్టు, తలుసుకొని తలుసుకొని, పులుకు పులుకున కండ్ల నీళ్లు వడిపిస్తడు.

తెలిసి తెలువకనే శివరాత్రికి దీపం ముట్టిచ్చి జాగారం జేస్తం, కాటిరేవులు జేసి గోజలకు దండలేసి పరమాన్నం తినిపిస్తం. కాముని పండుక్కు కోలలువట్టి, జాజిరాదుతం, మల్లన్న బోనాలకు గుడిసుట్టు పైవట్టి బండ్లు తింపుతం. పీరీల పండుక్కు అస్సై దూలా ఆడుతం. తీర్థాలకువొయి చెట్లకు పూజజేస్తం. కానీ, వీటన్నిటి సుట్టు అల్లుకున్న వివరాలు మనకు ఎక్వ తక్వ తెల్వయ్. వీటన్నిటిని పూసగుచ్చినట్టు చెప్తడు సంపత్కుమార్ రెడ్డి.

లింగధారణ సంగతి చెప్పేటప్పుడు లింగ వైవిధ్యుల పట్ల మన పద్ధతి ఎట్లుండెనో చెప్తడు. కాముని పున్నమ గురించి చెప్పుకుంట కుడుకల పేర్ల సంగతి విప్పుతడు, సంక్రాంతి పీడ పండుగ ఎందుకయ్యిందో ఎరుకజేస్తడు. మల్లన్న పల్లకి యాత్ర ఎక్కణ్ణుంచి ఎక్కడికి పాకిందో చెవుల వేస్తడు. సారె సంప్రదాయం గురించి విడమరిచి ఆడిబిడ్డల ఆత్మను పట్టిస్తడు. సట్టిబోనాల నియమ నిష్ఠల కథ, పీరీల పండుగ తత్త్వం, గరిగబుడ్డి విశేషం, చాట వెనుక ఉన్న చాటంత కథ, ఇరిక్కాయ తొక్కు ఇతిహాసపు అల్లిక, మావురాల ఎల్లమ్మ వైనాలు వినిపిస్తడు.

తల్లి మనాది, బాల్యపు మనాది, ఊరు మనాది, పురా మనాది, ప్రకృతి ప్రేమ. ఆహార సంస్కృతి, జీవన తాత్త్వికత, నోటి కతలు, తెలంగాణ పలుకు, వాక్యం, తెలంగాణ జన జీవన సౌందర్యం, ఆత్మగల్ల ముచ్చట్లు, నాస్టాల్జియాలు, స్వగతాలు, సంభాషణలు, సంస్కృతి లేఖనం, ఏరువాక, వరద పాశం, మలీద ముద్దలు తెలంగాణల ఉన్న ఎన్నెన్నో పావురపు సంగతులు మన మనసులల్ల నాటుకపొయ్యేటట్టు చేస్తడు.

**వ్యవహార భాష పదాల చెక్కర**

వ్యవహార భాష సొబగులు అద్దుకున్న అనేక పదాలు ఈ వయ్యిల బహు సుందరంగ కనిపిస్తయి, వినిపిస్తయి. **"యాకాశి, సొనికెలు, పీర్తి, మారాష్ట, ఉత్తరిచ్చు, రామండం, ఈనంగ, అగిర్త, ఆముదాన్, తుర్తి, అగ్గిపురుసుడు, నైవేద్దం, కుతగ్యత, ఇచ్చుల్లారం, తమ్ములాలా, గిట్లెట్ల, జెంగలి, తీరంగం, గోతాలు, పలారం, చాయబొట్టు, తీర్పాటం, సిరస్త, గుబ్బలి, బెందాల్లం, సిమిటి, గోజుమ, పామాయిలి, కారెట, అంగనిబడులు, తలువాలు, నామర్ద, అద్దుమానం, బద్దురం, పొలిపిరి"** వంటి పదాలు ఎన్నో తెలంగాణ ప్రాంతీయ వాడుకను నికురంగ చూపిస్తయి.




**ఉపమానాలు ఉడుపులు**

తెలంగాణ ప్రజల భాషల ప్రతి ముచ్చటకు ఉపమానాలు చేసి చెప్పుడు చక్కటి అలవాటు. కావ్య రచనల ఒక విషయాన్ని కండ్ల ముంగటికి తీసుకవచ్చుటానికి ఉపమానాన్ని మించిన ఉపాయం లేదు. వచన కావ్యపు విలువను పెంచేటట్టుగ, ఉపమా అలంకారాలు శోభనిస్తయి. ఈ తీరుకు నిదర్శనంగ ఉపమానాల ఉడుపులు తొడిగిన అనేక వాక్యాలు ఈ కథనాలల్ల ఉన్నయి. **"తల్లిపొదుగుల దూడ మూతివెట్టినట్టు, రాచకన్నెల లెక్క వెలిగిపోయే లాడూలు, మిఠాయి దుకాండ్ల గప్పిన అద్దాలమీద తిరిగే ఈగల లెక్క పిల్లలు, పల్లకి ఎక్కినదానికంటే చింతాకంత ఎక్కువ, ముట్టుకుంటె ముడుచుకపొయ్యే ఆరుద్ర పురుగు లెక్క నెత్తి ఇరవోసుకున్న దయ్యాలలెక్క ఈతచెట్ల గుంపులు, కర్రెపిట్ట రెక్క కదిలియ్యని కలికి గాంధారి యాల్ల, పిల్లికూనలలెక్క తల్లి కాళ్ళల్ల తిరుగుడు, గనెచిక్కుడు నక్కలెక్క దాక్కుంటది, అముదాల పిల్లలు అలుముక పన్నట్టు, ముల్లును ముల్లెగట్టినట్టు, జిట్టపులి పిల్లల లెక్క, అరచేతులు దాసెన పూల లెక్క, రామలక్ష్మణులసొంటి సోపతి, అడిగినట్టిత్తే కడిగినట్టయిపోవు, ఊదుకబుక్కుడు ఊరుమొకం జూసుడు, తల్లినిడిస్తే పిల్లగరుస్తది, పిల్లివట్టిన కోడిలెక్క, తోడు పెండ్లిపిల్ల లెక్క"** మన వెంటవడి వస్తయి.......

**సృజన పదబంధాల సొక్కం బంగారం**

కవి, రచయిత చేయితిరిగిన తనానికి రుజువు వాళ్ళు కొత్తగ తయారుజేసే పదబంధాలు. సందర్భోచిత పద ప్రయోగం పాఠకులకు ఆనందాన్నిస్తది. రచనలో మమేకం జేస్తది. **"చూసేకండ్లు వాచేమొకం, బట్టబాతలు, తీరనిభామ, పెండ్లిప్యారంటం, కన్నుమలిగే పొద్దు, తీగె రాగాలు, రోటి మిఠాయి, నిక్కినిక్కి నిలవడు, పోతులకు పోతులు, ఇల్లిరువాటు, తెల్లగోలు తల్లి, సొప్పబెండ్ల పల్లాకి, కట్టపోతులు, బోళ్ళు బోకెలు, బర్రెకుక్క, సవగతి నడుక, గీసి గీసి బ్యారం, వగలవంటలు, సిద్ధవర్తి, కాకరార్పణం , దండెగొట్టు, పెద్దరికపు చరిత్ర, పాడుదోడు, మోటుబాయిగాడు, కమ్మటి పిండి, క్షీరదీక్ష, దండివారం, మగ్గం వర్కు, బుకింగు ప్యాకింగు, ముల్లెకాయిసుతనం, సకలరోగ సంపన్నులు, కడుక్కొని తాగుడు, ఒగ్గునాద వినోదాలు, చిల్లరతనపు మైలురాయి, ప్రమాణఘటం"** వంటి సృజన పదబంధాల సొక్కం బంగారం మన కంఠ మాలలై వెలుగునిస్తయి.

**అనుకరణ ఆవృత్తి పదాల అనునాదాలు**

తెలంగాణ భాషల నాద మాధుర్యం ఉన్నదని ప్రముఖ భాషావేత్త డా. నలిమెల భాస్కర్ అంటరు. పదాల పునరావృత్తి విషయాన్ని దీప్తిమంతం జేసి, మనలో ఒక అనునాదాన్ని కలిగిస్తది. ఇది తెలంగాణ భాషకు మాధుర్యాన్ని ఇచ్చే విషయం. పింజం పింజం, మెరమెర, చిట్టచిట్ట, దన్నదన్న, రుసరుస, పాత పాత, కొత్త కొత్త , పలపల, దబ్బదబ్బ, గల్లర గల్లర, బుడబుడ, బడబడ, కొయ్యక్కొయ్య, జరుగు జరుగు మని ధనిస్తయి. అనుకరణ ఆవృత్తి పదాల అనునాదాలు మనలోపల శబ్ద రసామృతాన్ని జారవిడుస్తయి.

**తెలంగాణ సామెతల జాణతనం**

సామెతలు తరతరాల అనుభవాలనుండి, ఆలోచనల నుండి పుట్టినయి. పుస్తకాలకెక్కని ప్రజల నోళ్ళలోపట నానే సామెతలు ఎన్నో ఉన్నయి. అవి ఆయా సందర్భాలకు అనుగుణంగ వాడినప్పుడు ఒక నిశ్చితాభిప్రాయాన్ని మనలోపల కలుగజేస్తయి. అర్థవంతమై అర్థాంతర స్ఫూర్తిని మనలో నాటువేస్తయి. **"కుక్కకేమి పనిలేదు కూసుండ రికాము లేదు, ఇల్లుగాలి అతడేడిస్తే ఇంగలం ఇయ్యమని ఇతను బోయిండట, లొటపెట పెదవులకు నక్క ఆశపడ్డట్టు, పదేస్తే పచ్చి పులుసు మూడేస్తే ముష్టి పులుసు, నడుమంత్రపు సిరి నరం మీద పుండు, పెసర చేన్ల పోగొట్టుకొని పప్పుటికెల దేవులాడినట్టు, కొత్తంత పండుగ లేదు అల్లునంత సుట్టంలేడు, కాశీకి వొయినోళ్లు కాటికి వొయినోళ్లు ఒకటే, అలవాటైన పాణం అంగడంగడి, బట్ట ఎక్కువైతే మడి ఎక్కువాయె, అన్నం ఎక్కువైతే ఆచారం ఎక్కువాయె, కన్నతల్లి ప్రేమ కన్నా సాదినతల్లి ప్రేమెక్కువ, పిట్టబుర్రుమంటే బట్ట సంకల పెట్టుకున్నట్టు, మనున్నప్పుడు మంచినీళ్లు ఇయ్యనోడు, సచ్చినంక సమాధిమీద బర్రెను కట్టేసిండట, పుర్రెకోబుద్ధి జిహ్వాకో రుచి, ఊరిడిశిన మనిషి వనమిడిశిన కోతి"......** వంటివి సందర్భానుసారంగ, సారాన్ని సరసంగ చెప్తయి. తెలంగాణ సామెతల జాణతనం కండ్లకు కట్టి చూపిస్తయి.

**జాతీయాల జావళీలు**

జాతీయం ప్రాంత పరిధికి, భాషా పరిధికి లోబడి ఉంటది. చెప్పిన పదాల అర్థంకన్నా విశిష్టమైన అర్థాన్ని బోధజేస్తది. వేముల

పెరుమాళ్ళులాంటి పెద్దలు తొంబయ్యవ దశకంలనే తెలంగాణ జాతీయాల ప్రశస్తిని చాటి చెప్పిండ్రు. కమ్మ కమ్మకు కమ్మగ ఉండే జాతీయాలను వాడి తన రచన మీద వెలుగు పారేటట్టు చేసిండు సంపత్ కుమార్ రెడ్డి. ఈ పుస్తకంల గంజి గురించి చెప్పిన జాతీయాల కథ ఒక కొత్త వెలుగు చిమ్ముతది. చెట్టు సంబంధ పలుకుబడులు కుడుకవక్కలై కమ్మగనిపిస్తయి. **"కుక్కను కొడితే రాలుతయి, బొల్లకోరు, ముక్కిరుసుడు, అగ్గిల చెయి వెట్టినట్టు, కండ్ల పండుగ, చిత్తు బొత్తు, అరబ్బోని అప్పు అంజుమాన్ బాకీ, రామగోస, సీతకట్టం, కూరాడు నీరాడు, గొడ్డుకట్టం"** వంటి జాతీయాలు జాతిజీవనాడి సప్పుడు వినిపిస్తయి. జాతీయాల జావళీలు ముద్దు ముద్దుగ ముచ్చటవెడుతయి.

సంపత్ కుమార్ రెడ్డి చేసిన ఈ రచన తెలంగాణ రచయితలకు ఒక కొత్త దారి వేసింది. ఇటీవల అన్నవరం దేవేందర్ ఊరి దస్తూరి బాటలో ఇది కూడా ఒక మైలురాయి. ఈ కోవలో కాళోజీ నారాయణరావు, దాశరథి రంగాచార్యులు, పాకాల యశోదా రెడ్డి, సామల సదాశివ, వేముల పెరుమాళ్లు, కొత్తపల్లి జయశంకర్, నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, వేముల ఎల్లయ్య, జూపాక సుభద్ర వంటి వాళ్ళు యాదికస్తరు. తెలంగాణ తేటదనం, తెలివిడి, పలుకుబడి ముప్పేటల అల్లుకున్న ఆత్మగల్ల ముచ్చట్లు, ఆత్మాభిమానపు తావులు ఈ వయ్యినిండా పట్టువాలధారలెక్క పిండుకున్న కొద్దీ నులివెచ్చటి ధారలై నాలికె మీద నర్తనమాడుతయి. మట్టా సంపత్కుమార్ రెడ్డి తెలంగాణ ఆత్మీయ భాషా పరిమళాన్ని, జీవిత తాత్త్వికతను, సాంస్కృతిక వారసత్వాన్ని చిత్రిక పట్టిండు. నవరస్ బంగారం లెక్క జివజివలాడే పలుకులు, అవగాహన అనుభవంతో చెప్పిన సాంస్కృతిక విలువలు, విజ్ఞానాలు, విశేషాలు మరెవరూ గ్రంథస్థం చెయ్యనివి.

తెలంగాణను ప్రేమించడమంటే తెలంగాణ అస్తిత్వ పునాదుల్లో ఉన్న వైచిత్రిని విప్పిచెప్పడం కూడా. ఈ రకమైన పట్టు, ప్రతిభ గల్గిన వాళ్ళు అరుదు. తెలంగాణ సాధించుకున్న తర్వాత చేసిన పనులల్ల ఇది ఒక మంచి ప్రయత్నం. కథలు, కవిత్వం, నవలలు, వ్యాసాలు వంటి ప్రక్రియలు ఒక దారి. తెలంగాణ ప్రాంత పలుకుబడిని హృదయాకర్షకంగ ముచ్చట్ల రూపంల రాయడం ఒక మంచి ఆరంభం. ప్రభు సమ్మితం, కాంతా సమ్మితం, మిత్ర సమ్మితమైనది ముచ్చట ఒకటే.

## నన్నేమి అడగకండి...

మా ఇల్లు
యంత్రశాల అయ్యింది
ఏది నేరుగా వాడుకునే అవకాశమే లేదు

త్రాగే నీరు
ఎంత తండ్లాట పడుతుందో గాని
గరగర చప్పుడుల మధ్య రాల్చితే
గ్లాసెడు గ్లాసెడు పట్టుకుని మింగుతున్నాం.
పీల్చే గాలిని
ఎంత జల్లెడ పడుతుందో డబ్బ
రాత్రింబగలు మోగుతూనే ఉంటుంది

కమ్ముకున్న విషాన్ని కాస్త
కలరు మార్చి ఇస్తుంది.
తిండి అంటారా !
వండింది, వండంది
కొన్ని ఓవెన్‌లో
కొన్ని ఫ్రిజ్‌లో
సహజత్వాన్ని చంపేసి
పిప్పిని తినడం.
ఇక్కడ రెండే కాలాలు
ఏసి నడవడం ఆపిన వెంటనే
రూమ్ హీటర్లు మొదలు పెట్టాల్సిందే
దేహం లోపల చలివేడితో సంబంధం లేదు
బయటనుండి పూసుకోవల్సిందే.

ఒళ్ళు తుడిచే నీళ్ళే కాదు
బోళ్ళు కడిగే నీళ్ళు కూడా
కరంటును తాకి కాగాల్సిందే.
బట్టలు బండలకు తాకడం
దండాలకు ఆరబెట్టుకోవడం
ఎప్పుడో మరిచిపోయాయి.

కండ్లు, చెవులు
నిరంతరం ఎరుపెక్కుతూనే ఉన్నాయి
మా ఇంట్లోకి సహజకాంతి
మాట్లాడే మిత్రులు నేరుగా రాక
చాలా రోజులవుతుంది

ఇదే గొప్ప బతుకు అని
గప్పాలు కొడుతుంటే
ఏడుపులాంటి నవ్వొస్తుంది
తప్పదుకదా! బతుకుతున్నాం
కానీ...
బాగున్నావా? అని నన్ను అడగకండి
నేను ఢిల్లీలో ఉంటున్నాను.





డా. దత్తయ్య అట్టెం, ఫోన్ : 9494 715 445

పి.ఎల్. శాంతకుమారి
ఫోన్ : 9502367162



# గురజాడ 'సుభద్ర' కావ్యం – పరిశీలన

డా. బోచ్కర్ ఓమ్ప్రకాశ్, ఫోన్ : 9441 955 998



ఆధునిక తెలుగు కవిత్వానికి గురుజాడగా ప్రసిద్ధి పొందిన గురజాడ ద్రష్ట ,మహాకవి సంఘసంస్కర్త గురజాడ కౌసల్యమ్మ వేంకట రామదాసు దంపతులకు విశాఖపట్నం జిల్లా ఎలమంచిలి తాలూకా ఎస్. రాయవరంలో మేనమామ గృహంలో 21 సెప్టెంబరు 1862న గురజాడ అప్పారావు జన్మించారు నవంబర్ 30 1915న మరణించాడు. 1885 వ సంవత్సరంలో అప్పల నరసమ్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఓలేటి లక్ష్మీ నరసమ్మ, వేంకట రామదాసు, పులిగడ్డ కొండయ్యమ్మ.

1886లో డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో హెడ్ క్లర్కుగా, 1986లో ఆనంద గజపతి సంస్థానంలో సంస్థాన పరిశోధకునిగా, 1887లో కళాశాలలో అధ్యాపకులుగా సాంఘిక సేవకై విశాఖ వాలంటరీ సర్వీసు నిర్వహించారు. 1889లో ఆనందగజపతి డిబేటింగ్ క్లబ్ కు ఉపాధ్యక్షుడిగా పని చేసినారు. 1897లో మహారాజా ఆనందగజపతి వారి సోదరి మహారాణి అప్పలకొండమాంబ గారికి వ్యక్తిగత కార్యదర్శిగా నియమితులయ్యారు. 1911 లో మద్రాసు యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ లో సభ్యత్వం పొందారు

**గురజాడ రచనలు**

కన్యాశుల్కం, సారంగధర, ఆంగ్లపద్య కావ్యం, దిద్దుబాటు, బిల్హణీయం, కాసులు, కన్యక, దించు లంగరు, ముత్యాల సరాలు, సుభద్ర, డైరీలు, మాటామంతి, కొండు భట్టీయము, గురజాడ అప్పారావు గారి గేయములు, చిన్న కథలు, వ్యాస చంద్రిక, పూర్ణమ్మ, మీ పేరేమిటి, మెటిల్డా, సంస్కర్త హృదయం, మతము విమతము, పుష్పలావికలు మొదలైన రచనలు గురజాడ కలం నుండి జాలువారినాయి.

**గురజాడ సంప్రదాయ రచనలు**

గురజాడ సాంప్రదాయకమైన శైలిలో ప్రాచీన వృత్తాలలో రచించిన ఖండకావ్యాలు పేర్కొనదగినవి. అందులో మాటల మబ్బులు, పుష్పలావికలు, మెరుపులు, సుభద్ర కావ్యం, ఋతు శతకము అనేవి ఉన్నాయి. మాటల మబ్బులలో విజయనగరంలోని అధికారులను అధిక్షేపించిన పద్యాలు ఉన్నాయి. పుష్పలావికలు అనే శీర్షికతో గురజాడ కేవలం 9 పద్యాలు రాశారు. ఇవి వివిధ ప్రబంధాలలోని పుష్పలావికల వర్ణనలతో తులతూగే చక్కని రచన. ముఖ్యంగా పుష్పలావికల శృంగారాన్ని ప్రదర్శించే పద్యాలు మెరుపులు అనే శీర్షికతో రాసిన పద్యాలన్నీ సంస్కృత చాటు శ్లోకాలకు అనువాదాలు. ఋతు శతకం కంద పద్యాలలో రచించారు. కేవలం 25 మాత్రమే ఇప్పటివరకు లభించాయి. ఇందులో త ప్రాసతో పద్యాలు ఉండటం ప్రత్యేకత. సుభద్ర కావ్యం ఇది 1913లో రచించబడి 1929లో ముద్రితమైన అసంపూర్ణ కావ్యం. మూడా శ్వాసాలతో కూడిన ఈ కావ్యం లో ప్రథమాశ్వాసములో 57 పద్యాలు, ద్వితీయాశ్వాసంలో 11 పద్యాలు, తృతీయాశ్వాసంలో కేవలం 9 పద్యాలు ఉన్నాయి. 11వ శతాబ్దానికి చెందిన నన్నయ మహాభారతం ఆదిపర్వంలో సుభద్ర కథ కనిపిస్తుంది. అలాగే 15వ శతాబ్దానికి చెందిన తాళ్లపాక తిమ్మక్క రచించిన సుభద్రా కళ్యాణం ద్విపద కావ్యం పేర్కొనదగినది. అలాగే 15వ శతాబ్దికి చెందిన బమ్మెరపోతన శ్రీమదాంధ్ర మహాభాగవతంలో దశమ స్కంధం ఉత్తరభాగం లోను సుభద్ర కథ కనిపిస్తుంది. ఇక 18వ శతాబ్దానికి చెందిన చేమకూర వేంకటకవి రచించిన విజయ విలాస ప్రబంధం సుప్రసిద్ధమైనది.

గురజాడ సుభద్ర 20వ శతాబ్దారంభంలో మరల రచించడం అది కూడా ప్రాచీన శైలిలో రచించడమనేది విశేషంగా పేర్కొనదగిన విషయం!! గురజాడ రచించిన ఈ సుభద్ర అసంపూర్ణ లఘుకావ్యం. ఈ లఘుకావ్యంలో అర్జునుడు మౌనివేషంలో రైవతకాద్రికి రావడం, శ్రీకృష్ణార్జునుల మంతనాలు, అర్జునునికి పరిచర్యలు చేయడానికి బలరాముడు సుభద్రను నియమించడం, యతివేషంలో ఉన్న అర్జునుని చూసి సుభద్ర ఆకర్షితురాలవడం, ఆందోళనతో కూడిన ఆమెను సత్యభామ అనునయించడం, ఈ లఘుకావ్యంలోని ఘట్టాలు ఈ లఘుకావ్యంలో సంపూర్ణంగా ప్రబంధ లక్షణాలు కనిపిస్తాయి.

వర్ణనలు, శృంగారస ప్రధానం, వస్త్వైక్యం మొదలైన లక్షణాలు, అలాగే ఈ కావ్యం లో ప్రయోగించిన –

**చూడ్కులు మరుని కటారులై పొడవడం**
**తాటి సిడపుజోదు**
**జఘన ఘన**
**వారిజ కింజల్కశ్రీ** పదబంధాలు ప్రాబంధిక శైలిని ప్రకటిస్తాయి.

సుభద్ర రైవతకాద్రికి ఏతెంచిన తీరు కపటమౌని వేషంలో ఉన్న అర్జునునికి హృదయానందం కలిగించిందట!

అంతట నొక్క కాంత, యల కాంతము లల్లలనాడఁ దెమ్మెరన్
జెంత వనాంతము న్వెడలి చేరఁజనెం దొవకావి చీరపై
వింత మెఱుంగు రశ్మికలు వెల్వఁగ బంగరు కత్తళంబు, వి
క్రాంతవిలాసముల్ నడలఁ, గన్నులఁజెన్నుల వెల్లిగొల్పుచున్

సుభద్రతో శ్రీకృష్ణుడు ఈ ముని అనుగ్రహంతో నీకు కావలసిన వరుడిని నరుడిని పొందుతావు అని ప్రేమ పూర్వకంగా శిరసుపై చేయుంచి ఆశీస్సులు అందిస్తాడు.

కం. "అమ్మా!" యని చెలి శిరమున
నెమ్మి గరంబుంచి పలికె నీరజనేత్రుం
"డిమ్మౌని కరుణ సౌభా
గ్యమ్ముల నవ్వారిగాఁగఁ గాంచెద" వంచున్

కపట మౌని వేషంలో ఉన్న అర్జునుని, సుభద్రను ఇద్దరినీ చూసిన శ్రీకృష్ణుడికి హృదయంలో ఎంతో ఆనందం కలిగింది ఇది బ్రహ్మ యొక్క నేర్పు కదా! అని మనసులో భావించుకున్నాడు శ్రీకృష్ణుడు ఈ పద్యంలో చిత్తజ జనకుడు అని రమణీయ పదబంధాన్ని ప్రయోగించాడు గురజాడ.

ఆ. కపట మౌనిఁ జూచి కన్నియఁ జూచుచుఁ
గన్నెఁజూచి కపట మౌనిఁ జూచి,
చిత్త మలరఁదలఁచెఁ జిత్తజ జనకుండు
నేఁడు గంటి నలువ నేర్పటంచు.

శ్రీకృష్ణుడు అర్జునునితో సుభద్ర భర్తను కోరి రైవతకాద్రిని సేవిస్తూ ఉంది. ఆమెకు ఎవరు భర్త అవుతాడు తెలుపుమని ఈ పద్యంలో ప్రశ్నిస్తున్నాడు.

క. "భద్ర యిదె కొలిచె, రైవత
కాద్రిని, వరుఁగోరి, కరుణ నరసి తెలుపుఁడీ !
రుద్రుఁడగునో, వరుణుఁడొ, ని
ర్నిద్ర పరాక్రముఁడు నరుఁడొ, నీరజభవుఁడో!?

యతులు మునులు ఘటనా ఘటన సమర్థులు **"లలాట లేఖా నపునః ప్రయాతి"** అని ఒక సూక్తి కానీ యతులు తలచుకుంటే బ్రహ్మ వ్రాసిన తల వ్రాతను కూడా మార్చగలరట!!

ఈ విషయం శ్రీకృష్ణుడు సుభద్ర తో అంటున్నాడు ఎంతో సేవ చేస్తే తప్ప రహస్యాలు ఇలాంటి మునులు బహిర్గతం చేయరు అంటూ మునుల గొప్పదనాన్ని ఈ పద్యాలలో వర్ణించాడు.

కం.ఘటనాఘటన సమర్థులు
గుటిలపు విధి వ్రాతనైనఁ గుదురుపఱచు వా
కృటిమ గల పురుషసింహము
లెట పఱచుఁ గటాక్ష మొదవు నీప్సితము లటన్.

ఈ సందర్భంలో ఈ పద్యానికి పాఠాంతరం కూడా ఉంది ఆ పాఠాంతర పద్యం

కం.ఘటనాఘటన సమర్థులు
నిటలంబున బ్రహ్మ వ్రాయు నిర్ణయ ఫక్కిం
బటు నిష్ఠా పాటవమున
నటునిటుసేయంగ నేర్తు రార్తుల బ్రోవన్.

అలాగే ఈ రైవతకాద్రికి వచ్చిన ఈ ముని కేవలం నరుడు కాదు మహానుభావుడు ఈ భూతలమంతా పుణ్య భూములను తిరుగుతూ ఇక్కడకు నిన్ను రక్షించడానికి వచ్చినవాడే అతనిని సేవించి శుభాలను పొందుమంటూ శ్రీకృష్ణుడు సుభద్రను ప్రబోధించడం ఈ పద్యంలో గమనించవచ్చు.

కం. కేవల నరుఁడే యీతడు
భూవలయము చుట్టి పుణ్యభూము లరయుచున్
రావలసి వచ్చె నీట నినుఁ
బ్రోవను సేవించి వేడ్కఁ బొందుము శుభముల్.

పై పద్యంలో మొదటి పాదం అయిన

**కేవల నరుడే ఈతడు**

అనేచోట శ్లేష చమత్కారం ఉట్టిపడుతూ ఉంది!

శ్రీకృష్ణుడు కపట మునిని సేవింపమని ప్రబోధించగా సుభద్ర ఆ కపట ముని వేషంలో ఉన్న అర్జునుని చూసి తన మనసులో ఇతనిని ఎక్కడో చూసినట్లు ఉన్నది అనుకొంటూ ఈ విధంగా వితర్కించుకొంటుంది!

ఆ. కాంచి నరు సుభద్ర "కంటినా ముసు వీని"
నన్న శంక మనసు నలవి కొనఁగ
"నెఱుఁగకున్న వీని నెఱిగినట్లున్నది
మంచిగూర్చు" ననుచు మదిఁ దలంచె.

సాక్షాత్తు మా అన్న అయిన శ్రీకృష్ణుడే ఇతని వద్దకు సేవ చేయడానికి పంపుతున్నాడు కాబట్టి ఈ మౌనిని సేవించి నా ప్రేయసుడైన విజయుని పొందుతాను అనే ధీమాను ఈ పద్యంలో వ్యక్తం చేస్తున్నది సుభద్ర.

ఆ. "కించయేల నాకుగృష్ణుఁడు నాయెడ
నున్న వాఁడు లోక మెన్న వాఁడు
వాని పనుపు సేయ వమ్ముగా దేనాడు.
యతిని గొలిచి విజయు నధిగమింతు."

శ్రీకృష్ణుడు కపట ముని వేషంలో ఉన్న అర్జునుడు సుభద్ర వీరున్న చోటికి బలరాముడు వచ్చి కపటమునిని అతని విశిష్టతను తెలుసుకొని ప్రశంసిస్తాడు.

చ. "కలరిల నెందఱో యతులు కాంచి యెఱుంగము వీని యట్టి ని
స్తుల సదసద్వివేకనిధి సూనృత వాక్కుల నాభిరాము స
ల్లలిత శుభానుభావు, విమ లాత్ము, విచక్షణు, నిట్టి వానిఁబూ
జలదనియించి కొన్ని దివ సంబులు నిల్పుట యింట నొప్పదే."

ఈ మహాత్ముని వలన వివిధ పుణ్యక్షేత్రాలు తీర్థక్షేత్రాలు మహిమలను తెలుసుకుందాము. పరమార్థాన్ని పొందుదాము అంటూ బలరాముడు పలికే ఈ మాటలను మనోహరమైన కందంలో అందంగా బంధించాడు కవి గురజాడ.

**క. ఎందెందుఁ గలుగు తీర్థము**
**లందలి మహిమముల నీ మహాత్ముని వలన**
**న్విందము, పరమార్థంబులఁ**
**గందము, వీనులకు విందు గద సూనృతముల్."**

కపటమునితో బలరాముడు ఈ నా చెల్లెలు సుభద్రను దాసిగా స్వీకరించి సంతోషంతో తాను చేసే పరిచర్యలను పూజలను స్వీకరించండి అని సుభద్రను యతిసేవకై నియోగిస్తాడు

**క. "నీ దాసిగ గొని చెలియల**
**నేదానను లోపమున్న నెఱుఁగఁ దెలుపుచున్**
**మోదానఁ గొనుఁడు పూజలం**
**గాదనకుఁడు ముద్దు గడపి కారుణ్యములోన్."**

బలరాముడు కపటమునివేషం లో ఉన్న అర్జునునితో సుభద్రకు నిరపాయమైన సుఖాలను ప్రసాదించే నీతి మార్గాలను ప్రబోధించాలని మీవంటి శాంతు లైన నరవరుడు భర్త కావాలని వరమీయాలని కోరడంలో చమత్కారం గోచరిస్తుంది.

**క. కఱపవలె మీరు భద్రకు**
**నిరపాయ సుఖంబు లిచ్చు నీతి పథంబుల్**
**వరమీవలె నెన రెతిఁగిన**
**నరవరు, మీయట్టి శాంతు నాథుఁ బడయఁగన్."**

ఆ సమయంలో బలరాముని తమ్ముడైన శ్రీకృష్ణుడు తథాస్తు అంటాడు సుభద్ర కంటి చూపులు మన్మథుని బాణాలై మాయా యతి అయిన అర్జునుని పీడించినాయని కవి వర్ణించాడు.

**క. తమ్ముఁడు పలికె "తథాస్తు" ని**
**నెమ్మొగమును వంచి భద్ర నేత్రాంతములం**
**జిమ్మె నరుని యెడఁ జూపులఁ**
**గమ్మవిలుతు మాటు వెడలు కఱకు శరములన్**

ద్వితీయాశ్వాస ప్రారంభ పద్యంలో అర్జునుని సేవకై సుభద్ర బయలుదేరిన తీరును, నాయిక (సుభద్ర) వర్ణన ప్రాబంధిక శైలి లో వర్ణించిన తీరు హృద్యమైనది!!

**సీ. కస్తూరి గన్నేరు కావి చీర మెఱుంగు**
**మేని చాయకు వింత మిసిమిఁ గొలుప**
**చెలరేగు ముంగురుల్ చేర్చి కట్టిన జోతి**
**యిరులపై రిక్కల కరణి వెలుఁగ**
**పైటపై దూఁగాడు పచ్చల హారముల్**
**చలదింద్ర చాపంబు చాడ్పుఁజూప**
**నిద్దంపు జెక్కుల దిద్దిన పత్రముల్**
**మకరాంకు బిరుదాల మాడ్కి వఱల**

**గీ. మెఱపు, కెమ్మబ్బు లోపల మెఱయునట్లు**
**వలిపమున మేల్మి మొలనూలు తళుకులీన**
**భద్ర నడతెంచెబంగరు పళ్లెరములఁ**
**బండ్లుఁ బూవులు గొనుచు సపర్య కొఱకు.**

కపటమౌని వేషంలో ఉన్న అర్జునుని సేవిస్తూ అతని పట్ల ఆకర్షితురాలవుతుంది సుభద్ర ఆ సందర్భంలో తన మనసులో అర్జునుని విశిష్టతను ఈ విధంగా తలచుకుంటుంది.

సీ."ఏడు లోకంబుల నెనలేని విల్లుకాఁ
దెవ్వఁడటన్న గవ్వడి యనంగ
సాటివారల పట్ల సౌహార్ద మొనరించు,
మేటి యెవఁడన కిరీటి యనఁగ
నెనరు నేర్పులు గల్గు నెఅజాణుఁ
డెవఁడన్న నింద్రజుండని లోక మెన్ని పల్క,
పెద్దల కడ భక్తి పిన్నల యెడ రక్తి
నెరపువాఁ డెవఁడన్న నరుఁడె యనఁగ

గీ. వీను లలరంగ విని విని వేడ్క గదుర
నరుని నావానిగాఁ గొన్న నాతి నిపుడు
నాకు నాలోన వింతయ్యె నరుని మఱచి
మాయ యతి నొక్కరుని గాంచి మరులుకొంట.

జగదేకవీరునికి పతిని కావలసిన నేను ఈ ముని పట్ల ఆకర్షితురాలను అయినాను కదా! అని ఆందోళనకు గురి అవుతుంది ఇక్కడి వరకు ద్వితీయాశ్వాసములోని కథాభాగం.!

యతిని సేవించడానికి ఇబ్బంది పడుతున్న సుభద్రను సత్యభామ అనునయించడం తృతీయాశ్వాసంలోని ఇతివృత్తం.

మహా సిద్ధుల యతీశ్వరుల ఆజ్ఞలను కాలము దేశము కూడా పాటిస్తాయని కాబట్టి ఈ యతి అర్జునుని తప్పకుండా నీకు జంటగా కూరుస్తాడని బాధపడకుండా వెళ్లి సేవించమని సత్యభామ సుభద్రను అనునయిస్తున్న విధానం ఈ పద్యంలో గమనించవచ్చు!

**క. కాలము దేశము సిద్ధుల**
**పాలై యాజ్ఞలను మెలఁగుఁ బార్థుని నీకై**
**లీల మెయిం గొనఁగా యతి**
**చాలదె? వంతలను మాని చనుమా వేడ్కన్ !**

ఈ విధంగా సుభద్ర కావ్యాన్ని గురజాడ సంప్రదాయ శైలిలో రచించాడు ఈ రచన సంపూర్ణంగా లభించి ఉంటే రసజ్ఞ లోకానికి ఆనందాన్ని కలిగించేదితెలుగు సాహిత్య సరస్వతికి అమూల్యభరణమై వెలుగొందేది!!

❖ ❖ ❖ ❖ ❖

# రంగు

**బింగి శ్రీకాంత్,** వనపర్తి. ఫోన్ : 789 361 3015

ఏదో రంగు వచ్చింది
ఎక్కడి నుండి వచ్చిందో తెలియదు
మనిషిని మబ్బుల్లో ముంచేస్తుంది
మంటల్లో కాల్చేస్తుంది.

ఎంత పొగరో దానికి ?
అహం కిరీటం పెట్టుకుని ...
ఒక్కసారిగా గ్రహణం పట్టినట్టు
కొండచిలువలా మింగేస్తుంటే
జీవితపు రంగులన్నీ వెలిసిపోతున్నాయి.

మానవత్వపు గూట్లో ఉన్న పిట్టల్ని
గురి చూసి కొట్టుకుంటూ...
అనుబంధాల రెక్కల్ని విరగ్గొట్టి
అనురాగాల తడిని ఆవిరి చేస్తూ ...
పవిత్ర ప్రేమ గులాబీల పీకలు కోసి
పరువు కత్తుల దాహాన్ని తీరుస్తుంది.

ఎవరు తెచ్చి వదిలేశారు
ఆ నల్లని నలుపు రంగును?
ప్రపంచమంతా పాములా పాకుతుంది
తెల్లటి శాంతిని, ఎర్రటి నిప్పులను సైతం
నోట్లో వేసుకుని మింగేస్తుంది.
పచ్చటి ప్రకృతిని ముక్కలు ముక్కలుగా కోసి
అడవి గొంతు నులిమి, బందిఖానలో బంది చేస్తుంది.

స్విస్ బ్యాంకుల్లో దాక్కుని దాక్కుని
రాకాసి అలల్లా ఎగిసిపడుతూ
అభివృద్ధి కాళ్లను వెనక్కి లాగి
సుదూర తీరాన ఏకాకిని చేస్తుంది.

దానికసలు మానవత్వపు రంగే లేనట్లుంది
మాయల మరాఠీలా వికటాట్టహాసం చేస్తుంది
ఉరిమి ఉరిమి ఊడలా బిగుసుకుంటుంది
నా కంటబడితే ఆ నల్లరంగు చిలకను
గొంతు నులిమి మసిలా మార్చి...
తెల్లరంగు పావురాన్ని ఎగిరేస్తాను.

# గంప

**విను**

అమ్మ నెత్తిన గంప
గంపలో నేను
అమ్మ కొండెక్కి కొండ దిగుతుంటే
నింగికి నేలకు మధ్య విమానంలో విహరిస్తున్నట్లే ఉండేది

ఓ టిఫిన్లో బువ్వ
ఇంకో టిఫిన్లో కూర
చిన్న గిన్నెలో మామిడి కాయ తొక్కు
చెంబు నిండా గడ్డలు గడ్డల పెరుగు
ముతకగుడ్డతోనున్న చల్లని నీళ్ళ డబ్బా
అమ్మదేహంలో భాగమైన కొడవలి
గివన్నీ గంపలో వేసుకొని
పచ్చని పొలాల నడుమ నడుస్తుంటే
మాయమ్మ అడుగులకు పక్షులు రాగం తీసేవి

కళ్ళం రాశి ఇంటికి రాగానే
కళ్ళంలోని గాలి కంటే వేగంగా అమ్మకి పిలుపొచ్చేది
ఆడబిడ్డ భాగం తీసుకుపొమ్మని!
గంప నిండినది ధాన్యంతో మాత్రమేనా
అమ్మమ్మ గుండె ఒంపి నింపిన ప్రేమకు భౌతిక రూపమది!

కోడికూతకు ముందే
అమ్మతో పాటు నిద్ర లేచేదీ గంప
వాకిట్లోనున్న దుమ్మును
కొట్టంలోని పశువుల పేడను
కడుపు నిండా నింపుకొని పెంటకు పరుగు పెట్టేది

పొద్దుగూకులు కలుపు ఎత్తి కుప్పపోస్తుంటే
అమ్మకు సాలు సాలుకు సాయపడ్డ గంప
సాయంత్రమయ్యాక కోడి పిల్లలకు ఆవాసమయ్యేది

మార్కెట్ పోటీలో
ప్రక్కటెముకలు విరిగిన గంప మూలకుపడ్డది
పాలిథిన్ కవర్లను
ప్లాస్టిక్ డబ్బాలను పట్టుకుంటుంటే
డబ్బా పాలు తాగినట్లే ఉంది
అమ్మ స్తన్యపు మాధుర్యం కోల్పోయినట్లే ఉంది

# తెలుగు ఆకర వెబ్‌సైట్లు – పరిశీలన

**డా. గొల్లపెల్లి గణేశ్,** స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) ఫోన్ : 9440 22 70 64

ఏదైన ఒక అంశంపై రాయాలంటే మనం ముందుగా చేసేపని సంబంధిత అంశంపై గతంలో ఏవైనా పరిశీలించదగిన గ్రంథాలు కానీ అధారాలు కానీ ఉన్నాయా? అని. అలా పరిశీలన చేసే వాటిలో ప్రామాణికమైన వాటినే మనం పరిగణనలోనికి తీసుకుంటాం. ఈ విధంగా ఒక అంశంపై పరిశోధనాత్మకంగా రాయడానికి/ చదవడానికి మనకు ఉపకరించే వాటినే **'ఆకర గ్రంథాలు'** అంటారు. ఇంగ్లీషులో వీటికి "Reference Books", "Source Material", "Biblographies" అని రకరకాలు పేర్లతో ప్రస్తావిస్తారు. 'ఆకరము' అనే మాటకు అర్థం మూలస్థానం.

**"ఏ భాషకైనా, సాహిత్యానికైనా ఆకర గ్రంథాల ప్రాముఖ్యత ముఖ్యమైనది. ఈ ఆకర గ్రంథాలు లేకపోతే ఆ రంగం ముందుకు కదలడం కష్టసాధ్యం. ఏదైనా ఒక రంగంలో అధ్యయనాన్ని కొనసాగించడానికి ఆ రంగంలో పనిచేస్తున్నవాళ్ళు ఆధారపడే గ్రంథాలను ఆకర గ్రంథాలు అని పిలుస్తారు. అలా తెలుగు సాహిత్య అభ్యసనం లేదా అధ్యయనం చేస్తున్న సాహితీ వేత్తలు, పండితులు వాళ్ళ సాహిత్య మెలకువలను నిరంతరాయంగా మెరుగు పరుచుకోవలసిన అవసరం నిత్యం ఉంటుంది. అందుకు అంతకు ముందు వెలువడిన గ్రంథాల పరామర్శ అవసరం."** *(డా|| గోలి శ్రీలత, తెలుగు ఆకర గ్రంథాలు-గ్రంథ సూచికలు, వ్యాసం, పే. 13, మూసీ మాసపత్రిక, నవంబర్ 2021)*

ప్రస్తుతం విస్తరిస్తున్న సాంకేతికతతో ఆకర గ్రంథాల పరిశీలన అంతర్జాలానికి విస్తరించింది. పూర్వకాలంలో ఒక అంశం పైన సమాచారాన్ని సేకరించాలంటే ఎంతో ప్రయాసపడవలసి వచ్చేది. సమయం కూడా ఎంతో వెచ్చించవలసి వచ్చేది. అంతర్జాల సాంకేతికత వలన ప్రస్తుతం తెలుగు భాషకు సంబంధించిన విశేషమైన సమాచారం, పత్రికలు, పుస్తకాలు అన్నీ కూడా మనకు అరచేతిలో అందుబాటులో ఉంటున్నాయి. మన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నేషనల్ డిజిటల్ లైబ్రరీస్' వంటి ప్రాజెక్టుల వల్ల దేశంలోని అనేక గ్రంథాలయాలు డిజిటలైజ్ అయ్యి అందరికీ అందుబాటులో ఉన్నాయి.

ఒక డిజిటల్ లైబ్రరీస్ మాత్రమే కాకుండా సప్రామాణికమైన ఆధారాలను అందించే అనేక వెబ్‌సైట్లు మనకు అందుబాటులో ఉన్నాయి. అటువంటి ఆకర వెబ్‌సైట్లను మనం మూడు విధాలుగా వర్గీకరించవచ్చు. 1) పుస్తక భాండాగారాలు 2) విజ్ఞాన సర్వస్వాలు 3) నిఘంటువులు.




**పుస్తక భాండాగారాలు :**

గ్రంథాలయాలను పుస్తక భాండాగారాలుగా సంబోధిస్తారు. మన దేశంలోనే 15 లక్షలకు పైగా గ్రంథాలయాలున్నట్లు అంచనా. ఇటువంటి వాటిలో సార్వజనీన గ్రంథాలయాలతో పాటు విశ్వవిద్యాలయ గ్రంథాలయాలు, శాస్త్ర సాంకేతిక గ్రంథాలయాలు, సాహిత్య గ్రంథాలయాలు వంటి ప్రత్యేక గ్రంథాలయాలు కూడా కొన్ని కోట్ల పుస్తకాలతో అందుబాటులో ఉన్నాయి. అయితే మనకు కావలసిన మూల సమాచారం ఈ గ్రంథాలయాలలో వెదకడం ఎంత వ్యయప్రయాసలతో కూడుకున్నదో అర్థం చేసుకోవచ్చు.

అయితే శాస్త్ర సాంకేతికాభివృద్ధి వలన ఈ సమస్యకు చక్కటి పరిష్కారం లభించిందని చెప్పవచ్చు. అవే డిజిటల్ గ్రంథాలయాలు. **"గ్రంథాలయానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి, ఈ సేకరించిన సమాచారాన్ని డిజిటల్ ఫార్మాట్లలో భద్రపరచి కంప్యూటర్లు, ఇతర మాధ్యమాల ద్వారా డిజిటల్ రూపంలో అందించే గ్రంథాలయాలను డిజిటల్ గ్రంథాలయం అంటారు."** (https://te.wikipedia.org/wiki/డిజిటల్_గ్రంథాలయం)

**డిజిటల్ లైబ్రరీల ఆవిర్భావం :**

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముఖ్యమైన పుస్తకాలను డిజిటలైజ్ చేసే ఉద్దేశంతో అమెరికాలోని 'కార్నెగీ మెలన్ విశ్వవిద్యాలయం' 2007-2008 సంవత్సరంలో 'మిలియన్ బుక్ ప్రాజెక్ట్'ను ప్రారంభించడం జరిగింది. ఇందులో అనేక దేశాలు, సంస్థలు భాగస్వాములై ప్రాచీన పుస్తకాలు డిజిటలైజ్ చేయడానికి సహకరించాయి. ఇందులో మన దేశం కూడా 'డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా' ద్వారా వివిధ సంస్థల భాగస్వామ్యంతో, 'మిలియన్ బుక్ ప్రాజెక్టు'లో పాల్గొన్నది. ఇందులో తిరుమల తిరుపతి దేవస్థానం కూడా భాగస్వామ్యమై సంస్కృత, తెలుగు సాహిత్యం, వేదాలు పత్రాలు, తాళపత్రాలు మొదలగునవి డిజిటలైజ్ కావడానికి సహకరించింది.

ఈ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో సుమారు 23000 పుస్తకాలు ఉండగా 2017 నుండి ఈ వెబ్సైట్ అందుబాటులో లేదు. (http://www.rr.cs.cmu.edu/mbdl.htm) .

**నేషనల్ డిజిటల్ లైబ్రరీ : (https://ndl.iitkgp.ac.in/)**

2016 సంవత్సరంలో కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ "నేషనల్ మిషన్ ఆన్ ఎడ్యుకేషన్ త్రూ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యునికేషన్ టెక్నాలజీ (NMEICT)" ద్వారా 'నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా' అనే విభాగాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఏర్పరచింది. దీని ద్వారా భారతదేశంలోని అన్ని భాషలకు చెందిన పుస్తకాలను డిజిటలైజ్ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, లైబ్రేరియన్లు, లైబ్రరీ వినియోగదారులు, నిపుణులు, వికలాంగ వినియోగదారులు మరియు ఇతర అభ్యాసకులు వంటి అన్ని రకాల వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చేలా ఇది రూపొందించబడింది. ప్రస్తుతం ఇందులో 400 కంటే ఎక్కువ భాషల్లో 9 కోట్లకు పైగా పుస్తకాల సమాచారం అందుబాటులో ఉంది.

**ఆర్కైవ్.ఆర్గ్ (https://archive.org/)**

ఇంటర్నెట్ ఆర్కైవ్ అనేది డిజిటల్ రూపంలో ఇంటర్నెట్ సైట్‌లు మరియు ఇతర సాంస్కృతిక కళాఖండాల డిజిటల్ లైబ్రరీని నిర్మించే లాభాపేక్ష లేని సంస్థ. ఇందులోకి సమాచారాన్ని ఎవరైనా స్వచ్ఛందంగా అప్‌లోడ్ చేయవచ్చు, ఆవసరమైన్న సమాచారాన్ని ఉచితంగా తీసుకోవచ్చు. ఇందులో కేవలం పుస్తకాలే కాకుండా వెబ్‌పేజీలు, ఆడియోలు, వీడియోలు, ఫోటోలు, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాముల వంటివి అందుబాటులో ఉన్నాయి. ఆర్కైవ్‌తో పాటుగా ఆధునిక పుస్తకాల కొరకు వీరు ఒపెన్ లైబ్రరీని (https://openlibrary.org/) ఏర్పరచి సాహిత్యాభిమానులకు, పరిశోధకులకు సేవ చేస్తున్నారు.

**శోధ్‌గంగ (https://shodhganga.inflibnet.ac.in/)**

పరిశోధక విద్యార్థులు వివిధ విశ్వవిద్యాలయాలలోని పూర్వ పరిశోధనలను పరిశీలించడానికి ఉపయోగపడే ముఖ్యమైన వెబ్‌సైట్ శోధ్‌గంగ. యునివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ 2016లో పరిశోధకులకు నిర్ణయించిన కనీస ప్రమాణాలకు అనుగుణంగా INFLIBNET అనే సంస్థ ద్వారా 'ఎలక్ట్రానిక్ థీసెస్ మరియు డిసర్టేషన్ల డిజిటల్ రిపోజిటరీ'ని ప్రారంభించింది. దీనికి 'శోధ్‌గంగ' అనే పేరుని నిర్ణయించారు. 'శోధ్' అనే పదం సంస్కృత పదం. ఇది పరిశోధన, ఆవిష్కరణను సూచిస్తుంది. భారత ఉపఖండంలోని అన్ని నదులలో 'గంగ' అత్యంత పవిత్రమైనది. దీని ద్వారా భారతదేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలలోని పరిశోధన పత్రాలను, డాక్టోరల్ పత్రాలను ఎలక్ట్రానిక్ రిపోజిటరీల ద్వారా సులభంగా అందుబాటులో ఉంచే ప్రయత్నం చేయబడుతున్నది. ఇది పరిశోధక విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైనది. తాము చేస్తున్న పరిశోధనకు సంబంధించిన సమాచారాన్ని ఈ వెబ్‌సైట్ ద్వారా చాలా సులభంగా పొందవచ్చు. (https://shodhganga.inflibnet.ac.in/)

**విజ్ఞాన సర్వస్వాలు :**

విజ్ఞానసర్వస్వం అంటే వ్యాసాల రూపంలో ఒక రంగానికి చెందిన విషయాల గురించిన విజ్ఞానాన్ని అంతా ఒక చోట చేర్చడం. దీనినే ఆంగ్లంలో ఎన్‌సైక్లోపీడియా అని అంటారు. పూర్వకాలంలో ఈ విజ్ఞాన సర్వస్వాలను ఒకరిద్దరే రాయగలిగినప్పటికీ, ప్రస్తుతం ఉన్న విజ్ఞాన విస్తృతి దృష్ట్యా దీనిని రాయడానికి అనేక మంది కావలసి వస్తున్నది. తెలుగులో చూసినట్లయతే ప్రాచీన కాలంలో సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశం, ఆంధ్ర సర్వస్వం, ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము వంటివి అనేక సంపుటాలలో వెలువడిన విజ్ఞానసర్వస్వాలు. ప్రస్తుత సాంకేతిక యుగంలో ఈ విజ్ఞాన సర్వస్వాలు చాలా సులభంగా వినియోగించుకోవడానికి అందుబాటులో ఉంటున్నాయి.

**వికీపీడియా : (https://te.wikipedia.org/)**

'వికీపీడియా' అనేది వివిధ భాషల్లో లభించే ఒక 'స్వేచ్ఛా విజ్ఞాన సర్వస్వం' అని చెప్పవచ్చు. దీన్ని లాభాలను ఆశించకుండా (ప్రజల స్వచ్ఛంద విరాళాలతో) "వికీమీడియా ఫౌండేషన్" అనే సంస్థ నిర్వహిస్తుంది. 'వికీ' అంటే చాలా మంది సభ్యుల సమష్టి కృషితో సులభంగా వెబ్‌సైట్‌ను సృష్టించగల ఒక సాంకేతిక పరిజ్ఞానం. 'Encyclopedia' అంటే విజ్ఞాన సర్వస్వం. వికీపీడియా అనే పదం ఈ రెండు పదాల నుంచి రూపుదిద్దుకుంది. ప్రస్తుతం వికీపీడియా ప్రపంచంలోని సుమారు 253 భాషల్లో సేవలందిస్తూ, అంతర్జాలంలో అతి పెద్ద వెబ్‌సైట్లలో ఒకటిగా ప్రసిద్ధికెక్కింది.

ప్రస్తుతం వికీపీడియాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల భౌగోళికాంశాలు, చరిత్ర, సంస్కృతి, భారతదేశ భౌగోళికాంశాలు, చరిత్ర, సంస్కృతి, ప్రపంచ దేశాల భౌగోళికాంశాలు, చరిత్ర, సంస్కృతి, పర్యాటక ప్రదేశాలు, విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, సినిమాలు, కళలు, ఆటలు, భాష, కులమతాలు, ఉద్యమాలు, వృత్తులు ఇలా ఒకటేమిటి కొన్ని వేల అంశాల గురించిన సమాచారం అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం ఒక్క తెలుగు వికీపీడియాలోనే 81 వేలకు పైగా వ్యాసాలు అందుబాటులో ఉన్నాయి.

**వికాస్‌పీడియా : (https://te.vikaspedia.in/)**

భారతీయ సమాచారాన్ని పేదలకు, అణగారిన వర్గాల వారికి ఉచితంగా చేర్చాలనే లక్ష్యంతో భారత ఎలక్ట్రానిక్స్ మరియు సమాచార మంత్రిత్వ శాఖ, సి-డాక్ సంస్థల ఆధ్వర్యంలో ఈ విజ్ఞాన సర్వస్వ పోర్టల్ రూపుదిద్దుకుంది. ఇందులో వ్యవసాయం, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం, పథకాలు వంటి విభాగాలతో పాటు ఉ

పాధ్యాయులకు, విద్యార్థులకు ఉపయుక్తమైన ప్రామాణికమైన సమాచారం చాలా పొందుపరచబడింది.

ఇవే కాకుండా ప్రాచీన సాహిత్యం కొరకు మాగంటి.ఆర్గ్, భక్తి సాహిత్యం కొరకు ఫ్రీగురుకుల్.కాం, పరిశోధనలకు సంబంధించిన సమాచారం కొరకు తెలుగుథీసిస్.కాం వంటి కొన్ని వెబ్‌సైట్‌లు పరిశోధకులకు చాలా ఉపయోగకరంగా ఉంటున్నాయి.

**నిఘంటువులు :**

నిఘంటువు అనగా అక్షర క్రమములో పదములు, వాటి అర్థములు, వినియోగము గూర్చిన సమాచారము కలిగిన పుస్తకమని చెప్పవచ్చు. నిఘంటువుకే కోశము, నామానుశాసనము, శబ్దకోశము, శబ్దసాగరము వంటి పర్యాయపదములు ఉన్నాయి. తెలుగులో వచన నిఘంటువుల్లో శబ్దరత్నాకరము, సూర్యరాయాంధ్ర నిఘంటువు, బ్రౌన్ నిఘంటువు, శబ్దార్థ దీపిక, తెలుగు పర్యాయపద నిఘంటువు మొదలగునవి పేరెన్నికగన్నవి. ఆధునిక కాలములో అనేక వృత్తిపద కోశములు, మాండలిక పదకోశములు, సాంకేతిక పదకోశములు నిర్మించబడినవి.

గతములో ఏదైనా ఒక పదమును నిఘంటువులో వెతకాలంటే చాలా ప్రయాసతో కూడుకున్న పని. శారీరక శ్రమ మరియు సమయము వెచ్చించవలసి వచ్చేది. కొన్ని సార్లు మనం వెదికే పదాలు ఆ నిఘంటువులో దొరకకపోవచ్చు కూడా. కానీ ఆన్‌లైన్ విప్లవంలో భాగంగా వచ్చిన జాల నిఘంటువులతో ఈ ఇబ్బందులన్నీ తొలగిపోయినవి. ఒక పదమును ఒకేసారి ఒక నిఘంటువు కాకుండా అనేక నిఘంటువులలో వెతికే సౌలభ్యం వచ్చింది. ఈ నిఘంటువులు తెలుగు భాషాభివృద్ధికి విశేషంగా తోడ్పడుతున్నాయి. అటువంటి అంతర్జాల నిఘంటువుల్లో కొన్ని ముఖ్యమైన వాటిని పరిశీలిద్దాం.

**ఆంధ్రభారతి :** (https://andhrabharati.com/dictionary)

హైదరాబాద్‌లో స్థిరపడిన సాఫ్ట్‌వేర్ నిపుణులు వాడపల్లి శేషతల్పశాయి, కాలెపు నాగభూషణరావులు తెలుగు భాషాభిమానంతో 2000 సంవత్సరంలో 'ఆంధ్రభారతి' పేరుతో ఒక తెలుగు సాహిత్య, సమాచార వెబ్‌సైట్‌ని ప్రారంభించారు. ఈ వెబ్‌సైట్‌లో సాహిత్యంతో పాటు నిఘంటువును కూడా ప్రారంభించాలన్న సత్సంకల్పంతో అనతికాలంలోనే 'నిఘంటు శోధన' అనే విభాగాన్ని ప్రారంభించారు. మొదట్లో ఇందులో 'శబ్దరత్నాకరాన్ని' మొత్తంగా కంప్యూటరీకరించి ఉంచుదామని అనుకున్నప్పటికీ తదనంతర కాలంలో ఆంగ్ల నిఘంటు వెబ్‌సైట్లకు ధీటుగా, అనేక నిఘంటువులను పొందుపరచడం ప్రారంభించారు. ప్రస్తుతానికి ఈ వెబ్‌సైట్‌లో శబ్దరత్నాకరము, శ్రీహరి నిఘంటువు తెలుగు-తెలుగు, బ్రౌణ్య తెలుగు-ఇంగ్లీష్ నిఘంటువు, ఆంధ్ర-సంస్కృత కోశము, మాండలికపదకోశం, పారమార్థిక పదకోశం వంటి 50కి పైగా నిఘంటువులను వెదకడానికి అనుకూలంగా పొందుపరిచారు. తెలుగు మాటకు తెలుగులోనే అర్థాన్ని అందించడమే కాకుండా, ఇంగ్లీష్, ఉర్దూ, సంస్కృత, తమిళ, కన్నడ భాషల్లో కూడా ఆ పదానికి అర్థాన్ని అందించడం ఈ నిఘంటువు యొక్క ప్రత్యేకత.

**తెలుగు విక్షనరీ :** (https://te.wiktionary.org/)

వికీమీడియా ప్రాజెక్టుల్లో భాగంగా రూపొందించిన ఒకానొక ప్రాజెక్టు విక్షనరీ. వికీ, డిక్షనరీ అనే రెండు పదాల కలయికలో విక్షనరీని రూపొందించారు. ఇందులో మనం వెదికే ప్రతి పదానికి సంబంధించిన భాషాభాగం, అర్థవివరణ, పర్యాయపదములు, నానార్థాలు, పద ప్రయోగములు మొదలైనవి ఇవ్వడం వలన పదానికి సంబంధించిన పూర్తి జ్ఞానం కలగడంతో పాటు అనేక కొత్త పదాలు కూడా పరిచయం అవుతాయి. చాలా సందర్భాల్లో మనం వెతుకుతున్న పదాలకు సంబంధించిన ఛాయా చిత్రాలను కూడా అందించడం ఆకట్టుకుంటుంది.

**తెలుగు నిఘంటువు :** (http://telugunighantuvu.org/Default.aspx)

అంతర్జాలంలో సూర్యరాయాంధ్ర నిఘంటువును పొందుపరచడానికి గాను 'తెలుగు నిఘంటు వేదిక' అనే సంస్థను భాస్కర రామిరెడ్డిగారు 2015 సంవత్సరంలో స్థాపించారు. ఈ వేదిక ద్వారా కొంతమంది తెలుగు భాషాప్రేమికుల స్వచ్ఛంద సహాయ సహకారములతో శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు ఒకటవ సంపుటం నుండి ఎనిమిదవ సంపుటం వరకు టైపు చేయించి 'తెలుగు నిఘంటువు.ఆర్గ్' అనే వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

ఇవే కాకుండా 'డిజిటల్ డిక్షనరీస్ ఆఫ్ సౌత్ ఏషియా' అనే సంస్థ వారి బ్రౌన్ నిఘంటువు (https://dsal.uchicago.edu/dictionaries/brown), ఐఐటీ బాంబే ఇండోనెట్ ప్రాజెక్టులో భాగంగా రూపొందించిన తెలుగు వర్డ్‌నెట్ (https://www.cfilt.iitb.ac.in/indowordnet/), అమరకోశం (అమర్కోష్.భారత్/) వంటి ఆన్‌లైన్ నిఘంటువులు కూడా అందుబాటులో ఉన్నాయి.

అన్ని రంగాలలో చాలా వేగంగా అంతర్జాల సాంకేతిక విస్తృతి జరుగుతున్నందున అనతి కాలంలోనే అన్ని గ్రంథాలయాలలోని పుస్తకాలు డిజిటలైజ్ చేయబడి అటు విద్యార్థులకు, ఇటు పరిశోధకులకు అందుబాటులో ఉండగలవని ఆశిద్దాం.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 4 (38) హైదరాబాద్ ఫిబ్రవరి : 2025

# రేఖల్లో మూలాలు

**రంగరాజు పద్మజ,** ఫోన్ : 8328 333 720



కీ.శే.కొండపల్లి శేషగిరి రావు గారి శతజయంతి సంవత్సర వేడుకల్లో భాగంగా చిత్రకళా ప్రదర్శన సందర్భంగా నాలుగు మాటలు!!

కీర్తిశేషులు కొండపల్లి శేషగిరి రావు గారు గొప్ప చిత్రకారులన్న సంగతి తెలంగాణలోనే కాకుండా యావత్తు భారతదేశంలోనే కాదు, విదేశాల్లోనూ అందరికీ తెలిసిన సంగతే!

శతజయంతి సంవత్సరం సందర్భంగా పుట్టినరోజు వేడుకలలో భాగంగా కుటుంబం రివైవింగ్ ది రూట్స్ (Reviving the Roots) అనే గొప్ప కార్యక్రమం తలపెట్టి , ఈ నెల 25-1-2025 వ తారీకు నుండి ఫిబ్రవరి 5-2-2025 వ తారీఖు వరకు స్టేట్ గ్యాలరీ ఆర్ట్ భవనంలో మహోదయ శ్రీ విష్ణుదేవ్ వర్మ తెలంగాణ గవర్నర్ గారితో ప్రారంభోత్సవం జరిపించారు.

ఈ వేడుకలకు ఎందరో ప్రముఖులు హాజరై, కీ.శే. కొండపల్లి శేషగిరి రావుగారి చిత్రకళా నైపుణ్యాలను ఎంతో శ్రద్ధగా ఒక్కొక్క పెయింట్ దగ్గర తమ విలువైన సమయాన్ని కేటాయించి, చాలా నిశితంగా చూసి, వేనోళ్ల కొనియాడారు. ఆ ప్రశంసలు వారు జీవించి ఉన్నప్పుడుకూడా పొందినవే! మాన్య మహోదయులు భారత దేశ ప్రధానులు జవహర్ లాల్ నెహ్రూ, పాములపర్తి నరసింహారావు గారు, గవర్నర్ కృష్ణ కాంత్ గారు, వి.వి గిరి వంటి ఎందరో ప్రముఖుల చేత పురస్కారాలు అందుకున్నారు.

ఇలాంటి గొప్ప చిత్రకారుల ప్రదర్శన చూసే భాగ్యం చిత్రకళ అభిమానులకు కలగడం ఒక భాగ్యం. దాని ఏర్పాటు చేసిన శేషగిరిరావు గారి కుటుంబ సభ్యులు ధన్యులు...సంస్కృతి సంప్రదాయాలలో కళలకే అత్యంత ప్రాధాన్యత ఉంది... అనేకంటే వాటితోటే సంస్కృతి కొనసాగుతుందని చెప్పడం యథార్థ విషయం.

ఒక సంపూర్ణ మానవులని పిలిపించుకునే మన పూర్వ ఋషులు 64 కళలను మనకు వివరించి చెప్పారు. అందులో చిత్రలేఖనం ఒకటి. అంతేకాదు కర్మ సిద్ధాంతం ప్రకారం పూర్వజన్మ కర్మ ఫలితాలను వాటి ఫలితాల తీవ్రత తగ్గించుకొని సంపూర్ణ మానవ జీవితం గడిపేందుకు కళలను అభ్యసించి, ఉపాసించడం అనేది చేస్తుంటారు. ఏదేమైనా మనిషి పరిపూర్ణ ఆరోగ్య వంతుడిగా మనుగడ సాగించాలంటే? ఆయా మార్గాలు ఉంటాయి. ఉదాహరణకు వైద్యమే కానివ్వండి, ఆహార అలవాట్లేకానివ్వండి మనపై ప్రభావం చూపుతాయి.

అలాగే మానసిక ప్రశాంతత ఆరోగ్యం పై అంతులేని ప్రభావం చూపుతుంది! కనుక అది ఎలా పొందవచ్చు అనేది లలిత కళలవల్లనే సాధ్యమని శాస్త్రాలు చెప్పాయి. కళలను అభ్యసిస్తే రుగ్మతలను తొలగిస్తాయని డివైన్ హీలింగ్ [ Devine Heeling] అని శాస్త్రంలో ఒక భాగంలో చెబుతారు. ఈ కళలు ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయని శాస్త్ర కారులు చెప్పారు. ధ్యానం-తపస్సు వల్ల ఆయా రోగాలను నయం చేసుకున్నట్టే చిత్రలేఖనం కూడా ఒక తపస్సు వంటిదేనని, దానివల్ల పాజిటివ్ ఎనర్జీ సృష్టింపబడుతుందనీ, దానివల్ల గాయాలు సైతం మాన్పబడతాయనీ ఇలా భారతీయ విద్యలలో ఒకటైన చిత్రలేఖనం ద్వారా రోగాలు నయం చేయవచ్చని శాస్త్రం చెబుతుంది.

దీనికి ఉదాహరణ వెనుకటికి రాజులు, నవాబులు వారి సంతానం తీవ్ర అస్వస్థతకు లోనైనప్పుడు దేశ విదేశాల నుండి పేరుగాంచిన చిత్రకారులు చిత్రించిన చిత్రాలను రోగి ఎప్పుడూ చూసేలా అమర్చేవారు. అంతేకాకుండా సకల సుగుణాలతో పుత్రుడు కలగాలని గర్భిణీ స్త్రీల గదుల్లో మంచి చిత్రాలను అమర్చేవారు. అలా మానసిక- శారీరక స్వస్థత చేకూరి రోగాలు నయమయ్యేవి.

అంతేకాదు యువరాణులకు సరియైన వరుడిని వెతకాలంటే కూడా ఈ చిత్రాలనే ఆశ్రయించే వారు. ఆ చిత్రాలను పంపి స్వయంవరం ఏర్పాటు చేసేవారు. అంటే చిత్రకళకు అంతటి ప్రాధాన్యత ఆ పూర్వకాలం నుండే ఉందని చెప్పటం నా ఉద్దేశం.

ఈ చిత్ర లేఖనం కూడా ఎవరికైనా పూర్వజన్మ సుకృతం ఉంటే తప్ప రాదు! ఇది నేర్చుకుంటే వచ్చే విద్య కాదు! అలాంటి సుకృతంతో 27- 1- 1924 న మానుకోట తాలుకా పెనుగొండ గ్రామంలో కొండపల్లి శేషగిరిరావుగారు జన్మించారు.

ఎన్నో అవార్డులు- రివార్డులు పొందిన వారు మన తెలంగాణ గర్వించదగ్గ బిడ్డడు. వారి నైపుణ్యం గురించి వివరించే బుద్ధి కుశలత

నాకు లేకపోయినా.. వారు చిత్రించిన చాలా చిత్రాలలో నేను స్త్రీమూర్తుల చిత్రాలను పరిశీలనగా చూసినప్పుడు... కళాపిపాసకులతోనూ... కళారాధకులతోనూ ఆ విశేషాలు పంచుకోవాలని అనిపించింది.

వీరు నీటి రంగులతోనూ, ఆయిల్ పెయింటింగ్స్ తోను ఎన్నో చిత్రాలు వేశారు. వీరు చిత్రకళాభ్యాసం హైదరాబాదు ఆర్ట్స్ కళాశాలలోచేసి, పూర్తి మెరుగులు దిద్దుకొని ఎన్నోచిత్రాలను చిత్రించారు.

చిత్రకళా నైపుణ్యానికి కష్టించే ఆయన పట్టుదలను చూసి ఈయనకు కలకత్తాలోని విశ్వభారతి శాంతినికేతన్ కు పంపిస్తే మరింత గొప్ప కళాకారుడుగా మారే అవకాశం ఉందనుకొని మెహదీ నవాజ్ జంగ్ గారు కలకత్తాకు పంపారు. ఇక్కడ నందలాల్ గురువుగా లభించడంతో మరింత ప్రతిభను స్వంతం చేసుకోగలిగారు. కలకత్తాలోని శాంతినికేతనంలో ఎందరో దేశ విదేశీ చిత్రకారులతో పరిచయం చేసుకొని, మన దేశ చిత్రకళే కాకుండా, చైనా, జపాన్ మొదలైన చిత్రకళలను కూడా నేర్చుకున్నారు. అలా అవకాశం వచ్చినప్పుడల్లా ఇతర ప్రదేశాలకు వెళ్లి చిత్రాలను వేయడం నేర్చుకున్నారు. అందులో పరిపూర్ణత సాధించి అధ్యాపకులైనారు. వీరి రేఖా చిత్రాలు, వర్ణ చిత్రాలు రెండూ ఒకదానితో మరొకటి పోటీ పడినట్టు ఉంటాయి. నలుపు-తెలుపు చిత్రాల నుండి రంగుల చిత్రాలలో తమ ప్రతిభను చాటుతూ రామాయణ, భారత, భాగవత, ప్రకృతిలోని పంచభూతాల పైన, ఇలా ఎన్నో రకాల చిత్రాలను చిత్రించారంటే ఆయా విషయాల మీద వారికి ఎంతో అవగాహన ఉంది....ఉంటేనే అంత మంచిగా వేయగలరు.

ఆయా చిత్రాలు చూసినప్పుడు వారిదైన భాష, శైలి కనపడుతుంది. ఆర్ట్ గ్యాలరీలు సందర్శించినప్పుడే ఆ వైవిధ్యం మనకు తెలుస్తుంది. అష్టభుజిగా అమ్మవారి చిత్రీకరణ అమోఘం! కళ్ళు మూసినా- తెరచినా ఆ చిత్రమే కనపడుతున్నది. ముఖ్యంగా శేషగిరి రావు గారి చిత్రాలు కథను చెప్తాయి.

ఉదాహరణకు... ధనుర్దాసర్ భక్తుడి బొమ్మను చూడగానే ఆయన తన భార్య ఐన పొన్నాచ్చియర్ ను ఎంతో ప్రేమించే వాడని, ఆమెకున్న విశాలమైన కళ్ళు ఎండకు కందిపోతుందని భార్యకు గొడుగు పట్టుకుని తిరిగినట్టుగా బొమ్మను చిత్రించారు. దీని వెనుక కథేమిటంటే? రామానుజుల వారు కావేరీలో స్నానం చేసి వస్తూ..ఆ జంటను చూసి, ఆమె పైన ధనుర్దాసుకు ఎంత ప్రేమ ఉందో కదా! అనుకుని ఇలా ఎందుకు చేస్తున్నావ్ ? అని అడగగానే ఆమె కళ్ళు ఎంతో విశాలంగా ఉండి బాగుంటాయని, అవి ఎండకు వాడిపోతాయనీ, ఇంత అందమైన కళ్ళు ఎక్కడా చూడలేదనీ అంటాడు...





అంతకన్నా అందమైన కళ్ళు చూపిస్తే ఏంచేస్తావని అడిగితే జీవితాంతం సేవ చేస్తానంటాడు. అప్పుడు శ్రీరంగంలోని రంగనాథ స్వామిని దర్శింపజేస్తారు. స్వామి కనుల అందానికి పరవశుడై జీవితాంతం శ్రీరంగనాథుని సేవ చేసి తరిస్తాడు ధనుర్దాసర్. ఈ కథ మొత్తం చెప్తుందీ ఈ చిత్రం.

అలాగే సీతా కళ్యాణం కూడా ఒక కథా థీమ్ వలె చిత్రీకరించారు. లంకలో అశోక వృక్షంకింద విషాదంగా కూర్చున్న సీతమ్మను తెల్లని వస్త్రధారణలో వైవిధ్యంగా చూపించారు. ఆమె మనసు మండే మంటల వలె చుట్టూ చెట్లను ఎఱుపు- నారింజ కలసిన రంగులో జ్వాలగా చిత్రించారు. చిత్రం చూడగానే మనకు దుఃఖం ఉవ్వెత్తున పొంగి వస్తుంది .ఆ రామాయణంలోని సంఘటన ఏనాడో జరిగింది... కానీ ఇప్పుడు ఎదురుగా చూస్తున్నట్టు... చుట్టూ రాక్షసుల కాపలా అవీ అన్ని చాలా సజీవంగా కనపడతాయి వీరి చిత్రాలలో... శబరి చిత్రంలో సేవాభావం కనిపిస్తుంది. సాధారణంగా శకుంతల తెల్లనివస్త్రాలు, తెల్లని పూల అలంకరణతో ఉంటుంది. కానీ మాన్యులు శేషగిరి రావు గారు చిత్రకరించిన శకుంతల ఎఱ్ఱని దుస్తులతో ఉండి వెనుకకు తిరిగి చూస్తున్నట్టు ఉంటుంది... అది తాను ప్రేమించి, గాంధర్వ వివాహమాడిన దుష్యంతుడు రాకపోవడంతో విరహోత్కంఠిత భావం స్ఫురించాలని ఎరుపు రంగు వాడారేమో? అందులోనూ ఈ ఎరుపు రంగు శక్తిని ఇచ్చి, ప్రేరణ కలిగిస్తుంది.





దుష్యంతుడు నీవెవరో- నాకు తెలియదన్న అతని రాజ్యసభకే వెళ్లి, తన కొడుకుకు అతనే తండ్రి అని నిరూపించుకున్న ధైర్యశాలిగా ఎరుపు రంగులో చిత్రీకరించారనిపించింది.

ఇక ఈ చిత్రాల పరంపర శకుంతల దుష్యంతుల గాంధర్వ వివాహం, కణ్వ మహాముని చీర-సారెలతో కూతురునును అత్తగారింటికి సాగనంపడం, ఉంగరం పోవడం, శకుంతలను కాదనడం, తర్వాత స్వీకరించడం ఇది మొత్తం ఒక చిత్ర కావ్యం వలె కంటెదురుగా స్ఫురింపచేస్తుంది.

విశ్వామిత్ర-మేనకల చిత్రాలు కూడా అంత ఘనమైన కావ్యాన్ని చూపరులకు తేలికగా అర్థం అయ్యేలా వరుస చిత్రాలలో చిత్రించారు. అవన్నీ మనకాకథను చెప్తాయి.

అలాగే బమ్మెర పోతన్న గారి చిత్రాలు కూడా... చూడడానికి రెండుకళ్ళూ చాలవు! కలలో రామభద్రుడు కనిపించి భాగవతం రాయమనడం, ఏటి ఒడ్డున కూర్చొని రాస్తున్న పోతన గారు, ఆయనకు పలుకులమ్మ తనను నరులకు అంకితం ఇవ్వవద్దని దీనంగా చెప్పడం- ఆ చిత్రాలను వర్ణించ డానికి పదాలు చాలవు!





ముఖ్యంగా ప్రకృతిని చిత్రించడమైతే అద్భుతం ఆకుపచ్చని ఆకులే ఎన్నో షేడ్ (shade) లలో వేసారు.

గ్రామీణ యువతుల బొమ్మలన్నీ సజీవంగా చిత్రించారు. అలాగే బతుకమ్మను తలపై పెట్టుకొన్న యువతి బొమ్మ తెలంగాణా సంస్కృతి - సంప్రదాయాలను తెలిపే లాగా చిత్రించారు. సేవ్ రాక్స్ అనే సందేశాన్ని తెలిపే ఎన్నో రాళ్ళ చిత్రాలు ఈ ప్రదర్శన ప్రకృతిని కాపాడుకోవాలని సందేశాన్ని ఇచ్చింది.మామూలుగా చిత్రకారులు చెప్పే విషయమేమంటే నీలిరంగు సత్యాన్ని చెబుతుందనీ, చెప్పిస్తుందనీ అంటారు... శకుంతల సభలో ఉన్న దృశ్యం పైన నీలి రంగు వాడారు.

ఎఱుపు రంగు శక్తినిస్తుందని దుర్గా అమ్మవారి చిత్రంలో హైలెట్ చేసారు. ఆకుపచ్చ రంగు మనసు బాగాలేనప్పుడు ఆ మూడ్ ను మెరుగు పరుస్తుంది. కణ్వాశ్రమంలో ఎన్నోరకాల ఆకుపచ్చ షేడ్స్ వేసారు.

ఆకాశం ప్రశాంతతను సూచిస్తుంది. తాపసుల చిత్రాలలో ఆకాశం హైలైట్ చేసారు. మహాభారత పాత్రలలో ని కథను మాటల్లో కాకుండా రేఖల్లో చెప్పగల గొప్ప కళానైపుణ్యం ఉన్నవారు శేషగిరిరావుగారు. ఆ ఆలోచన వారికి రావడమే గొప్పంటాను. ఎందుకంటే చిత్రాలను ఇలానే గీయాలనే ఒక సిద్ధాంత మేమీలేదు.. ఆ యా కళాకారుల భావమెలా స్పందిస్తే వారి చేతివేళ్ళు అలా పరుగెడుతాయి. ఇలాంటి చిత్రాలితరులూ చిత్రించి ఉండవచ్చును. కానీ ఎవరిశైలి వారిది. దమయంతి చిత్రాన్ని చూస్తే ఆమెఅందం గంధర్వుడినే మైమరిపించి, స్వయంవరంలో పాల్గొనాలనే ఆశ కలగడం, ఆకాలంలోనూ తంతితపాలా సౌకర్యం పావురాల ద్వారా చేసారని తెలిపే దమయంతి నలునికి సందేశం పంపడం, అశ్వ విద్యతో లేడి వలె లంఘించడం మొదలైన విషయాలన్నీ ఈ చిత్రాలలో తెలుస్తాయి. ఇంతటి గొప్ప చిత్రకారులైన శేషగిరిరావు 26-7-2012లో స్వర్గలోకంలో అందమైన చిత్రాలను అలంకరించాలని వెళ్ళారు.

ఇలా చెబుతూ పోతే చూసేవారికి ఆసక్తి తగ్గుతుందేమో నని నా మాటలు తగ్గించాను! కానీ వారి చిత్ర కళను తక్కువ చేసి చెప్పాలని కాదు! రాగల వారందరూ వచ్చి అందుబాటులో ఉన్న ఈ గొప్ప ప్రదర్శనను తిలకించి పులకించగలరని మాత్రమే నేను చెప్పగలను!



ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 4 హైదరాబాద్ ఫిబ్రవరి : 2025


# వికీపీడియా – తెలుగు సాహిత్యం

**మ్యాడం అభిలాష్,** తెలుగు వికీపీడియన్, జాజాపూర్, నారాయణ పేట జిల్లా. ఫోన్ : 814 257 6346

సాహిత్యం భాషకు హృదయం వంటిది. తెలుగు సాహిత్యం, ప్రాచీన కాలం నుంచి ఆధునిక యుగం వరకు, ఎందరో సాహితీ ప్రియులతో ప్రపంచాన్ని అలరిస్తూనే ఉంది. ఈ వైభవాన్ని డిజిటల్ ప్రపంచానికి చేరువ చేయడంలో వికీపీడియా పాత్ర ఎనలేనిది. వికీపీడియా ఒక సార్వజనీన విజ్ఞాన స్రవంతి. అందరూ చదవడమే కాకుండా రాయడం కూడా సులభతరం చేసిన మాధ్యమం వికీపీడియా. 2003లో ప్రారంభమైన తెలుగు వికీపీడియా తెలుగు భాషాభిమానుల కృషితో అనేక క్షేత్రాల్లో విశేష పురోగతిని సాధించింది.

**తెలుగు వికీపీడియా ఆవిర్భావం :**

2001లో ఆంగ్లంలో ప్రారంభమైన వికీపీడియా, 2003లో వెన్న నాగార్జున గారి కృషితో తెలుగు వికీపీడియా (te.wikipedia.org) రూపంలో తెలుగు భాషాభివృద్ధికి మార్గదర్శిగా ఆవిర్భవించింది. ప్రారంభ దశలో, సాంకేతిక పరిమితుల కారణంగా, తెలుగులో టైపింగ్ వంటి సమస్యలు ఎదురైనప్పటికీ, రోమనైజ్డ్ లిపి ఉప యోగించి దశలవారీగా అభివృద్ధి చేయబడింది. ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన జిబోర్డ్ (Gboard), గూగుల్ ఇన్‌పుట్ పద్ధతులు, లిప్యంతరీకరణ విధానాలు తెలుగులో రాయడాన్ని మరింత సులభతరం చేశాయి.

**తెలుగు సాహిత్యానికి వికీపీడియా సేవలు :**

తెలుగు వికీపీడియాలో గురజాడ అప్పారావు, వేమన, శ్రీశ్రీ, కాళోజీ వంటి ప్రముఖ కవులతో పాటు సమకాలీన సమాజంలో నూతన సాహిత్యాన్ని సృష్టిస్తున్న డా. సాగి కమలాకర శర్మ, డా. ఎస్. రఘు, అట్టెం దత్తయ్య, తగుళ్ళ గోపాల్ వంటి మొదలైన వర్తమాన కవుల, రచయితల జీవిత విశేషాలు కూడా అందుబాటులో ఉన్నాయి. అదే విధంగా ఆధునిక, ప్రాచీన సాహిత్య కృతులైన ఆంధ్ర మహాభారతం, తెనాలి రామకృష్ణ కథలు, వేమన శతకం మొదలైన వాటిపై వ్యాసాలు రచితమయ్యాయి. అంతెందుకు ప్రస్తుతం మీరు చదువుతున్న ఈ మూసీ మాస పత్రిక గురించిన వ్యాసం కూడా వికీపీడియాలో ఉంది. ఈ విధంగా తెలుగు భాషా ప్రాచుర్యానికి సంబంధించిన వ్యాసాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. వికీపీడియా డిజిటల్ వేదికగా ప్రతిష్ఠాత్మక కవిత్వాలు, నవలలు, నాటకాలు, కథానికలు వంటి వాటి గురించి విస్తృత సమాచారం అందిస్తోంది.

వికీపీడియాతో పాటు దాని సోదర ప్రాజెక్టులైన వికీసోర్సు, వికీవ్యాఖ్య, వికీకామన్స్, వికీబుక్స్, విక్షనరీ వంటి వాటిల్లో కూడా సాహిత్య ప్రచారం జరుగుతుంది. స్వేచ్ఛా నకలు హక్కులు గల ఉచిత గ్రంథాలయం గా 'వికీసోర్సు', ఉచిత చిత్రాలు, వీడియోల రూపంలో 'వికీ కామన్స్', ప్రముఖుల వ్యాఖ్యలతో కూడిన 'వికీవ్యాఖ్య', సృజనాత్మక రచనలు గల 'వికీబుక్స్', పదాలు వాటి అర్థాలతో కూడిన 'విక్షనరీ' వంటివి మనకు అందుబాటులో ఉన్నాయి.

తెలుగు సాహిత్య విషయాలను సమాజానికి చేరువ చేయడానికి సాహిత్య ప్రియులుగా మన అవసరం చాలా ఉంది. కాబట్టి ఒక్కో విభాగంలో ఏయే విషయాలపై దృష్టి సారించవచ్చో ఇపుడు చూద్దాం.

**వికీపీడియాలో**

ఇది సమగ్ర వ్యాసాల సంకలనం కాబట్టి ఇందులో అనేక రకాల సాహిత్య సంబంధిత వ్యాసాలను చేర్చాల్సిన అవసరం ఉంది.

**తెలుగు వికీపీడియా**

**స్వేచ్ఛగా**

**పంచుకోండి,**
**సవరించండి,**
**మెరుగుపరచండి,**
**ఉపయోగించుకోండి**

వికీపీడియా
స్వేచ్ఛా విజ్ఞాన సర్వస్వము
te.wikipedia.org

1. వివిధ పుస్తకాలపై సమీక్షా వ్యాసాలు
2. సాహితీవేత్తలపై వ్యాసాలు
3. పరిశోధించి నిర్ధారించిన విషయాలకు సంబంధించిన వ్యాసాలు
4. సాహిత్య చరిత్రకు సంబంధించిన వ్యాసాలు
5. జానపద సాహిత్యానికి చెందిన వ్యాసాలు
6. పురాతన సాహిత్య ప్రదేశాలకు సంబంధించిన వ్యాసాలు

ఇంకా ఇలా మొదలైన ఏ అంశంపై అయినా వ్యాసాలను రాయవచ్చు.

**వికీ కామన్స్ లో**

ఇది అనేక చిత్రాలు, పుస్తకాలు, ఆడియోలు, వీడియోల సంకలనం కాబట్టి ఇందులో –

1. కవులు, రచయితల చిత్రాలు
2. సాహిత్య ప్రదేశాల చిత్రాలు

3. సాహితీ ప్రముఖుల ప్రసంగాలు

4. వివిధ పదాల ఉచ్చారణాలు మొదలైన వాటిని చేర్చవచ్చు.

**వికీసోర్సులో**

ఇది అనేక పుస్తకాల సంకలనం కాబట్టి అనేక పుస్తకాలను ఇందులో చేర్చాల్సిన అవసరం ఉంది. సాహిత్యం చదివిన వారు మాత్రమే ప్రాచీన సాహిత్య పుస్తకాలను కానీ, ఆధునిక సాహిత్య పుస్తకాలను కానీ చదివి అర్థం చేసుకోగలరు. కాబట్టి వాటిని వికీసోర్సులో చేర్చాల్సిన బాధ్యత మనపై ఉంది.

**వికీ వ్యాఖ్య**

ఇది ప్రముఖ వ్యక్తులు చెప్పిన సూక్తుల సంకలనం. ప్రాచుర్యం పొందిన అన్నీ సూక్తులను, ముఖ్యమైన మాటలను ఇందులో పొందుపరచవచ్చు. కాబట్టి తెలుగు సాహిత్యంలో కాలానుగుణంగా వచ్చిన వివిధ కవులను ఒక దగ్గర చేర్చి వారు చెప్పిన వ్యాఖ్యలను పొందుపరచడం వల్ల సాహిత్యంలోని అన్నీ ప్రముఖ సూక్తులను ఒకదగ్గర చేర్చినవారం అవుతాం. కాబట్టి ఆ దిశగా ఇందులో మన ప్రయత్నం చేయవచ్చు.

**వికీ బుక్స్**

సాహిత్యం, సృజన అనేవి రెండు అవినాభావ సంబంధం కలిగి ఉన్నవి. వ్యక్తిలోని సృజనాత్మక శక్తి వలననే మంచి సాహిత్యం రూపొందుతుంది. ఈ విధంగా సృజనాత్మక శక్తిని ఉపయోగించి పుస్తకాలను రాయడం కోసం ఈ వికీ బుక్స్ ఉపయోగపడుతుంది. సాహిత్యం పట్ల ఆసక్తి ఉన్న వారందరూ సమిష్టిగా ఒకే పుస్తకాన్ని ఇందులో తయారు చేసుకోవచ్చు.

ఉదాహరణకు :

1. కవితా సంకలనం

2. వ్యాస సంకలనం

3. కథల సంకలనం

4. జీవిత చరిత్ర మొదలైనవి.

**విక్షనరీ**

తెలుగు సాహిత్యం చదివే ప్రతి ఒక్కరికీ ఆన్లైన్ లో బాగా పరిచయం ఉన్న నిఘంటువు 'ఆంధ్రభారతి'. ఇందులో ఏదైనా పదాన్ని శోధిస్తే ఆ పదం యొక్క అర్థం వివిధ నిఘంటువులలో ఏమి ఉందో తెలుపుతుంది. ఈ నిఘంటువును నిర్మించే సభ్యులు పరిమితంగా ఉండి పూర్తి పనులు చూస్తూ ఉంటారు. కానీ విక్షనరీ అనే నిఘంటువులో మాత్రం పదాలను ఎవరైనా చేర్చవచ్చు. తప్పులను కూడా సరిదిద్దవచ్చు. కాబట్టి సాహిత్యం చదివే సందర్భంలో మనం గుర్తించిన కొత్త పదాలను ఎక్కడ దాచుకోవాలో తెలియనప్పుడు వాటిని చక్కగా ఈ విక్షనరీలో చేర్చి, వివరణ ఇచ్చి, ఆ పదానికి చెందిన చిత్రం కూడా చేర్చవచ్చు. ఈ విధంగా సాహిత్య పుస్తకాలు చదివే సమయంలో ఆయా కవులు ఉపయోగించిన కొత్త కొత్త పదాలను ఈ విక్షనరీలో చేర్చి సాహిత్యం తెలియని వారికి కూడా ఉపయోగపడేట్టు సహాయం చేయవచ్చు.

**వికీపీడియా రచనా విధానాలు :**

వికీపీడియాలోని వ్యాసాలు తటస్థ దృక్పథంతో ఉంటాయి. వ్యక్తిగత అభిప్రాయాలకు తావు లేకుండా, ప్రామాణికమైన మూలాలను మాత్రమే ఉపయోగించిన వ్యాసాలు ఉంటాయి. మౌలిక పరిశోధనలకు నోచుకోకుండా వ్యాసం మొత్తం మౌలిక సమాచారంపై కాకుండా, విశ్వసనీయ మూలాల ఆధారంగా ఉంటాయి. ప్రతి వ్యాసం మూలాలు, ఇన్ఫోబాక్సులు, అంతర్లింకులు, గమనికలు వంటి అంశాలతో ప్రామాణికంగా తయారై ఉంటాయి.

**భవిష్యత్ లక్ష్యాలు :**

ఇటీవలి కాలంలోనే తెలుగు వికీపీడియా లక్ష వ్యాసాలను అధిగమించింది. ఇంకా మరింత సమాచారం చేర్చడం కోసం తెలుగు వికీపీడియా ద్వారా గ్రామీణ పాఠశాలలకు సాంకేతిక శిక్షణ అందించడం, సాహిత్య సదస్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహించి వికీపీడియా అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందిస్తూ సమాజం నుండి పుట్టిన సాహిత్యాన్ని మళ్ళీ సమాజానికే చేరవేయడంలో వికీపీడియాను వారధిగా చేసుకోవచ్చు.

**ఉపసంహారం :**

వికీపీడియాలో **"పాఠకులే రచయితలు"** అనే నినాదంతో, సాధారణ పాఠకులకే వ్యాసాలు సృష్టించే అవకాశం లభిస్తోంది కాబట్టి మనకు తెలిసిన సమాచారాన్ని విశ్వసనీయమైన మూలాలు చేర్చి భద్రపర్చుకోవడం వల్ల భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేసిన వారం అవుతాం. వికీపీడియా అనేది ఒక సాంకేతిక రసజ్ఞతా వేదిక. ఇది సాహిత్యాన్ని, విజ్ఞానాన్ని ఒకే మేళవింపుగా మారుస్తోంది. డిజిటల్ విప్లవంలో భాగస్వామ్యం కావాలనుకునే ప్రతీ తెలుగు భాషాభిమానికి ఇది ఒక అమూల్య సాధనంగా ఉపయోగపడుతుంది.

వికీపీడియా ఒక్క తెలుగు భాషలోనే కాకుండా కన్నడం, తమిళం వంటి ఇతర భాషల్లో కూడా అందుబాటులో ఉంది కాబట్టి మన మాతృభాషలో సాహిత్యాన్ని సుసంపన్నం చేయడానికి ఇదొక చక్కటి సాధనం అని తెలుపుతూ మాతృభాషా దినోత్సవ సందర్భంగా ఈ పత్రిక వేదికగా సాహితీ ప్రియులకు ఈ వ్యాసాన్ని అంకితం చేస్తున్నాను.

**"తెలుగు సాహిత్య విస్తరణ మనందరి బాధ్యత. అందుకు డిజిటల్ మాధ్యమాన్ని వినియోగిద్దాం!"**

# 'కవితామృతమయం' ఎన్.గోపి 'రేపటి మైదానం'

**డా. గిన్నారపు ఆదినారాయణ,** తెలుగు అధ్యాపకులు, యూనివర్సిటీ పి.జి. కళాశాల, ఓయూ. ఫోన్ : 9949532456

**పరిచయం :**

తెలుగు సమాజానికి నానీలు, వేమన అనగానే గుర్తుకు వచ్చే మొదటి పేరు డా. ఎన్.గోపి. పరిశోధన ఎంత ఉన్నతంగా చేశారో, ఉద్యోగ బాధ్యతల నిర్వహణ కార్యక్రమాలు కూడా అంతే చేశారు. అలాగే సృజనాత్మక సాహిత్య కవిత్వాన్ని కూడా చాలా హుందాగా కొనసాగించారు. ఎన్.గోపి చాలా సహజంగా ప్రతి సంవత్సరం నిరంతర ప్రవాహంలా ఒక పుస్తకం వేస్తుంటారు. తాను నిరంతర సాహిత్య శ్రామికుడు. నిత్యం ఏదో ఒక నూతన అంశం పై కవిత్వం రాస్తూ ఉంటారు. నిత్యం రాయడం అంటే నిత్యం సమాజంలో చలనంలో ఉండటం. సమాజాన్ని చాలా జాగ్రత్తగా గమనిస్తుంటారు. ఆ గమనంలో నుంచి వచ్చిన కవితలే ఆయన కవితా సంపుటాలు. కాలం ఎప్పుడు మార్పును కోరుకుంటుంది. ఆ మార్పేంటో గ్రహిస్తూ మనకు ఒక కొత్త విషయాన్ని కవిత్వ రూపంగా తెలియపరుస్తుంటారు గోపి. గోపి సమాజం పట్ల విశాలమైన మానవీయ దృక్పథం కలిగినవారు. అందుకే మనుష్యుల్ని అమితంగా ప్రేమిస్తుంటారు.

ఎన్. గోపి 1960 విద్యార్థి దశ నుండి కవిత్వం రాయడం ప్రారంభించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు తెలుగు సాహిత్యంలో అనేక కవిత్వోద్యమాలు వచ్చాయి. అయినా తాను ఎక్కడ కూడా ఒక ఉద్యమానికి పరిమితమై ఉండకుండా తన కవిత్వ అస్తిత్వాన్ని తాను నిలుపుకుంటూ ఎన్నో కవితా సంపుటాలు వెలువరించారు. కొన్ని గ్రంథాలు భారతీయ భాషలన్నింటిలోకి అనువాదం అయ్యాయి. గొప్ప పరిశోధన గ్రంథాలు అందించారు. నూతన కవితా ప్రక్రియలకు నాంది పలికారు. ఎంతోమంది యువకవులకు మార్గదర్శనం చేస్తూ కవిత్వాన్ని కొనసాగిస్తున్నారు. అరవై ఏళ్ళక్రితం రాసిన కవిత్వం నేటికి కొత్తగా నిగనిగలాడుతూ ఉంటుంది. అప్పటినుండి ఇప్పటి వరకు 28 కవితా సంపుటాలు ప్రచురించారు. కొన్ని కవితా సంపుటాలు అనేక ముద్రణలు పొందాయి. అలాగే వారి పరిశోధన గ్రంథం *'ప్రజాకవి వేమన'* లాంటి సిద్ధాంత గ్రంథం కన్నడ భాషలోకి అనువాదం అయ్యింది. తెలుగులో అనేక సిద్ధాంత గ్రంథాలు వచ్చినా ఏవి ఇతర భాషల్లోకి అనువాదం కాలేదు. నాకు తెలిసి డా. ఎన్. గోపి గారి 'ప్రజాకవి వేమన' తెలుగు భాష నుండి కన్నడ భాషల్లోకి అనువాదం పొందిన మొట్టమొదటి సిద్ధాంత గ్రంథం. అలాగే వీరు ఎన్నో దేశ, విదేశాలకు సాహిత్య కార్యక్రమాల పిలుపు మేరకు యాత్రలు చేశారు. ప్రతి ప్రయాణంలో తన అనుభవాలను అక్షరీకరించి కవితల రూపంలో నూతనోత్తేజాన్ని మనతో




పంచుకుంటారు. ప్రతి సందర్భాన్ని కూడా కవితా రూపంగా స్వీయ అనుభవాలను పంచుకోవడం గోపి గారి ప్రత్యేకత. ఇది వారి లోతైన ఆలోచన దృష్టికి నిదర్శనం.

ఎన్. గోపి మొదటి కవితా సంపుటి 'తంగేడుపూలు'(1976) నుండి మొదలుకొంటె 'రేపటి మైదానం' (2024) వరకు ప్రతి కవిత నూతనత్వాన్ని కల్గిస్తుంది. సమాజంలో కనిపించే చాలా సహజమైన వస్తువుకు కవిత్వంతో ప్రాణం పోశారు. వస్తు పరంగా అతి సహజంగా సమాజంలో కనిపించే బొంత, రెట్ట, ఆకలి, చూపు, పల్లె, వృద్ధాప్యం, ఉత్తరం వంటి వస్తువులను ఎంచుకొని కవిత్వంతో ప్రతి వ్యక్తి అంతరాత్మను కదిలించారు. ఎన్. గోపి సాహిత్య వస్తువు ఎంపిక ఎంత ముఖ్యమో దాన్ని నడిపించే శిల్పం విధానం కూడా అంత అద్భుతంగా, సహజంగా ఉంటుంది. అలా తెలుగు, తెలుగేతర సాహితీ అభిమానులందరిని నేటి పరిస్థితులతో రేపటి మైదానంలోకి పంపించి స్వైర విహారం చేయిస్తారు.

**రేపటి మైదానం కవితా సంపుటి విశ్లేషణ:**

ఇటీవల కాలంలో డా.ఎన్.గోపి రాసిన కవితా సంపుటి *'రేపటి మైదానం'(2024).* గోపి గారిని కదిలిస్తే కవిత్వం పుట్టుకొస్తుంది. మాట్లాడితే ప్రతి మాట కవితై విరభూస్తుంది. తాను ఎప్పుడు కవిత్వాన్ని ప్రేమిస్తూ, సాహిత్యాన్ని అధ్యయనం చేస్తుంటారు. గొప్ప పరిశోధకులుగా, ఉత్తమ అధ్యాపకులుగా, విశ్వవిద్యాలయ ఉప కులపతిగా (వైస్ ఛాన్సలర్) తన జీవితంలో తాను ఉన్నత పదవు లన్నింటిని హుందాగా నిర్వర్తించారు. అన్నింటికి సరైన న్యాయం చేశారు. ఎన్ని ఉన్నత పదవులు నిర్వర్తించినా తనకు కవిగా ఉన్న గుర్తింపే పలకరింపు అని అంటారు. ***"మా ఇంటినిండా పుస్తకాలు/***

*ర్యాకులనిండా కుర్చీల నిండా/ మార్గదర్శనం చేసే మహానుభావుల్లా/ రెపరెపలాడుతుంటాయి./ ఎప్పటికీ మారని ప్రాణ స్నేహితుల్లా పలకరిస్తాయి."* అంటారు.

**స్మృతి కవిత్వం :**

కవి తన ఆత్మీయ మిత్రులు ఈ లోకం నుండి దూరం అయినప్పుడు, తన ఆత్మీయులు సాహిత్యంలో ఉన్నతంగా ముందుకు వెలుతున్నప్పుడు వారిని తలచుకుంటూ వారితో తనకుండే అనుబంధాన్ని వారి వ్యక్తిత్వాన్ని కవితారూపంలో మనతో పంచుకున్నారు.

*"కవీ చిత్రకారుడనే ఒక పార్శ్వం / సాదా సీదా వ్యక్తిత్వం మీది*
*గోదావరిని దేశమంతా అద్దిన ఆర్ద్రమూర్తి మీరు*
*యాభై యేండ్ల మన స్నేహితం*
*నేటి నుంచి ఒక అఖాతం"* (పుట:69)

ఇలా తన సాహితీ, ఆత్మీయులను కోల్పోయిన ప్రతిసారి వారితో ఉన్న అనుబంధాన్ని వల్లెవేసుకున్నారు. అలాగే డా. ఎన్.గోపి మొదటి కవితా సంపుటి తంగెడుపూలు ముఖచిత్రాన్ని వేసిన ప్రముఖ చిత్రకారుడు, కవి శీలా వీర్రాజు, కవి, రచయిత ఎండ్లూరి సుధాకర్, గాయకురాలు లతా మంగేష్కర్, అన్నమ్మ టీచర్ వంటి వారు ఈ లోకం విడిచి వెళ్ళినప్పుడు ఆర్ద్రతతో వారి వ్యక్తిత్వాన్ని తాను వారిని అర్థం చేసుకున్న విధానాన్ని మనకు కళ్ళకు కనిపించేట్లు కవిత్వీకరించారు కవి.

**టెక్నాలజీ వ్యవస్థ :**

నేటి సమాజం మొత్తం కూడా టెక్నాలజి ఆధారంగా నడుస్తుంది. కొంత కాలానికి ముందు అయితే రేపు వెలుతున్నామంటే నేడు ఆ ప్రయాణానికి సంబంధించిన వివరాలు అన్ని తెలుసుకొని వెళ్ళేవాళ్ళం. కాని నేడు టెక్నాలజి పెరిగిపోయింది. మొబైల్ లో జి.పి.ఆర్.ఎస్ ఆన్ చేసి బయలుదేరి వెళ్ళుతున్నాం. కొన్నిసార్లు దాన్ని నమ్ముకుంటే చాలా ఇబ్బందులు కూడా ఎదురవుతున్నాయి అనే విషయాన్ని కవి ఇలా వ్యక్తం చేస్తున్నారు.

*"ఇదేమిటి! / ఇవాళ ఈ నక్షా,*
*నా నగరాన్ని నాకే అపరిచితం చేస్తున్నది*
*సందుల సంఖ్యను పెంచుతూ*
*నా ప్రయాణాన్ని పద్మవ్యూహంగా మారుస్తున్నది"* (పుట: 44)

అంటున్నారు కవి. ఇలా రూట్ మ్యాప్ ద్వారా అనేక మంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారనే విషయం మనం కొన్ని సార్లు పత్రికల్లో చూసే ఉంటాం. రూట్ మ్యాప్ ను నమ్ముకోవడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కూడా కోల్పోయారు అని వర్తమాన స్థితిని కవి మనకు తెలిపారు.

నేడు సమాజం నడుస్తుందంతా కంప్యూటర్ టెక్నాలజి మీదనే. టెక్నాలజి వ్యవస్థ వచ్చి పుస్తకాలను దూరం చేసింది. టెక్నాలజి వ్యవస్థ మంచిదే కాని కొన్ని టెక్నికల్ సమస్యలు కూడా ఉన్నాయి. ఈ బుక్, ఈ పేపర్ చదివేస్తాయికి చేరుకున్నారు. కాని చేతిలోని పత్రిక, పుస్తకం చదివినంత సంతృప్తి ఆన్‌లైన్ పేపర్, పుస్తకంలో ఉండదు. ఇది చాలా మంది ఒప్పుకునే విషయమే. అందుకే కవి

*"కొన్ని వేల పుస్తకాలు చదివాను / శుక్లాలు తేలాయి, కనులు అలసి పోయినై గాని / అంతర్నేత్రానికి మాత్రం అవి తాజా దృశ్యాలే!"* (పుట:18)

*"పుస్తకం వ్యక్తిత్వాన్ని చెక్కుతుంది, సమస్యలకు పరిష్కారం చెప్తుంది.*

*పుటల రెపరెపల చప్పుళ్ళ ముందు ఏ సంగీతము పనికి రాదు"* (పుట:76)

పుస్తకం తనకు నేస్తం అని అంటారు. ఒక్కసారి పుస్తకాన్ని ముట్టుకొని దాని మీద ఉన్న దుమ్మును చేతులతో స్పృశిస్తే గనుక అది గంధపు పొడిలా పరిమళిస్తూ సువాసనను వెదజల్లుతుంది అని అంటారు గోపి.

**కవిత్వం - కవులు :**

మనుష్యులే నాకు నేస్తం కాదు పుస్తకమే నా నేస్తం అంటారు కవి. పుస్తక పఠనం చాలా ఇష్టం. అందులో కవిత్వం అంటే ఇంకా ఇష్టం. యువకవులు రాసిన కవిత్వం నుండి మొదలుకొని తన సమకాలికులు రాసిన కవిత్వం వరకు ప్రతి కవిత చదివి అందులో సారాన్ని ఆస్వాదించడం అంటే ఆయనకు అమితమైన ప్రేమ. ఆ కవిత్వం తన మనస్సుకు తడితే వారితో మాట్లాడి వారికి కొత్త భూస్టుని అందిస్తారు. కొన్నిసార్లు కవిత్వంలో ఉండే సాధకబాధకాలను కవిత్వంగా మలిచారు కవి. *"గాయాల మాల ధరించిన/ఆదివాసి లాంటిది / కవిత్వం శాపంగా పరిణమించిన వరం/అందమైన తత్వం"* (పుట:143) కవిత్వం రాయడం అంటే పెన్సిల్‌ను షార్పనర్‌తో తిప్పనంత ఈజీ కాదు చెక్కినప్పుడు చెక్కులు పువ్వులా ఎంత వేదనతో విచ్చుకుంటాయో కవిత్వం కూడా అంతే అంటారు. అలాగే కవులతో ప్రయాణం చేయడమంటే కవిత్వంతో ప్రయాణం చేయడం అంటారు. వారితో ప్రయాణం అనేది ఒక కొత్త అనుభూతిని అందిస్తుంది అంటారు కవి.

*కవులతో ప్రయాణం / పువ్వుల ద్వారా వేర్లని పలకరించినట్టు / కారు ఇంధనంతో కాక / కబుర్లతోనే నడుస్తున్నట్టు/ విడివిడి కవితలు ఒక కావ్యంగా రూపొందుతున్నట్టు* (పుట:109) కవులతో ప్రయాణం చేయడమంటే కవితా సంకలనం వెలువడినంత సంబురం ఉంటుంది. భిన్న రకాల ఆలోచనలు, వస్తువులు ఒకచోట చేరి నాట్యం చేస్తున్నంత హాయిగా ఉంటుంది అంటారు. ఇలా ప్రతిఒక్క కవి జీవితం ఒక్కో విధంగా ఉంటుంది. జీవితం అంటేనే కష్టసుఖాల

సంగమం. కవి గోపి కూడా మారుమూల గ్రామం పేదరికం నుండి వచ్చిన వ్యక్తి కాబట్టి ప్రతి వ్యక్తికి తన కవిత ద్వారా ఎంతో ధైర్యాన్ని అందిస్తారు. జీవితమంటే జీవించి ఉండడమే అని అంటారు.

మనిషి ఎప్పుడు కూడా ఒంటరివాడు కాదు. ఏకాంతానికి నిశ్శబ్దానికి స్నేహం తోడుగా ఉంటుంది అంటారు. ఏకాంతమంటే ఒంటరితనం అస్సలే కాదు, అది సామూహిక స్వప్నానికి పునాది, మానవీయ భావాల అల్లిక అని తెలుపుతారు.

*"మనిషీ మనిషీ కలిస్తే ఇద్దరవుతారు*
*కాని ఇద్దరు కలిస్తే అది ఒక్కరే*
*ఏకం, అనేకాల మధ్య అనుబంధమే జీవిత రహస్యం"* (పుట: 19) అని జీవిత రహస్యాన్ని తెలిపారు.

అలాగే కవులు చాలా శ్రమకోర్చి కవిత్వాన్ని పుస్తకంగా తీసుకు వస్తారు. పుస్తకం తీసుకురావడంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటూ ఉంటారు. సమాజస్థితి అక్షరాల విలువ తెలిసినవాడు కవి. కాబట్టి అవసరమైతే ఆ పుస్తకం కోసం అప్పులు చేసి మరి పుస్తకాన్ని ముద్రణ చేస్తారు. అలా చాలా మంది ఉన్నారు. కవి కీర్తి ప్రతిష్టలు వారసులకు ఇష్టమే కాని తన పేదరికంతో అతన్ని పెద్దగా పట్టించుకోరు పైగా తిట్టుకునే సందర్భాలు కూడా ఉంటాయి. కవుల పరిస్థితిని తెలుపుతూ

*"కవి మరణించాడు / వారసులు / అతని అముద్రిత రచనలను*
*రద్దీ కింద అమ్మేశారు. రాతిబాట్లతో దండెకొట్టే*
*పాత కాగితాల బేహారికి / వాటి విలువ తెలియదు."* (పుట:156)

కవి ఎంతో వేదన చెంది అక్షరాలను పోగు తన భావాన్ని వ్యక్తం చేస్తాడు. ఆ బాధ తోటి కవితే తెలుస్తుంది. కవిత్వం విలువ, అక్షరాల విలువ తెలియని వారు చాలా తన రాతను చాల చులకనగా చూస్తారు అని పై విధంగా తెలిపారు.

**పిల్లలు – మల్లెలు :**

కవిత్వం రాయాలంటే పెన్ను, పేపరు పట్టుకుని కూర్చుంటే వచ్చేంది కాదు. కవికి సమాజంలో కనిపించే ప్రతి అంశంపై గాఢ దృష్టి పసితనం, మొరటుతనం, చిలిపితనం లాంటి లక్షణాలన్ని కూడా కలిగి ఉండాలి అప్పుడే కవిత్వాన్ని మనం ఉన్నతస్థాయిలో చూపించగలుగుతాము. ఎన్.గోపి పసిపిల్లవాడి మనస్సులోకి చొచ్చుకుపోయి ఊరిలో ఉండే పిల్లవాడిని మనస్తత్వాన్ని కవిత్వీకరించారు. పిల్లలను చదువులకోసం పట్టణంలోకి తీసుకువచ్చి హాస్టల్లో ఉంచితే ఆ విద్యార్థి అక్కడ ఉండలేక పడే ఇబ్బందులను వారి ఆలోచన విధానం ఎలా ఉంటుందో కింది తెలిపారు.

*"ఒకే గదిలో పది మంది విద్యార్థులు / అయినా వాడికి / ఆకాశమంత ఒంటరితనం*

*అమ్మానాన్నలు గుర్తుకొస్తున్నారు / పల్లెలోని సోపతి గాండ్లు గుర్తుకొస్తున్నారు*

*నెలరోజుల్లో రెండుసార్లు జ్వరమొచ్చింది*

*నదిలా మాట్లాడేవాడు / గదిలా మౌనం వహించాడు."* (రేపటి మైదానం: 83)

ఇలా గ్రామాల నుండి పిల్లలను ఉన్నత చదువులకోసమని పట్నం లోకి తీసుకువచ్చి ఇక్కడ ఉంచితే అతడి హృదయం ఎలా ఉంటుందో పై విధంగా తెలిపారు కవి.

అలాగే ఎన్.గోపి పిల్లల స్థితిని ఎంత ఉన్నతంగా చెప్పారో తన ఇంటి ముందటి మల్లెమొగ్గలను కూడా అంతే ఉన్నతంగా తెలిపారు. చాలా బారిగా పెరిగిన మల్లెచెట్టు వారి ఇంటి ముందర ఉంటుంది. అటువైపుగా వెళ్ళేవారందరు దాన్ని చూడాల్సిందే అన్నట్లుగా ఉంటుంది. రెండంతస్తుల బిల్డింగ్ పై వరకు ఉంటుంది. ఆ మల్లెచెట్టుకు పూసే మల్లెపూలు అటువైపుగా వెళితే గుప్పున వాసనను వెదజల్లుతుంది. అందుకే అంటారు

*"మొగ్గ పిడికిలి మూసిన ఆశలాంటిది*
*తెరిచే దాకా నిద్ర పట్టదు, మల్లెమొగ్గ, మాట్లాడకపోవచ్చు*
*కాని దాని, నిశ్శబ్ద క్షణాలన్నీ నోళ్ళే"* (పుట: 28) అంటారు.

ఇలా చాలా సాదాసీదాగా సాధారణంలో అసాధరణమైనటు వంటి అర్థాన్ని తెలియజేశారు. అది గొప్ప కవిత్వం గొప్పతనం అని చెప్పాలి.

**ముగింపు :**

గోపి కవిత్వంలో వర్తమాన చరిత్ర రికార్డు అవుతుంది. వర్తమాన కాల పరిస్థితులను కవిత్వ భావచిత్రంతో యథార్థంగా కళ్ళ ముందు నిలుపుతారు ఎన్. గోపి. మారుతున్న కాలంతో ప్రయాణం చేస్తూ కవిత్వ ధూళిని మనకు వెదజల్లుతారు. తన అమృతోత్సవ సందర్భంగా 75 కవితల సమాహారంతో అమృతాన్ని కురిపించిన చలనశీలి ఎన్. గోపి. రోజూ ఒక కవిత రాస్తూ కవిత్వం ఒక తీరని దాహం మాదిరిగా మన ముందు ప్రత్యక్షమవుతారు. నిన్నటి మైదానం ఎలా ఉందో తెలిపి, నేటి మైదానం ఎలా నడుస్తుందో తెలుపుతూ, రేపటి మైదానం ఎలా ఉండబోతుందో సూచన చేస్తుంటారు. ఇలా ఈ కవితా సంపుటిలోని ప్రతి కవిత ఒక గులాబి రేకులా పరిమళిస్తుంటుంది. పరిమళించే రేకు కలిసి విరబూసిన పుష్పంలా నిగనిగలాడుతుంది. మనకు గొప్ప తేజస్సును కలిగిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. పాలపిట్ట మాసపత్రిక, నవంబర్ 2021.

2. ఎన్. గోపి, రేపటి మైదానం,(కవితా సంపుటి) అభవ్ ప్రచురణలు, హైదరాబాద్. 2024.

3. రఘు, ఎస్. నిరంతర (ఎన్. గోపి కవిత్వం పై విమర్శ – సమీక్షా వ్యాసాలు) అధర్వ్, అభవ్ ప్రచురణలు, హైదరాబాద్ 2022.

❖ ❖ ❖ ❖ ❖

# హృదయాన్ని కదిలించే 'రెండు జ్ఞాపకాలు'

**సుప్పని సత్యనారాయణ,** తెలుగు అధ్యాపకులు, కామారెడ్డి జిల్లా. ఫోన్ : 9492626910

సూరారం శంకర్, ప్రస్తుత తెలుగు రాష్ట్రాలలోని సాహితీవేత్తలలో ఈ పేరును వినని కవులు, రచయితలు ఉండరు అంటే నమ్మశక్యం కాదు. కవిగా, రచయితగా, గీత రచయితగా, సూరారం మల్లి, గా చిత్రకారునిగా,అన్నింటిని మించి 'గజల్ కవి'గా తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్న సాహితీ ద్రష్ట సూరారం శంకర్.

తెలుగు అధ్యాపకులుగా, భాషా సాహిత్యాలకు అపారమైన సేవనందించినందుకుగాను తెలుగు విశ్వవిద్యాలయం సూరారం గారిని '2022లో కీర్తి పురస్కారం' చేత గౌరవించింది. ఇంకా ఎన్నెన్నో సాహితీ సంస్థలచే లెక్కకు మిక్కిలి పురస్కారాలు, సన్మానాలు, సత్కారాలు వాటికి కొదువలేదు.

కవితా యానంలో వారి కృషి ఫలితంగా సౌగంధిక, సౌకర్ణిక, హృదయం, మల్లిపాటలు, ఇప్పుడు ఈ "రెండు జ్ఞాపకాలు" ఇలా అమూల్యమైన కావ్యాలను వారు వెలువరించారు. ఇంకా వారి లేఖిని నుండి జాలువారి, సాహితీ ప్రపంచానికి పరిచయం కానీ కావ్యాలు 'కవిర్జాయతే, క్రౌంచపదులు..." వంటివి వరుసలో అనేకం.

సూరారం వారు వెలువరించిన కావ్యాలన్నింటిలో ప్రత్యేకమైన, పదిలమైన జ్ఞాపకాలు (కావ్యాలు) ఏవైనా ఉన్నాయంటే, అవి ఈ "రెండు జ్ఞాపకాలు" అనే చెప్పాలి. ఇది రచయిత ఎనిమిదవ రచన. రచయిత ఈ కావ్యానికి రెండు జ్ఞాపకాలు అని పేరు పెట్టడం కొంత విచిత్రమే.వారు ఈ పేరును విశ్లేషిస్తూ ఇద్దరు మహాకవులు 'డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ గారు, మరొకరు సిహెచ్ మధుగారు' ఇరువురు ఈ కావ్యానికి అందించిన అమూల్యమైన పీఠికలను రెండు జ్ఞాపకాలుగా వారు ప్రకటించుకున్నారు.అయితే నేనంటాను, రచయితలలో దాగిన ఒక కోణం కవిత్వం అయితే, మరో కోణం చిత్రలేఖనం. ఇవే "రెండు జ్ఞాపకాలు" అని. ఈ కావ్యంలో గల 72 కవితలకు 72 చిత్రాలను మనం గమనించవచ్చు. అలాగే (వారి అన్ని కావ్యాలకు, కవితలకు) రచయిత తన భావుకతను, మనఃస్థితిని అనుసరించి ప్రతి కవితను భావగర్భితమైన చిత్రం మనకు దర్శనం ఇస్తుంది. ఈ ప్రక్రియను అనుసరించడం చాలా తక్కువమంది రచయితలలో జరిగే పని.

మచ్చుకు : అలిశెట్టి ప్రభాకర్, డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మగారు.

ఇక పుస్తకంలోకి తొంగి చూస్తే, ప్రతి కవిత మనకు చెక్కిన శిల్పంలా కనిపిస్తుంది. అదుగున పదలాలిత్యం, భావ సౌందర్యం, శబ్దపటిమ, నవ్యత, శిల్పం, లలిత మనోహరమైన పదాల పొందిక, అనేక కొసమెరుపులతో కర్తవ్య బోధన చేస్తూ, రచయిత కొన్ని సందర్భాలలో అనూహ్య ప్రపంచంలోకి పాఠకుడిని తీసుకెళ్తాడు. అక్కడి విషయాలను, విశేషాలను చెప్పడమే కాదు చూపించి జ్ఞానోపదేశం చేస్తాడు. మరికొన్ని చోట్ల తానే కావన గంగలో తలమునకులిడి, ఎనలేని తన్మయత్వానికి గురవుతాడు. ఇది 'కవి' గా పేరును తొడిగించుకున్న ప్రతి వారి వల్ల అయ్యే పని కాదు. సాహిత్యాన్ని అవపోషన బట్టి, భాషాపటిమని గుర్తించి, జీవితాన్ని మదించిన సాహితీ దృష్టకు మాత్రమే సాధ్యమవుతుంది. అన్యులకు కానేరదు.

దైనందిన జీవితంలో మనిషి సంకల్పం ఎలాంటిదైనా, ఎటువంటి కార్యసాధనకు ఉపక్రమించిన, విధి అనేది ఒకటి ఉంటుంది. దాన్ని తప్పించడం ఎవరి తరం కాదు అంటూ, ఒకచోట ఇలా అంటారు,

**"ఈ దేశంలో ఒకరోజు**
**సామాన్యుడు జెండా ఎగురవేస్తాడు**
**రాజులు సెల్యూట్ చేస్తారు**
**నువ్వైనా.... నేనైనా**
**పరిణామానికి హారతులు అవుతాం!!"** (పరిణామం)

చూశారుగా ఈ కవితలు గమనిస్తే ఒకింత ఆశావాహ దృక్పథం పెరిగి, అహంభావన తలదించుకుంటుంది. అందరూ ఎప్పటికీ ఒకే విధంగా ఉండరు. ఎల్లప్పుడూ మేమే అధికారులం, మీరే మా బానిసలు అని ప్రకటించుకుని తిరిగే వెర్రి బుర్రలకు, చురక అంటించినట్టు లేదూ!?. పరిణామం ఎప్పుడు ఏ కథను ప్రదర్శించదు. దానికి రాజు,పేద అన్న భేదాలు ఏమీ ఉండవు. దాని ముందు అందరూ సమానులే.నిజ జీవితంలో మనిషి పట్టుదలతో, అకుంఠిత దీక్షతో చేసే ప్రతి పనిని ఎవరూ గుర్తించిన, గుర్తించకపోయినా, కాలం మాత్రం తప్పనిసరిగా ప్రతిఫలాన్ని ఇస్తుంది. కృషీవలుని సాధనను గురించి తెలిపే ఈ పంక్తులను ఒకసారి చూడండి..

**"మరణించి ... మరణించి**
**సరికొత్తగా జీవించి ... జీవించి**
**ఆ మొక్క ఎవరూ పూయని**
**వసంతాల్ని ఎన్నింటినో పూసింది**
**ప్రళయం వచ్చింది**
**ఉరుములు ... మెరుపులు**
**పెలపెలు ఆర్భాటాలు ... పెను గాలులు**
**విరిగిపడిన స్తంభాలు వ్రయ్యలైన నేల**
**తలెత్తుకున్న ఆ మొక్క**
**మళ్ళీ పూలు ఇచ్చి**

**విగతులైన మానవతాశ్రేణులకి**
**అంజలి ఘటించింది**
**ప్రళయం ఆగిపోయింది!!"** (కాలం మోకరిల్లింది)

ఎక్కడైతే మనిషి పతనం,అవమానం మొదలవుతాయో,అక్కడి నుండే తన దీక్ష దక్షతను ప్రారంభించాలి. అప్పుడే ప్రకృతి వైపరీత్యాలు కాదు, మానవ అఘాయిత్యాలను కూడా ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు వశం అవుతాయి. **'అలాంటి తరుణంలోనే కాలం కూడా తన పాదాల వద్ద ప్రణమిల్లుతుంది'** అనే వాస్తవాన్ని రచయిత ఈ కవితా పంక్తుల ద్వారా నిర్భయంగా ప్రకటించారు.

లోకంలో మోసాలకు కొదువే లేదు. మోసగాళ్లకు అదుపు లేదు. తేరగా వస్తే దేన్నైనా మింగేయగల భూ బకాసురులు కూడా మన మధ్యనే ఉంటారు. మంచి వాళ్ళుగా మసులుకుంటారు. అంటూ రచయిత చెప్పిన ఈ వాక్యాలను గమనించండి!

**"సృష్టి సాంద్రతను**
**అన్ని పార్శ్వాల్లో స్వాధీనపరుచుకుంటున్న**
**ఆ సేజ్ మహాకాయుల అకృత్యాలను గురించి**
**గానం చేస్తున్న...**
**జాగృతం చేస్తున్న...**
**పాపం ఆ కోకిల ప్రయాసను ఏమనగలం!!"** (నిర్వాసితం)

చూడండి! ఇక్కడ కోకిల చైతన్యానికి, నూతనత్వానికి ప్రతీక. అలాంటిది **'మనిషి నిత్యం మారుతున్నాడు మంచివాడిగానే మసులుకుంటున్నాడు'** అని ప్రకృతి ఎంత కాంక్షించినా మనుజుడు మాత్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటూ, సెజ్‌ల పేరిట, అక్రమాల పేరిట కుబేరుడు కావాలని కలలు కంటున్నాడు. ఇదీ ... నేడు నడుస్తున్న చరిత్ర.

ఈ మధ్య సాహితీ వాతావరణంలో జరుగుతున్న కొన్ని పరిణామాలను అతి సమీపము నుంచి చూసిన రచయిత, కవిత్వంలో జరుగుతున్న చౌర్యం (దోపిడీ)ను నిరసిస్తూ ఇలా అంటాడు.

**"ఎవడు చూడొచ్చాడు?**
**ఎవడు చెప్పొచ్చాడు?**
**వాక్యాలకు..వాక్యాలు**
**భావాలకు ... భావాలు**
**దోసిటపట్టి దోచుకుందాం రండి**
**అంతా వైట్ పోయెట్రీయే**
**మనకు మాత్రం బ్లాక్!!"** (బ్లాక్ పోయెట్రీ)

చూశారుగా! ఇది నేడు కవితా లోకంలో, పలు కవసమ్మేళనాలలో జరుగుతున్న వైనం. సమర్థతలేని సాహితీవేత్తలు, కుహనా మేధావులు, ఊకదంపుడు కవులు, ఇకనైనా మేలుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నాయి. కావున చౌర్యాన్ని ఇకనైనా పక్కన పెట్టవలసిన అవసరం ఉన్నది. అని చెప్పుటకు ఈ వాక్యాలు సజీవ ఉదాహరణ. సాహిత్యం పట్ల, సత్కవిత్వం పట్ల నియమ నిబద్ధతలు కలిగిన వారు సూరారం వారు. కాబట్టి అక్షరం సాక్షిగా సాహిత్యంలోని లోపాలను ఈ విధంగా ఎత్తిచూపగలిగారు.



మనిషి నిత్యం తన చుట్టూ జరుగుతున్న పరిణామాలను, అన్యాయాలను, అక్రమాలను అన్ని చూస్తూనే ఏమి పట్టనట్టుగా చేతులు ముడుచుకుని కూర్చుంటాడు. తనకున్న దానిని అనుభవించి సౌఖ్యాన్ని మాత్రమే నెమరు వేసుకుంటూ మురిసిపోతాడు. అలాంటి కొన్ని సందర్భాలను, మొద్దు నిద్రను వదలని వాళ్లను గుర్తు చేస్తూ సూరారం వారు ఇలా అంటారు.

**"ఉరకలు వేసే యవ్వనం ఉండి**
**సాధించగల సత్తువ ఉండి**
**చేతులు ముడుచుకున్న**
**వీరత్వాన్ని ఏమంటాం?**
**తనకంటూ ఒక స్వప్నం లేని**
**కదలికను ఏమంటాం?**
**నిర్లక్ష్యం నీడలో కబోది అవుతున్న**
**పుట్టుకని ఏమంటాం?!!"** (శవాలనేం చేస్తాం)

అన్నీ ఉండి,అసమర్థునిలా, చేతకాని వాడిలా ఎవరో సంపాదించి పెడితే గాని,తేరగా తినడానికి అలవాటు పడిన సోమరుల వైఖరిని,రచయిత కళ్ళకు కట్టినట్టు చూపించారు. **'నిర్లక్ష్యం నీడలో కబోది'** అన్న మాట బహుశా! అందుకే అన్నారేమో! ఇలాంటి సోమరిపోతులు నిత్యం మన చుట్టూరా కోకొల్లలుగా ఉంటారు. మన వెంటే ఉంటారు. పైగా మనం చేసే పనులను చూసి ఎగతాళి చేస్తుంటారు. ఒక మానాన పౌరుష భావన ఉండదు. అందుకే రచయిత ఈ కవితకు పెట్టిన శీర్షిక ''శవాలనేం చేయగలం?'' ఏమి చేయలేము.

రచయిత ప్రతి కవిత యందు, వారి జీవితా అనుభవం మనకు కనిపిస్తుంది. తాను దైనందిన జీవితంలో అనుభవించిన ఘటనలు, సంఘటనలు కొన్ని మధురస్మృతులుగా, మరికొన్ని సుమధుర కవితలుగా మిగిలిపోతాయి. లోకంలో కొందరు మనుషుల ప్రవర్తన చాలా వింతగా ఉంటుంది. వాళ్ళ మాట తీరు, అలవాట్లు కూడా మిగతా వారి కంటే భిన్నంగా ఉంటాయి. ఏమీ తెలియక పోయినా తెలిసినట్లుగా కొందరు నటిస్తూ ఉంటారు. అలాంటివారిని ఉద్దేశించి రచయిత ఇలా అంటారు.

**"చాన్నాళ్లుగా హృద్యమైన నీలోకి**
**సౌష్టవం తెలియని కొన్ని**
**విష కీటకాలు ప్రవేశిస్తో!**
**ఇప్పుడు నాకైనా ... నీకైనా ...**
**అవధులు దాటిన అసహన సందర్భం**
**విపత్తు శత్రువులతో అయితే ప్రశ్నేలేదు**
**అవిజ్ఞులతో ... అయోగ్యులతో**
**తస్మాత్ జాగ్రత్త!!"** (వెన్నెల గాయపడ్డప్పుడు)

చూశారుగా! ఆపదలు, సంకటాలు శత్రువులతో అయితే అస్త్రాల ద్వారా, ఆయుధాల ద్వారా ఎదురుకోవచ్చు. మరి అవిజ్ఞులతో ... అయోగ్యులతో ఆపదలు వస్తే, వారితో తలపడవలసి వస్తే అది మన మూర్ఖత్వానికి సంకేతం అవుతుంది. అందుకే తస్మాత్ జాగ్రత్త. అని గట్టిగా హెచ్చరిస్తున్నారు.

రచయిత ఒక ప్రేయసి కోసం ప్రియుడు పడే ఆవేదన ఎలా ఉంటుందో, ఆ ఎడబాటును స్వప్నంలో కూడా భరించలేని వైనాన్ని రచయిత అత్యంత మనోహరంగా చిత్రించిన తీరును ఒకసారి చూడవలసిందే.

**"నీ చూపుల తీక్షణలో**
**కరిగి మళ్లీ జీవించి**
**నన్ను నేను మోక్షం పొందాలని**
**మూర్ఛనలు పోతూ ఉంటాను**
**ఆకాశం మీంచి**
**రాత్రి కురిసిన తారకలతో**
**నా నివేదన పొట్లం చేసి**
**నీ అన్వేషణకై బ్రతిమాలి బ్రతిమాలి**
**మళ్ళీ అనంతంలోకి విసిరేస్తుంటాను!!".** (నిరీక్షణ)

తన నిచ్చెలి చూపులలో కరిగిపోవుట, ఎన్నిసార్లు అయినా తనని తాను మళ్ళీ జీవించడానికేనని, తన యొక్క ప్రేమను ప్రకట పరుస్తాడు రచయిత. ఈ కవితా నాయకుని ద్వారా, రచయిత ప్రేమను, తనపై ఉన్న వ్యామోహాన్ని పలు విధాలుగా ప్రకటించినప్పటికీ, తననే సర్వస్వంగా, తానే లోకంగా భావించి, "తనే నేను" అన్న ఒక గొప్ప అభివ్యక్తిని ప్రకటపరుస్తారు.

కవి మనసు, ప్రకృతి మనసు రెండూ ఒకటే. ఎప్పుడు నిష్కల్మషంగా, నిర్మలంగా, అయాచితంగా వాటి సహజ స్వభావాలను వీడకుండా, ఎప్పుడు ముందుకు వెళుతూనే ఉంటాయి. సూరారం వారు ఇంతకుముందు ఒకచోట వసంతం గురించి వ్యాఖ్యానించినట్టు ఎరుక. ఇప్పుడు మనిషి తనకు ఆనవాళ్లను గురించి చెబుతున్నారు. **'లోకంలో మనుషులు కరువయ్యారు, మానవత్వం అడుగంటి పోతున్నది'** అన్న వ్యాఖ్యలను తిప్పికొడుతూ, ఎక్కడో ఒకచోట మానవతా ఛాయలు లేకపోతే, సమాజం ఇంత నిర్మలంగా ఉండదని, ఒక ఆశావాహ దృక్పథాన్ని వ్యక్త పరుస్తారు. ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తారు.

**"కంప్యూటర్ యుగమైనా**
**ఇంకా మనసును పోగొట్టుకొని**
**ఓ మనిషీ! నీకోసం**
**ఇంకా శిథిలం కాని**
**ఒక కావ్యాన్నిస్తా**
**గానం చేస్తావా?!!"**

మనిషి ఇంకా ఎక్కడికి పోలేదు తన ఉనికి ఎక్కడో ఒకచోట భద్రంగా ఉన్నందువలననే బంధాను బంధాలు ఇంత బలంగా ఉన్నాయని చెబుతూ శిథిలం కాని ఒక కావ్యాన్ని తనకిచ్చి గానం చేయమని అభ్యర్థిస్తున్నాడు. అంతేకాదండోయ్! ఇక్కడ మరోమాట, కావ్యాలు ఇంకా వసివాడకుండా, సజీవంగా ఉన్నాయి అనే సత్యాన్ని కూడా మనం గ్రహించవలసి ఉన్నది. ఇది నిజంగా గొప్పనైన భావన. ఇలాంటి అభివ్యక్తి చేయాలన్నప్పుడు ఒక రచయితకు సమాజాధ్యయనం చాలా అవసరం. అది పుష్కలంగా సంపాదించు కున్నవారు సూరారం వారు.

ఈ విధంగా వరుసక్రమాన్ని గమనిస్తే సూర్యునికి దివిటీ పట్టినట్టు అవుతుంది. ఒకటేమిటి **"మృత్యువెప్పుడూ పరాజితే, మంత్రసిరి, చివరి కవిత, తాంత్రికం, సంప్రశ్నం, అమ్మ జ్ఞాపకం...,** వంటి అనేక కవితలను మనం నిత్యం గుర్తుంచుకోవాల్సిందే.అందులోని అంతరార్థాన్ని మననం చేయవలసిందే.

**"నిండుగా రస హృదయుల మదిలో నిత్యం పండుగగా వెలుగొంది, ఈ 'రెండు జ్ఞాపకాలు' పాఠకుల మనసులో చిరస్థాయిగా సుస్థిర స్థానాన్ని సంపాదించుకుంటుంది"** అనడంలో ఎంతమాత్రమూ సంశయం లేదు. అందునా ఉత్తమశ్రేణిలో ఉండదగిన పుస్తకాలలో ఈ రెండు జ్ఞాపకాలు కూడా ఒకటి. మునుముందు వారి లేఖిని మరెన్నో ఈ కోవకు చెందిన కావ్యాలను వెలువరించేలా, వారి కుంచె మరెన్నో సచిత్రాలకు జీవం పోసేలా ఉండాలని, ఆ బాసరంబ రచయితకు శక్తియుక్తులను ప్రసాదించి వారికి శత వసంతాలు ఆయురారోగ్యాలతో కలం కుంచె నిరాఘాటంగా ముందుకు సాగాలని కోరుతూ, అభివందనములను అందజేద్దాం.

# స్త్రీ జీవన సమరానికి తార్కాణం – వెండిమేఘం

డా. ఎం. ఫామిద బేగం, అసోసియేట్ ప్రొఫెసర్, సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల, కర్నూలు. ఫోన్ : 95500 83202

**"వెండి మేఘం"** – అసాధారణ స్త్రీమూర్తి కథ, ముస్లిం జీవన విధానంలో స్త్రీ పాత్ర ప్రాధాన్యతను, పండుగలు, పబ్బాలు వ్యవహారాలను వివరంగా తెలియచేసిన తొలి తెలుగు నవల. సమాజ అభ్యుదయానికి కృషి చేసే ఒక చైతన్యాత్మకమైన నవల మహిళా అభ్యుదయాన్ని, వికసింపచేసే ఆదర్శాత్మక నవల. 'వెండి మేఘం'లో నాయిక పేరు 'అన్వర్'. అన్వర్ అంటే ఉర్దూలో అందం, అన్వర్ అంటే మంచి స్వభావం, అన్వర్ అంటే అణుకువ, అన్వర్ అంటే పైనాటి అన్నింటి సమన్వయం. అందుకే 'వెండి మేఘం' అన్నపేరు 'అన్వర్' లో స్థారకము అన్వర్థము. వెండి స్వచ్ఛతకు పరీక్ష చిహ్నమైతే 'మేఘం' మయూరానికి నాట్యప్రేరకం. సాధక హృదయ మయూరానికి సరికొత్త భంగిమల్లో అనుభూతిని మిగిలిస్తుంది. అసలు సలీం వ్రాసిన కవితలు గాని, కథానికలుగాని, నవలలుగాని శీర్షికలన్నీ అన్వర్థాలే విచిత్రాలే. ఊహాలు రేపేవే. ఒక్కసారి ఆగి వాటిని అర్థం చేసుకోటానికి పెద్ద మనస్సు కావాలి.

సాధారణ కుటుంబంలో పుట్టి, అడుగడుగునా అవమానాలు, అవరోధాలు ఎదురైనా అన్నింటినీ అధిగమించి అసాధారణ మహిళగా, స్వయంసిద్ధిగా ఎదుగుతుంది. మూర్తీభవించిన వ్యక్తిత్వంలో స్ఫూర్తిదాయకమైన అన్వర్ పాత్ర చిత్రణ అద్వితీయం.

చదువులేని ఓ స్త్రీ ఎంత ఆత్మ విశ్వాసంతో బతుకుతుందో రచయిత సలీం చూపించిన తీరు చూస్తే ప్రతి స్త్రీకి ఆత్మవిశ్వాసం ఎంత ముఖ్యమో గుర్తుచేస్తుంది. ఈ నవలలో ఆత్మస్థైర్యం కలిగిన ఒక మహిళా పాత్రను 'అన్వర్' అనే పేరుతో పరిచయం చేస్తున్నారు. (అన్వర్ పదకొండేళ్ల అందమైన అమ్మాయి. అక్క కొడుకు బారసాలకు చినగంజాం నుండి త్రొవ గుంటకు వస్తుంది. దిగువ మధ్య తరగతి) స్త్రీ పురుషుల వివాహబంధంలో వయోభేదం తెచ్చి పెట్టిన సమస్యలను రచయిత చాలా చక్కగా చిత్రించారు.

తల్లి కాకుండానే అక్క సలీమున్ కొడుకు 'రఫీ' కి తల్లిగ మారిన అన్వర్ మాతృప్రేమ అమాయకత్వంలోని అమలిన ప్రేమ గుండెల్ని తాకుతుంది. 'రఫీ' తండ్రి భాషా అనే విషనాగు ఛాయతో క్రక్కిన విద్వేషంలో నలగిన 'అన్వర్' – తన రక్తం పంచుకొని పుట్టిన 'జలానీ' భవిష్యత్తులో చూసుకుంటుంది.

వెండిమేఘం సమాజ అభ్యుదయానికి, కృషి చేసే ఒక చైతన్యాత్మకమైన నవల. ఎందుకంటే సలీంగారు అన్వర్ అనే పాత్ర ద్వారా పల్లెటూళ్ళ ఆర్థిక, సామాజిక పరిస్థితులను మన కళ్లముందు రాని, నిరక్షరాస్యతతో యుద్ధం చేసి తన జీవితానుభవాలతో ఒక ముస్లిం స్త్రీ ఎదుర్కొన్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సమస్యలను




పరిచయం చేస్తూ, వాటిని అధిగమించడానికి ఆమె చేసిన జీవన సమరాన్ని ఎంతో విశ్లేషణాత్మకంగా వివరించడం ఈ నవల యొక్క విశిష్టత.

నవలలోని అణువణువూ స్త్రీలపై చూపే వివక్షతను మరియు వారి జీవితాలను మగవారికి బానిసలుగా భావించే కొందరి మగవారి అనాగరిక ఆలోచనలను ఖండిస్తూనే వచ్చింది. అన్వర్ మరియు ఇతర పాత్రల ద్వారా. ఒకవైపు సమాజంలో పేరుకుపోయిన అనాగరిక ఆలోచనలను ఎత్తి చూపుతూ, మరొకవైపు వాటిని అధిగమించడానికి (అన్వర్).

ఆమె చేసిన సమాజ చైతన్య సంఘర్షణనూ ఎంతో వివరణాత్మకంగా తెలియజేశారు సలీంగారు. ఇంకొక వైపు ముస్లింల జీవన విధానాన్ని, ఆచార వ్యవహారాల్ని – కటిక దారిద్ర్యంతో పాటు అవమానాలతో పరాయాకరణకూ బలౌతున్న దూదేకుల వారి దయనీయ స్థితిని సమగ్రంగా చర్చించారు.

నవల ప్రారంభం నుంచి మొదలు ముగింపు వరకు ఎక్కడా సహజత్వాన్ని కోల్పోకుండా, ముస్లిం యాసను అక్కడక్కడా పరిచయం చేస్తూ, వారి సంస్కృతిని, జీవన విధానాన్ని వివరిస్తూ, ప్రస్తుతం భరతావని ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలను నొక్కి చెప్తూ, ఈ అజ్ఞాన, అంధకారాన్ని విజ్ఞానపు వెలుగులతోనే అంతం చేయగలవని తెలియజేసిన సామాజిక నవల వెండిమేఘం.

మన సరిహద్దులను పరిరక్షించడానికి సైనికులు తుపాకీల ద్వారా శత్రువులను మట్టికురిపిస్తారు. అయితే వెండిమేఘం నవల ద్వారా, సలీంగారు కలం అనే తుపాకీతో దేశంలో పేరుకుపోయిన స్త్రీ పక్షపాత భావనలను, మతోన్మాద శక్తులను, కామంతో వెర్రెక్కిన మానవ

మృగాలను మట్టి కరిపించే ప్రయత్నం చేసారు. తనదైన భాషతో సమాజ పరిరక్షణకు, సమైక్యతకు, స్త్రీ ఆత్మాభిమానాన్ని పెంచుటకు వెండిమేఘం ఒక చైతన్య మాధ్యమంగా ఉండాలని ఆలోచించిన మానవతావాది సలీంగారు.

**"విజ్ఞానంతోనే వికసించు జగత్తు**

**పసిపిల్లల చదువే దానికి విత్తు"** అనే భావనతో చదువు యొక్క ప్రాధాన్యతను తెలియజేయడమే కాకుండా అన్వర్ పాత్ర ద్వారా ముస్లిం, మైనారిటీ సముదాయాలలో కూడా విద్యను వ్యాప్తి చేసి వారి జీవితాలను ఉజ్వలమైనవిగా మరియు దేశాన్ని సర్వముఖాభివృద్ధి చెందించాలనే బలమైన సంకల్పంతో రాయబడిన నవల వెండిమేఘం.

వెండిమేఘం నవలతో విద్యకు ఎంత ప్రాధాన్యమిచ్చారో కుల్సుంబీ మరియు అన్వర్ పాత్రల ద్వారా తెలియజేశారు. మన ముస్లిం పేటలో రఫి బడికెళ్ళిన మొదటి కుర్రాడైనట్లే నా మనవరాలు మొట్టమొదటి ఉద్యోగస్థురాలైన ముస్లిం యువతి కావాలి. ఈ విధమైన అభ్యుదయ భావంతో కూడిన సంభాషణలు నవల మొత్తం నిండి ఉన్నాయి అంటే అతిశయోక్తికాదు. కుల్సుంబీ మాటల్లో స్త్రీలని చెప్పకింద చీమల్లా తొక్కిపెడ్తున్న మగజాతిమీద కొంచెం కసి నిండివుంది. ఇలా స్త్రీ విద్యను ప్రోత్సహించాలనే నైతిక ఆలోచనలతో నవలలోని ప్రతి అక్షరం స్త్రీ సమానతకోసం, వారి అభివృద్ధి కోసం, ముస్లిం, మైనారిటీల ఉజ్వల భవితకోసం గర్జిస్తుంది.

పెళ్ళంటే ఏమిటో తెలీని పదేళ్ళ వయసులో – తన కంటే పాతికేళ్ళు పెద్దయిన వ్యక్తికి రెండో భార్యగా – అతని కొడుక్కి తల్లిగా వచ్చిన "అన్వర్" – స్త్రీలు ఆత్మగౌరవం, స్వంత వ్యక్తిత్వం కలిగి ఉండాలంటే జీవితమంతా పోరాడటం మినహా మరో దారిలేదన్న నిర్ణయానికి రావటానికి దారితీసిన పరిస్థితులను మన కళ్ళముందుంచారు. పవిత్రత ఉన్నచోట నిర్భయత, నిర్భయత ఉన్నచోట స్వతంత్రత తప్పకుండా ఉంటాయని నమ్మిన ఆమె జీవితంలో జరిగిన అనూహ్యమైన సంఘటనల సమాహారం వెండిమేఘం.

వెండిమేఘం నైతిక విలువలు, మానవ సంబంధాలను కుటుంబ వ్యవస్థను బలపరిచే నవల పరుగులు పెడుతున్న సమాజంలో మనిషికి, మనిషి విలువ తెలియడం లేదు, ఆత్మీయ అనురాగాలు కరువయ్యాయి. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమౌతున్నాయి. మనిషి విలువలను, ఆత్మాభిమానాన్ని డబ్బు వ్యామోహంలో పడి మరిచి పోతున్నాడు. అమ్మప్రేమ కమ్మదనానికి దూరమయ్యాడు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని మన మూలాలలను, నైతిక విలువలను, మానవ సంబంధాలను మరిచిపోతే సమాజంలో మనిషి మనుగడ ప్రమాదంలో పడిపోతుందని హెచ్చరించారు సలీంగారు.

ఆత్మాభిమానంతో తమకుటుంబాన్ని బాగుపరుచుకోవాలనే ఆలోచనతో ఆమె పొగాకు కంపెనీలో పనికి వెళ్తే అక్కడ ఆమెకు ఎదురైన కొన్ని అసభ్యకర సంఘటనలు వాటిని ప్రతిఘటించడానికి చేసిన ప్రయత్నాలు ఈ విధంగా ఆలోచించుకుంటూ వెళితే సమాజంలోని అణువణువునూ స్పృశించి రాసినదే వెండిమేఘం అనిపిస్తుంది.

భారతదేశం వైవిధ్యభరితదేశం ఈ దేశంలో అనేక రకాల భాషలు, ధర్మాలు, ఆచార – వ్యవహారాలు ఉంటాయి. ఎన్నో రాజవంశాలు ఈ దేశాన్ని పరిపాలించాయి. అందుకే ఇక్కడ మిశ్రమ సంస్కృతి ఏర్పడింది. కాబట్టి జరిగిన గతాన్ని మరిచిపోయి సామరస్యంగా, సోదర భావంతో దేశాన్ని ప్రగతి పథకంలో పరుగెత్తించాలని, అభివృద్ధి భావనను తెలియజేసిన నవల వెండిమేఘం.

ఈ విధంగా వెండిమేఘం నవలలో ప్రతీ పదం సామాజిక, సాంస్కృతిక, సామరస్య వికాసాన్ని కోరుకుంటాయి. ముస్లిం, దూదేకుల వారి జీవన విధానాన్ని తెలియజేస్తాయి. అజ్ఞానం, నిరక్షరాస్యత, ఆర్థిక వెనుకబాటు వీటన్నింటిని రూపుమాపడానికి విద్యే ఆయుధం అని గుర్తుచేస్తాయి. స్త్రీ అబల కాదు సబల అని, ప్రతి ప్రతికూల పరిస్థితిని ఎదిరించి జీవితంలో ఎదగగలరని గర్జిస్తాయి. యువ నవ భారతాన్ని నిర్మించడానికి సహకరిస్తాయి. అందుకే సామాజిక చైతన్యానికి మతసామరస్యానికి, స్త్రీ జీవన సమరానికి తార్కాణం ఈ వెండిమేఘం.

'వెండిమేఘం' చదువుతున్నంత కాలం ఓ 50, 60 సంవత్సరాల భారతదేశ చరిత్రను చదువుతున్న అనుభవం కలుగుతుంది హిందూ, ముస్లిం సమైక్యరాగం ఎలా పల్లవిస్తుందో హైదరాబాద్ కర్ఫ్యూ రోజుల్లో అన్వర్ అనుభవంలో మేళవించి చెప్పటం ఓ సజీవచిత్రాన్ని, నోరు అప్పగించి చూడటం ఔతుంది. ముస్లిం అంటే హిందూ వ్యతిరేకి అని వారిద్దరికి నడుమ పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందని సామాన్యుల ధోరణి, కాని సలీం– 'మతం' కంటే మానవత్వం ఎలా గొప్పదో నిరూపించి నిప్పులాంటి సత్యాన్ని ఆవిష్కరించాడు. ముస్లింల జీహాద్ మత యుద్ధమనే భ్రమ – ఈ నవల చదివిన తరువాత తొలగి పోతుందని దాని అధ్యాత్మిక అంతరార్థంలోని హృదయం అర్థమయ్యేలా వివరించిన సలీం – నిజంగా ఓ సంస్కరణవాది, సిసలైన భారతీయుడు, మనిషిలోని చెడుమీద, మనసులోని దురాలోచన మీద చేసే యుద్ధమని – అది స్వార్థపరుల స్వార్థంతో విపరీతార్థాన్ని వికృతార్థానికి దారి తీసిందని తెలిసికొని ఆశ్చర్య పోవడం మనవంతు.

సలీం నవల ఒక అద్భుతం ఒక ఆదర్శం, శైలి సంస్కారవంత మైంది. నవలలో అనేక పాత్రలున్నాయి. అనేక సంఘటనలున్నాయి. అవి మనల్ని కదిలిస్తాయి. ఆలోచింపజేస్తాయి. ఆత్మ విశ్వాసాన్ని కలిగిస్తాయి. తప్పకుండా ప్రతి ఒక్కరూ చదవాల్సిన నవల – వెండి మేఘం.

**ఆధార గ్రంథాలు :**

1. వెండిమేఘం – సయ్యద్ సలీం
2. వెండిమేఘం – సమీక్ష వ్యాసాలు

# మనదారి “మళ్ళీ మనిషి లోకి ...” అంటున్న ఉదారి

**మడిపల్లి రాజ్‌కుమార్,** ఫోన్ : 994 96 99 215






కవులు ఎంత అంతర్జాతీయ కవిత్వజెండాలు ఎగరేసినా ఆ జెండాలు తొడిగిన కర్రలు తమనేలవే నన్నది మరువరు. స్థానిక స్పృహను కోల్పోరు. అందుకు కారణం వాళ్లు పట్టుకున్న జెండాలు విభేదించినా కర్రలు ఒకటన్న తీరు వాళ్ల ప్రాంతాల పేరిట, జిల్లాల పేరిట తామంతా ఒకగొడుగు కిందికి చేరుతారు. ఖమ్మం జిల్లా కవులు, మంజీర రచయితలు, పాలమూరు జిల్లా సాహిత్యం, కరీంనగరు ఎన్నీల ముచ్చట్లు ఈ విధంగా ఇవన్నీ తమ సృజనకు, అక్కడ కొత్తగా సాహిత్య బీజావ్యాపనానికి భూమికగా భావిస్తారు.

పూర్వ ఆదిలాబాదు జిల్లాలో ఇలాంటి చైతన్యం మిగతా తెలంగాణాలో మాదిరే ఉన్నా, ఎందుకనో పరివ్యాప్తం అంతగా కాలేదన్నది నిజం. ఇక్కడి నైసర్గిక స్థితి అడివి దాటని ఎల్లడిలా, లోలోన రగిలే బొగ్గులా ఇక్కడి సాహిత్యపు వెలుగులు దూరాలకు ప్రసారమైనది తక్కువ. వాటినీ బయటి సమాజం గుర్తించడం లోను ఆలస్యం జరిగింది అన్నది వాస్తవం.

ఇక్కడి సృజనకారులు కొందరు తమ రచనల ద్వార ఎంతో పేరు గడించి పూర్వ జిల్లాకు సాహిత్యరంగాన గుర్తింపు తెచ్చారు.

మాట – ముచ్చటకు సదాశివ సార్, పాటకు గూడ అంజయ్య, నవల కథలకు అల్లం రాజయ్య, సాహిత్య సేవారంగాన మడిపల్లి భద్రయ్య జిల్లా ముఖచిత్రాలుగా వర్తమాన తెలుగు సాహిత్య రంగంలో ముందువరుసలో నిలిచారు. తన “యాది” వల్ల తప్ప సదాశివ సార్ తెలుగు సమాజానికి యాదికి రాలె. “ఊరు మనదిరా..” అని వివాదంతో అడివినొదిలితె తప్ప గూడ అంజన్న గుర్తుకురాలె.

ప్రస్తుత ఆదిలాబాదు జిల్లాలో వచనకవిగా ముందుగా గుర్తుకొచ్చే కవి డా. ఉదారి నారాయణ. ఆయన ఒకవైపు సాహిత్య వ్యవసాయం సాగిస్తూనే జిల్లా యువకవులకు మార్గదర్శనం చేస్తున్నారు. ప్రతియేడు తన సోదరులతో కలిసి తండ్రి అచలయోగి ఉదారి నాగదాసు స్మారక కవిత్వ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గుర్తించాలని చేసేవి కావు కాని, అది కరువైన లోటుమాత్రం కనిపిస్తున్నది.

– – –

“మళ్లీ మనిషిలోకి..” నారాయణ నాలుగో కవితాసంపుటి. ఆకుపచ్చని ఎడారి, యాల్లైంది, మాగిపొద్దు పూర్వ సంపుటాలు. ‘అరుగుమీది ముచ్చట్లు’ లఘు నాటికల సంపుటి, ‘ఆదిలాబాద్ జిల్లా సాహిత్య చరిత్ర’ వీరి ఇతర రచనలు. ఎల్లడి, ఇప్పగాలి ఆదిలాబాదు కవితా సంకలనాలకు సంపాదకునిగా వ్యవహరించారు.

తొలి సంపుటి “ఆకుపచ్చని ఎడారి”గా ఆదిలాబాదు దగాపడ్డ ముఖచిత్రాన్ని విరోధాభాసం చేసి చూపించాడు. తరువాత “యాల్లైంది” అని తెలంగాణా రాష్ట్రసాధనకై ఉద్యమ కోడై కూశాడు. “మాగిపొద్దు” ఆదిలాబాదు ప్రకృతిని అద్దంలో చూపిన కృతి.

ఇక ఇప్పటి సంపుటి పేరులోనే ఇన్నాళ్లు మనిషి కాకుండా పోయినామనే మాట ధ్వనిస్తున్నది. కరోనా కాలం కలిగించిన కనువిప్పు వల్లనైనా మనిషి తానేంటో తెలుసుకోవాలని, ఇక మళ్లీ మనిషిలోకి ప్రవేశించాలనే ఉద్బోధ అంతర్వాహినిగా ఉదారి కవిత్వంలో ప్రవహిస్తున్నది.

ఉదారిది స్వచ్ఛమైన సగటు ఆదిలాబాదీ వ్యక్తిత్వం. అది నిలువెత్తు మోతుకు చెట్టుతనం. తన కవిత “అదిలాబాదు నిషాని”నే.

**“నిలువెల్లా పచ్చదనంతో**
**ఆకుల చేతులు చాపి**
**చూపుల దారులు వేస్తుంది**
**నీడకొంగును పరుస్తుంది**

**అడవంతా చెమటలు కక్కుతూ**
**చెలిమెల కడుపులు చూస్తుంటే**
**పచ్చని నీడను పదిమందికి పంచుతుంది”**

**అంతేకాదు**
**అది ఆయుర్వేద వైద్యశాల**
**పోరాటాల ఎర్రెర్రటి నినాదాలు**
**పండుగలకు, చుట్టరికాలకు**
**కొత్తపెండ్లి ప్రేమలకు విస్తారాకు మర్యాద**

శిశిరపు మోడువారిన అడవిలో ఆశల ఎర్రదనం మోదుగు పూలు (flame of the fores) కదా. అదే ధ్వనిస్తున్నాడు కవి.

ఉదారి కవిత్వతత్వం తన కవిత ‘నీరెండ’ వంటిదే

**"వెంటబడి వేటాడిన**
**చలినుంచి సేదను పంచే**
**అవసర కుటీరం**
**పిల్లా, పెద్దా, పశువు, పక్షీ.. అన్ని పాత్రల రంగస్థలం"** అతని కవిత్వం.

'కాలనీ' కవితలో వలసజీవుల వింతపోకడల బతుకులను ఉతికి ఆరేశాడు కవి.

**"మావాడు చైతన్యలో ఫస్ట్**
**మావాడు నారాయణలో టాప్**
**మొబైళ్లు నిద్రపోకుండా టైంలెస్ కబుర్లు**
**ఇక్కడి మెట్ల కింద కీచురాళ్లు కూడా**
**కార్పొరేట్ పాటనే పాడుతాయి**
**గోరంత ఫలితానికి కొండంత**
**కరెన్సీ ఎరువును చదువుల పొలాల్లో వెదజల్లే**
**చదరంగ రణభూమి ఇది"**

కాలనీ స్వభావాన్ని "బయట స్వదేశం లోన పరద్వేషం" అంటూ ఒక్క వాక్యంలో తేల్చేశాడు.

చక్కటి రూపక సమాసాలు,"దొంగచేతికి తాళంచెవి" అన్న సామెత వాడి "ఊరివైపు ఒకసారి" కవితలో ఊరు బతుకుచిత్రానికి అద్దంకట్టి చూపాడు కవి.

**"ఊరుకెళ్దామంటే**
**'సారావాగు' దాటుడు కష్టమున్నది"**
**"పూలపునాదుల'పై**
**భవనాలు బతకనట్లు**
**అబద్ధాల హామీలపై**
**ఆశల ప్రాణాలు నిలువలేవు**

**ఎవడు మనోడు ఎవడు పరాయోడు**
**ఎవరి నెత్తురు ఎవరి త్యాగం**
**తాళంచెవులు చేతుకిచ్చి**
**ఇంటిముందు ఏడుస్తున్న వైనం"**

**"మాట్లాడరు మాట కిందపడనీయరు**
**నిసర్గజీవులు నిజంలాంటి వాళ్లు"** అంటూ అడవిబిడ్డలను పరిచయం చేసిన కవిత 'ఉనికి'లో కవి ఉదారి

**"మొక్కైనా మనిషైనా**
**ఎన్ని ఆయాసాల మధ్య**
**అంతెత్తు ఎగబాకేది!**
**తల్లితనం తెలియనోళ్లకు**
**తల్లియాస పలకరానోళ్లకు ఏమర్థమౌతుంది?!"** అంటూ అడవిని కొల్లగొడుతున్న నాగరికసమాజాన్ని ప్రశ్నించాడు.

భ్రష్టుపట్టిన రాజకీయ నాయకుల వైఖరిని, దూషణలే భూషణాలైన తీరును 'బేషరం' కవితలో –

**"వాళ్ల వ్యాకరణమంతా ఒక్కటే**
**వాళ్ల మాటలకు కాకులు కక్కుకుంటున్నాయి"** అంటూ కవి ఎండగట్టాడు.

మహిళాశ్రామికులను 'జీవధారలు' అంటూ రూపుగట్టిన కవితలో పోతన భాగవతంలోని వామనావతార ఘట్టంలోని 'రవిబింబం బుపమింప..' పద్యం గుర్తుకొచ్చేలా..

**"వాళ్ల నడకల పరుగులకు**
**గూట్లోకెళ్తున్న సూర్యుడు కొంచెం ఆగి**
**ఓ ఇంతి సిగలో ముద్దబంతైందు**
**ఓ శ్రామికకు గుండ్రని ముక్కుపుడకైందు**
**శ్రమైక జీవుల మొఖాలకు కుంకుమ బొట్టయ్యిండు.."** అంటూ కవి ఉదారి నారాయణ వర్ణించాడు.

ఈ సంపుటిలో కరోనా విధ్వంసాన్ని గురించిన కవితలే పదిదాకా ఉన్నాయి. కరోనా వైరస్ మనిషిని అతలాకుతలం చేసినా, ప్రకృతికి, ఇతర జీవరాశికి ఒకింత మేలు చేసిందనే చెప్పవచ్చు.

**"మనిషిలేని ప్రకృతి ఎంత ప్రశాంతం**
**పక్షిలేని జీవితం ఎంత వినాశకరం"**
**.....**
**"సడకులన్నీ పట్టపగలు గుర్లు గొడుతున్నాయి**
**చెట్లనీ పిట్టలతోటి ముషాయిరా వెడ్తున్నాయి"** – అని కవి ఈ కవితల్లో ప్రకృతి వైపుగా నిలుచుని ఆశావహంగా రాశాడు.

ఈ సందర్భంలో –

**"ప్రపంచమంతా చివరి గడియల్ని తడుముకుంటుంటే**
**శవముందు కల్యాణరాగం తీయలేను**
**మృత్యువును సుందరీ! అని సంబోధించలేను"** అంటూ కవి నారాయణ బాధతప్తుడై కూడా రాశాడు.

ఇదే సందర్భాన 'ప్రయివేటు టీచరు' అంటూ రాసిన కవిత కరోనా వల్ల ప్రయివేటు టీచర్ల బతుకులు ఎంత ఆగమై పోయాయో తెలిపింది.

**"వజ్రాలు చెక్కిన నకాషీలు**
**వంకాయలమ్ముకునే కాలం వచ్చింది**
**అమెరికా గ్రీన్ కార్డు మీద అతని చెమట ముద్రలే**
**ఈగల్ పక్షి రెక్కల కింద అతని జామెట్రీ రేఖలే**
**అతని దుఃఖపు చూపులకు నా మొఖం ఎక్కడ పెట్టుకోవాలని?**
**ఈ వ్యవస్థను నడిపించే శక్తుల గల్లా ఎవరు పట్టాలని?"** అంటూ

కవి నారాయణ యాజమాన్యాల సుఖాలకు అంకితమైన వారి నయావెట్టిచాకిరీని గురించి ప్రశ్నించాడు.

'మూరెడు జాగకోసం' – కవితలో కవి ఛత్రీలు బాగుచేసే రహీమ్, షరీఫ్‌ల గొంతుకై పలికాడు.

**"గీ మూరెడు జాగనే పొయ్యింటి పెద్దది**
**గీ మూరెడు జాగనే వంటయిల్లుకు మసాలా ఘాటుపూస్తది**
**గీ మోరిమీది సల్పనే**
**నా చోటా మోటా బేటీలకు**
**అన్నం ముద్దయితది**
**..........**
**నన్ను గీన్నుంచి గెదుమకుండ్లి"** అంటూ తన బతుకు దీనస్థితిని గురించి చెబుతూ, తన పౌరసత్వాన్ని ప్రశ్నిస్తున్న వాళ్లకు తను ఎక్కడోన్నో కాదని ఎరుకజేశాడు.

వృద్ధప్రభుత్వ ఉద్యోగుల పనికష్టాలను – దేశానికి బరువైన నిరుద్యోగ యువత లక్షలాది టన్నుల ఉడుకు నెత్తురును ఎరుకచేస్తూ రాసిన 'స్వర్ణయుగం' లో కవి ఉదారి.

**"కొలువు కెల్లాల్సిన కొడుకు ముందరే**
**ఆనెకాళ్లు మాగురుకండ్లు**
**గోద్రేజ్ విగ్గులేసుకుని కచేరు కెల్తుంటే**
**పెండ్లీడు పిల్లలు కండ్లముందరే**
**ఉరిచావులై వేలాడుతున్న.."** దృశ్యాలను మనకళ్లకు కట్టేలా చూపాడు.

ఈ సంపుటిలో కవి నారాయణ ఎస్పీ బాలును, సినారెను, స్టాన్ స్వామిని, ఉ.సాంబశివరావును, తన తండ్రిని తలచుకుని కవితలు రాశాడు.

తండ్రిని 'పెద్ద దర్వాజ' గా భావిస్తూ ఆ శీర్షికతో రాసిన కవితలో

**"పటేండ్ల గద్దింపు చూపులకు**
**నోట్లో బుక్క బెదిరి**
**కిందపడని దినంలేదు**
**కాళ్లకు అందని బొంతసైతం**
**నీ కష్టం చూసి కుమిలి పోయేది"** అంటూ రాస్తూ కంటతడి పెట్టించాడు.

**"ఒక్కొక్క విషయాన్ని**
**గుండె గోడలపై చెక్కే శిల్పి అతడు**
**ఇపుడు అందరి హృదయాలలో**
**చెక్కని శిల్పమయ్యాడు"** అంటూ కవి నారాయణ ఉ. సాంబశివ రావును గురించిన ఎలిజీ రాశాడు.

'మిత్తికాలం' కవిత కరోనా కాలపు ఫోను సంభాషణ. చివరలో మిత్రుణ్ణి రావద్దని చెబుతూ..



**"ఇగ గింత తెలిసినాంక ఫోను కలిపిందు గదాని**
**మాటలెంబడే మా ఇంటికచ్చేవ్**
**మా పెరట్లనే బొగ్గు నమిలేవ్**
**బూమిని దెచ్చి ముక్కుకు రాసినా**
**గేటు తియ్యనంటె తియ్య!"**

'నేలకు ముక్కు రాసుడు' అన్న నానుడిని మలిచి చెప్పిన తీరు ఎంత హృద్యంగా ఉందో గమనించండి.

స్టాన్ స్వామిని గురించిన 'అతను మనిషి' లో

**– "ఎవరో తలవెనుక రెండు చేతులుపెట్టి**
**నన్ను వెదురుబద్దలా వంపుతున్నట్టు"**
**"గుంజిపట్టిన బాణాలు**
**నా గుండెనుంచే దూసుకెళ్తున్నట్టు"** ఈ వాక్యాలలోని అభివ్యక్తి నైపుణ్యమూ ఆకట్టుకుంటుంది.

ఊరుబావి, పెత్రమాస, అనేకాలుగా నేను, నేలదిగిన నెలవంకలు ఇలా ఇంకా ఎన్నో ఒకదాన్నెత్తుకుంటే ఇంకోటి ముందుకొచ్చే వంకపెట్టరాని కవితలిందులో ఉన్నాయి.

ఈ సంపుటిని కవి ఉదారి నారాయణ అగడగడు, అర్థమిచ్చుడు, మాగురు, పరంపప్పు, బొండజొండ్లు, నెరివడుడు, దయతీసుకునుడు, ఐత్వారం వంటి ఆదిలాబాదు మాండలికాలు, యాస మాటలతోనే కాదు, అక్కడి తెలుగుతో మమేకమై పోయిన ముజోరు, కమీజు, ఇంతఖాల్, దకల్ బండి, దురస్తు వంటి ఉర్దూ మాటలనూ వాడి జీవద్వంతం చేశాడు.

**"నేను రోజూ అన్నం తినే బతుకుతున్నాను**
**అన్నం మాత్రమే తిని బతుకుతున్నాను**
**అందుకే నేను అతనికే మద్దతిస్తాను**
**దేనికైనా అతనివైపే నిలబడతాను**
**నేను మనిషిని కాబట్టి"** అంటూ తనదారి ఏదో చెబుతున్న ఉదారి నారాయణ దారిలో 'మళ్లీ మనిషిలోకి..' అంతా నడువాల్సిందే మరో గత్యంతరం లేదు.

❖ ❖ ❖ ❖ ❖

# విషాదాంత నవలా కావ్యం – జిగిరి

**డా. కె.యన్.వి.వి.యస్. నారాయణ మూర్తి,** అసోసియేట్ ప్రొఫెసర్, సిటీ కాలేజి. ఫోన్ : 98665 42365

జిగిరి నవలా రచనా కాలం 2000–2005 మధ్య ఆటా వారి నవలల పోటీలో మొదటి బహుమతి పొందిన తర్వాత, 'కబురు'. సాహిత్యం నేత్రం పత్రికలలో ముద్రణ పొందింది. జె.యల్.రెడ్డి గారి హిందీ అనువాదంతో, కేంద్ర సాహిత్య అకాడమీ వారి 'సమకాలీన సాహిత్య / భారతీయ' పత్రికలో అచ్చయ్యింది. ఇకవరుసగా పంజాబీలో మన్‌మోహన్‌సింగ్ అనువాదం, 'పంజాబ్ కహానీ'లో 'దర్వేషి' పేరుతో, శ్రీసాయినాథ్ పచారే గారి, మరాఠీ అనువాదం తరంగ పత్రికలో కలుమంగి కృష్ణమూర్తి గారి కన్నడ అనువాదం, నందితా మొహంతి గారి 'ఒరియా' అనువాదం 'సుధన్య' మాసపత్రికలో ప్రచురితం కాగా, నానీసుర్ అనువాదం బెంగాలీ భాషలో 2013లో ప్రచురితమయ్యింది. అంతర్జాతీయ స్థాయిలో ఆంగ్లంలో ఆచార్య పి.జయలక్ష్మి అనువాదం 'ఫ్రెండ్స్ ఫరెవర్' పేరుతో బహుళప్రచారంలోకి వచ్చింది. ఇక ప్రేంచంద్ పంకజ్ మైథిలీ భాషలో అనువాదం తర్వాత రాజ్‌కమల్ ప్రవేశన్‌వారు 2015లో హిందీలోకి అనువదించి ప్రచురించారు. మొత్తం మీద 'జిగిరి' పుట్టిన దశాబ్దకాలంలో పది భాషలలో వేలసంఖ్యలో పాఠకులకు చేరింది. ప్రాంతం, భాష, కాలం అనే మూడు హద్దురాళ్ళను చెరిపేసి సార్వకాలీన విలువను సమాజానికి ఆలోచనాత్మకంగా అందించింది.

పదిసంవత్సరాల కాలంలో పది భాషలలో పాఠకులను అలరించిన ఈ జిగిరి నవలలో ఏముంది అని జిజ్ఞాసను కలిగించడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

**కఠిన పదాలు :** జీవన విధానాల ఘర్షణ – ఆధునీకరణ నేపథ్యంలో అంతర్ధానం అవుతున్న కులవృత్తులు – ఎలుగుబంటి స్వభావం మచ్చిక – దస్సుమనడం – ప్రేమానుబంధం – గుడ్డేలుగు.

**జిగిరిలో ఏముంది?**

ఎలుగుబంటిని మచ్చిక చేసుకుని ఆటలాడించే ఒక బీదకుటుంబం, సమాజంలో అభివృద్ధిపేరిట మార్పులు, భూమిపై ఆశతో మనిషిలో పెరిగిన స్వార్థ బుద్ధి, జంతు సంరక్షణ పేరుతో ప్రభుత్వం విధించిన చట్టం చాటున, స్వార్థప్రజల వికృత క్రీడలు, చివరకు తరాల అంతరంతో చిన్నతరం వారి ప్రగతిశీల ఆలోచనలకు వృద్ధతరం తలవంచి, పాతవిలువలకు కట్టుబడి సమాజానికి దూరం కావడం అనే అంశాలను అతి సున్నితంగా రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ గారు చర్చించారు. నవల వెలువడి రెండు దశాబ్దాలు కావస్తున్నా, ఈ నవల ఇంకా నూతనంగానే ఉండడంలో రహస్యం ఏమిటంటే కథనంలో అంతస్సూత్రంగా ఉన్న విలువలు అంతర్ధానం కావడం అనే అంశం. ఎలుగుబంటిని ఆడించే వృత్తి అంతరించి చాలాకాలం అయ్యింది. అరవయ్యవవడి లేదా డెబ్బయ్యవవడి కాలంలో ఈ వృత్తిని కొనసాగించినవారిని చూచినవారిలో నేనూ ఉన్నాను. 1960 నుండి 70వ మధ్యకాలంలో తెలుగునాట నగరీకరణ అంతగా లేని నేపథ్యంలో గ్రామాల నుండి చుట్టుప్రక్కల ఉండే పేటలకు లేదా కాస్త పెద్ద గ్రామాలకు ఇలా, కోతులు, కొండముచ్చులు, పాములు ఆడిస్తూ విన్యాసాలు చేయిస్తూ పొట్టపోసుకునే సంచారజాతుల ఉనికి ఉండేది. గంగిరెద్లను, ఎలుగుబంట్లు కాస్త మానవ స్వభావానికి మచ్చికగా ఉండే ప్రాణులు కావడంతో, ఈ సంచారజాతుల వారు, తాము కూడా కొన్ని విన్యాసాలు చేస్తూ తమతోపాటు, తమ సంతానంతో సమానంగా పెంచుకున్న ఈ పెంపుడు జంతువులతో, తమ నైర్పుణ్యం కనిపించేలా, మాటలతో చూచే వారికి సమ్మోహనకరంగా, ఆశ్చర్య జనకమైన రీతిలో వాటిని ఆడించి, ఆ ప్రదర్శనను చూచినవారు ఇచ్చే దానధర్మాలతో తమ పొట్టపోసుకోవడంతోపాటు, కళాత్మక ప్రదర్శన చేసేవారు. అటువంటి కుటుంబాలలో ఒకటి ఇమాం కుటుంబం. ఈ కుటుంబం పెంచుకున్న గుడ్డేలుగు పేరు షాదుల్. ఇమాం కొడుకు చాంద్, ఈ వృత్తిని కొనసాగించడం కన్నా, రైతుగా మారి ప్రభుత్వం ఇచ్చే భూమితో జీవించడంలో ఎదుగుదల ఉంది అనే ఆలోచనతో, తన ఎదుగుదల కోసం షాదుల్‌ను చంపడానికి కూడా సిద్ధపడతాడు. ఇమాం భార్య బీబమ్మ, తన కొడుకు చాంద్‌తో సమానంగా మరోకొడుకుగా పెంచుకున్న షాదుల్‌ను, చాంద్ చంపే ప్రయత్నం చేస్తుంటే, కొడుకు మీద ప్రేమతో అంగీకరించి, తన వంతు సాయం చేస్తుంది. ఇది భరించలేని ఇమాం షాదుల్‌తో కలిసి షాదుల్‌తో కలిసి అడవుల్లోకి వెళ్ళిపోవడం కొసమెరుపు.

ఈ వృత్తి అంతరించి అయిదు దశాబ్దాల కాలం కావస్తున్నా, నేటికీ అడపాదడపా అక్కడక్కడా అల్పసంఖ్యాకంగా, చాలా అరుదుగా, ఆరిపోతున్న దీపం మినుక్కుమంటున్నట్లు, అక్షరాల ప్రేక్షకుల మధ్య, ఆలోచనల ఆటగా మిగిలింది.

**జిగిరి నవలాకావ్యం :**

నవల ఆవిర్భవించిన తొలినాళ్ళలో 'వచన ప్రబంధం', 'గద్య ప్రబంధం' అనే పిలుపులలో పురుడు పోసుకున్నప్పటికీ, క్రమంగా రంగరాయ, రాజశేఖర చరిత్రల ప్రభావాలు విడిచి, విశ్వనాథ, అడవి బాపిరాజు, చలం తదితరుల ప్రభంజనంలో తన రూపురేఖలను పూర్తిగా మార్చేసుకున్నది. ఆర్థికమాంద్యం, మధ్యతరగతి వర్గాలలోని మనస్తత్వ సంఘర్షణకు అద్దంపట్టిన నవలలను కొడవటి, గంటి

కుటుంబరావుగారు. గోపీచంద్ 'అసమర్థని జీవయాత్ర', మహీధర రామ్మోహనరావు గారి 'శుభలేఖ', రావిశాస్త్రి 'అల్పజీవి', రంగనాయకమ్మ 'బలిపీఠం', వాసిరెడ్డి సీతాదేవి 'మట్టిమనిషి', వట్టికోట ఆళ్వారు సామి 'ప్రజలమనిషి', బొల్లిముంత శివరామకృష్ణ 'మృత్యుంజయులు', దాశరథి 'చిల్లరదేవుళ్ళు', నవీన్ 'అంపశయ్య' ... ఇలా శతాధిక నవలల్లో ఏదీ తక్కువ కాదు. చలం 'మైదానాన్ని' ఎంతగా పాఠకులు ఆదరించారో, అంతే మక్కువతో విశ్వనాథ 'వేయిపడగల'కు గుడి కట్టారు. అయితే, అట్టడుగు వర్గాల వారి జీవనశైలిని అక్షరబద్ధం చేసిన నవలలు అల్పసంఖ్యాకమే అనాలి. ఈ నేపథ్యంలో డా॥ కేశవరెడ్డి గారి 'చివరిగుడిసె', సంచార గిరిజన తెగలకు చెందిన యానాదుల జీవితం గురించి, మిగతా జనాలతో పోటీపడలేని అశక్తత గురించి, వారు పొందే పీడన గురించి వివరిస్తుంది. చెంచుల జీవన నేపథ్యంలో సలీం రాసిన అడవిపూలు, బోయజంగయ్య జాతర, బి.యస్.రాములు 'బతుకుపోరు' తక్కువేమీ కావు. దళిత మూలాలను వెతికే ప్రయత్నంలో మూడు తరాలచరిత్రను అలాగే దళితుల్లో వచ్చిన సాంఘిక, సామాజిక మార్పుల్ని కావ్యం వలె మన ముందుకు వచ్చిన 'అంటరాని వసంతం', కల్యాణరావుగారి ఆధునిక 'నవలా మహాకావ్యం', 'కావ్యం యశసే, అర్థకృతే, వ్యవహారవిదే, శివేత రక్షతయే, సద్యః పరనిర్వృతయే, కాంతా సమ్మితయోపదేశయుజే' అనే మమ్మటుడి నిర్వచనం పద్యప్రకియకు మాత్రమే అని కాకుండా వచన ప్రక్రియకూ కూడా అనువర్తింపచేసే ఆలోచన చేస్తే ద్విసహస్ర కాలానంతరం గడిచిన ఈ పాతికేళ్ళ కాలంలో నిలిచే రెండు ఆధునిక నవలా మహాకార్యాలలో ఒకటి జిగిరి.

**పులిముగ్గ పోకడ :**

నవలా ప్రపంచంలో మహాభారత స్థాయికల వేయిపడగలను సృష్టించిన విశ్వనాథ రాసిన పురాణ వైర గ్రంథమాలలో ఎనిమిదవ నవల 'పులిముగ్గ'ను ఈ నవల కొంత జ్ఞాపకం చేస్తుంది. ఏ మాత్రం పోలికలేనప్పటికీ, విశ్వనాథగారు పులినడకలను, స్వభావాన్నీ ఎంత క్షుణ్ణంగా అధ్యయనం చేసి అక్షరరూపం ఇచ్చారో, అలాంటి నేర్పును ఎలుగుబంటిని ఇమాం పట్టుకున్నది మొదలుగా, చివరికి ఎలుగును అడవికి తోలుకుపోయే వరకు, ఈ నవలా రచయిత చూపారు. అతి తక్కువమందికి తెలిసిన జ్ఞానాన్ని అత్యధికులకు ఈ నవల తెచ్చింది అన్న. రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి గారి మాట అక్షరసత్యం. పాతకొత్తల మధ్య ఘర్షణ 'జిగిరి' అన్న పేరిట ముందుమాట రాసిన శ్రీరెడ్డి గారి మాటల్లో **"ప్రపంచీకరణయుగంలో ప్రకృతి ధ్వంసమైపోతున్న కాలంలో టీ.వీల ద్వారా మాత్రమే మృగాలను చూచేదశలో అశోక్‌కుమార్ ఈ జానపద జీవిత ప్రతిఫలాన్నీ మనకందించారు. అరణ్యాలకు దగ్గరగా ఉంటే తప్ప ఇలాంటి నవల రాయడం కష్టం."** అయితే ఈ విధమైన శిల్పవైచిత్రికి తొలి అడుగు విశ్వనాథదే.






**నిర్మాణశైలి :**

పొద్దు పొడిచింది, పొద్దుగూకింది... అంటూ ప్రారంభం అయిన నవల, తెల్లారింది, పొద్దుగూకింది, ఇమామ్ మాత్రం తిరిగిరాలేదు అని పూర్తి అవుతుంది.

**భాష :**

షాదుల్‌కు ఆకలేస్తే వీళ్ళకు పేగులు గుర్రుమనేవి. వీళ్ళు ఉప్పిడి ఉపాసమున్నా షాదుల్ కోసమైనా పొయ్యి వెలిగించవలసిందే! షాదుల్ ఎలుగ్గొడ్డు, జంతువు. ఇమామ్ మాత్రం మనిషి. జంతువు వెంట తిరిగే జంతువులాంటి మనిషి, పక్కీరోడు, తండ్రి పద్ధతిలోనే బతికినవాడు. ఉర్దూ పదాల వాడుకతో కొంత పాతకాలపు తెలంగాణా, హైదరాబాదీ శైలిలో ఉన్న భాష కారణంగా నవలకు విశేష బలం చేకూరింది.

**ఇతివృత్తం :**

ఇమామ్ భార్యపేరు బీబమ్మ. ఇమామ్ తండ్రి ఎలుగుబంటిని ఆడించే వృత్తిచేసేవాడు. అతడి అనంతరం ఇమామ్, తండ్రి వృత్తినే స్వీకరించాడు. బతుకుతెరువు కోసం, ఆ ఊరి రైతు చంద్రయ్య అడగడంతో అతడి పొలంలోపడి, అతడికి నష్టం కలిగిస్తున్న ఎలుగుబంట్లలో ఒక పిల్ల ఎలుగుబంటిని పట్టి, విద్యలు నేర్పించి ఇరవై సంవత్సరాలు, తన జీవితాన్ని గడుపుతాడు. ఈ క్రమంలో అతడికి భార్య బీబమ్మ, కొడుకు చాంద్‌లు సహకరిస్తారు. బీబమ్మ తన కన్న కొడుకుతో సమానంగా చిన్న ఎలుగుకు స్తన్యం ఇచ్చి పెంచుతుంది. ఆ ఎలుగు పేరు షాదుల్. తన కులంవాడైన ఎస్సై పొలం లేని వారికి పొలం ఇప్పించే విషయంలో ఇమామ్ కుటుంబానికి రావడం కోసం చేసిన కృషితో చాంద్‌లో కొత్త ఆశ చిగురిస్తుంది. ఈ ఊరి సర్పంచ్, అదే పొలంపై ఆశతో ఉన్న బుచ్చయ్య వైపు తిరగడంతో చాంద్‌లో ఆందోళన పెరుగుతుంది. దాంతో షాదుల్‌ను భూమిలో పాతిపెట్టి అయినా భూమి సంపాదించాలి అనుకుంటాడు. అంతకు ముందు షాదుల్‌ను అడవిలో

వదిలి వచ్చేసే ప్రయత్నం చేసినా, ఆ ఎలుగు తిరిగి గుడిసెకు రావడంతో ఇక చేసేదేమీ లేక ఎలుగును అంతం చేయడానికైనా సరే అని చాంద్ సిద్ధపడతాడు. లేదా తనకు తాను అంతం చేసుకోవడానికైనా సిద్ధంకావడంతో, ఇమామ్ ఒంటరి అయిపోతాడు. మనిషిని నమ్మిన జంతువు అమాయకంగా కనిపిస్తే, జంతువుతో జీవితం గడిపిన తెలివైన మనిషి మృగంలా మారిపోయాడు. చివరకు ఇమామ్ తాను బిడ్డ లాగా పెంచుకున్న షాదుల్‌ను మందుపెట్టి చంపలేక తానే అడవిలో కలిసిపోతాడు. పాతకొత్త తరాల అంతరం అంతస్సూత్రంగా, ఎదగాలి అలాగే ఆర్థికంగా స్థిరపడాలి అనే ఆశ, మానవ సంబంధాలపైన ఎలా ప్రభావం చూపిస్తుందనేదే ఈ నవలాకావ్య ఇతివృత్తం.

**ప్రశ్న :**

కాలక్రమంలో అనేక మార్పులు రచనాశిల్పంలో, పాత్రచిత్రీకరణ, భాషాప్రయోగం, ఇతివృత్తం ఎంపిక, ఇలా ప్రతి విషయంలో నవ్యత ప్రమాణాలను సాహిత్యం అక్షరబద్ధం చేస్తుంది. మానవుడు కూడా జంతువే కానీ తెలివైన జంతువు. అల్పాక్షరంలో అనల్పార్థ రచన వలె. ఈ తొంభై నాలుగు పేజీల నవలలో పదికన్నా తక్కువైన పాత్రలలో కొండంత ప్రశ్నను మన ముందు ఉంచాడు రచయిత.

రాచపాళెం మాటల్లో **'ఆకర్షణీయమైన ప్రారంభం, ఆసక్తి కొలిపే కొనసాగింపు, ఆశ్చర్యం గొలిపే ముగింపు'** అనే మూడు ముక్కల మలుపుల్లో నవల మన మనసుకు హత్తుకుపోతుంది.

**'కదంబం'**

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే

ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

**విమర్శ :**

పలుతావుల్లో హైదరాబాదీ మాండలిక పదజాలం పాఠకుడిని కొంత అయోమయంలో పడవేస్తుంది. కొన్నిచోట్ల ఈ పదజాలం కృతకంగా ఉంది. ఈ రోజుల్లో ఈ వృత్తి చేసేవారు లేరు. నేటి పాఠకులకు అవగాహన ఈ విషయంలో తక్కువ. నాలుగు పాత్రలతో నవల అంతా గడపడం ఏదో ఒక వ్యాసంలో ఉంటుంది అయినా ఒక కొత్త ప్రయోగమే అనాలి. 'నవలా సమయం'లో వేణుగోపాల్ గారు, పాఠకుడి చైతన్యాన్ని, అవగాహనను, సంస్కారాన్ని పెంచగలిగిన రచనా ప్రక్రియ నవల అంటారు. ఈ విషయంలో 'జిగిరి' వెనుకంజలో లేదు.

**కొసమెరుపు :**

మనిషితో సహవాసం చేసిన జంతువు, సాధువుగా, అమాయకంగా, ప్రేమతో ప్రవర్తిస్తూ, గోతిలో దూకకుండా ఆటలు భావించి, చివరకు గ్రహణశక్తితో విషయం అర్థమైనా చాంద్ మెడ కొరకకుండా వదిలేస్తుంది. తనను నమ్మిన ఇమామ్‌నే మనఃపూర్వకంగా విశ్వసిస్తుంది. మరోవైపు తన బతుకుతెరువు కోసం అడవి జంతువును పట్టి బంధించి, ముక్కుకు బెజ్జువేసిన మనిషి, తన అవసరాల కోసం తానే జంతువులా మారిపోయి, పాలుపోసి పెంచిన ప్రాణిని అంతం చేయడం కోసం సంసిద్ధుడౌతాడు.

ఎక్కడికి పోతున్నాం మనం? గుహల నుండి మహలు వరకు ప్రయాణించిన నాగరికత మళ్ళీ తిరుగు ప్రయాణం ప్రారంభించిందా? మనసు లోతుల్లోని సంఘర్షణను భరించలేని ఇమామ్ అడవి దారిపట్టినట్టు, పాతతరం ఇలా వెనుతిరిగి పోవలిసిందేనా? హృదయాన్నీ కదిలించి, ఆలోచింపజేసి, కంటనీరు తెప్పించే విషాదాంత ఆధునిక నవలాకావ్యం 'జిగిరి' రచయితకు తన జీవితకాలపు మిగిలిపోయే రచన ఇది. రెండు వేల ఒకటి నుండి రెండు వేల ఇరవై నాలుగు వరకు ఉన్న పాతికేళ్ళ నవలా చరిత్రలో మిగిలే ఏకైక నవల.

**ఆధార గ్రంథాలు :**

1) అశోక్‌కుమార్ పెద్దింటి, జిగిరి, నవచేతన పబ్లిషింగ్ హౌస్, 2017

2) కమలాకర శర్మ సాగి (సం); కదంబం, మూసీ పబ్లికేషన్స్, 2014

3) వేణుగోపాల్.ఎన్; నవలా సమయం, స్వేచ్ఛాసాహితి, 2020

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 4  హైదరాబాద్ ఫిబ్రవరి : 2025

# 2025 ఆకాశవాణి "సర్వభాషా కవి సమ్మేళనం" సమీక్ష

**అయినంపూడి శ్రీలక్ష్మి** ఫోన్ : 998 992 8562

కవిత్వం ఎదలో కదలుతుంది - పదంలో మెదులుతుంది. అభ్యుదయాన్ని అందిస్తుంది అంటారంతా. **'కవిత్వం భూత, భవితల మధ్య ట్రాన్స్‌పరెంట్ పరదా'** అని 'పరదా' వారు కూడా నొక్కి వక్కాణించారు. బుద్ధిజీవుల ఆలోచనల సమాహారం కవిత్వంగా రూపొందింపబడి రేపటి ఆరోగ్యకర సమాజానికి దిశానిర్దేశకులుగా కవులు - దశా నిర్వహణలో కవిత్వం ప్రథమ స్థాయిలో నిలబడుతున్నది జగమెరిగిన సత్యమే.

కవిసమ్మేళనాలు ఎన్ని జరిగినా ఆకాశవాణి సర్వభాషాకవి సమ్మేళనం ప్రత్యేకత మాత్రం దానిదే. భాషా సామరస్యానికి, జాతీయ సమగ్రతకు పట్టం కడుతూ 1956 నుండి దాదాపుగా ప్రతి సంవత్సరం 69 ఏళ్ళుగా భాతరదేశంలోని ప్రతి రాష్ట్రంనుండి ఒక కవితను ఎంపిక చేసి 23మంది కవులను పిలిపించుకుని 22భాషల్లో (హిందీలో రెండు కవితలు) ఆ కవితలన్నిటిని ప్రతిరాష్ట్రంలోని జోనల్ ఆకాశవాణి కేంద్రంనుండి ఆ రాష్ట్ర అధికార భాషలోకి అనువదించి అందించటం వల్ల భాషా సౌందర్యమే కాక భావ సౌందర్యం... ఏ ఏ రాష్ట్రాల్లో సాహిత్యకారులు ఎలాంటి ఆలోచనలలో వున్నారో... ఎలాంటి సాహిత్య సృజన జరుగుతుందో తెలుస్తుంది. ఇంత విస్తార మాధ్యమ వ్యవస్థ... ఇంత గొప్ప అనుసరణ, ఆదరణ, వైవిధ్యత కల్గిన మాధ్యమం మరొటి లేదని చెప్పటంలో అతిశయోక్తి లేదు. అంతేకాకుండా 23మంది భాషాకవులను ఒకే వేదిక మీద ఆసీనులను చేసి ఒక బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించి దాన్ని ప్రతిసంవత్సరం జనవరి 25వ తేది రాత్రి 10 గంటలకు ప్రసారం చేస్తుంది ఆకాశవాణి ఢిల్లీ కేంద్రం. ప్రతి రాష్ట్రంలోని జోనల్ ఆకాశవాణి కేంద్రం అనువదించి అందిస్తుంది. ఈ భాషా రూపాంతీకరణలు విన్పించదానికి ప్రతి కేంద్ర ఆకాశవాణి విభాగాలు దాదాపు నెల రోజుల కష్టపడ్తాయి. ప్రతి సంవత్సరం తను కేంద్రాల్లో విన్నించిన కవిల్లోని ఉత్తమ కవితల్ని ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే ప్రాంతీయ మీటింగుల్లో ఎంపిక చేసి నవంబర్, డిసెంబర్ నెలల్లో ఉత్తమ కవితను ఎంపిక చేసి ఆ కవితను రాసిన కవిని ఉత్తమ కవిగా పేర్కొంటాయి. ఈ ఏడాది తెలుగు భాషనుండి ఈ సర్వభాష కవిసమ్మేళనానికి వెళ్ళిన జాతీయకవి డా. ఏనుగు నర్సింహరెడ్డిగారు. సుసంపన్నమైన భారతీయ భాషా సౌందర్యానికి దృష్టాంతంగా నిలిచే ఈ సర్వభాషా కవిసమ్మేళనం జనవరి నెల 17వ తేది హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో ఘనంగా నిర్వహింపబడింది.

ఈ కార్యక్రమానికి ఆకాశవాణి కార్యక్రమ విభాగాధిపతిగా సుంకపాలి రమేశ్‌గారు, న్యూస్ విభాగ అధిపతిగా మహేష్ విచ్చేశారు. ముఖ్య అతిథిగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆకాశవాణి




కేంద్ర అధిపతి హరిసింగ్ గారు కార్యనిర్వాహకునిగా వ్యవహరించారు అవధానుల శ్రీహరిగారు, వ్యాఖ్యాత్రిగా నిభానుపూడి శ్రీవాణి చక్కగా సంభాషించారు. ఈ కవిసమ్మేళనంలో-

డా. అమ్మంగి వేణుగోపాల్, డా. మామిడి హరికృష్ణ, దర్భశయనం శ్రీనివాసాచార్యులు, మహెజబీన్, జింబో (మంగారి రాజేందర్), యార్లగడ్డ రాఘవేంద్రరావు, మందలపర్తి కిశోర్, ఆర్. అనంత పద్మనాభరావు, సమ్మెట నాగమల్లేశ్వరరావు, తాడేపల్లి పతంజలి, కొలకలూరి ఇనాక్, యాకూబ్, వై. ముకుందరామారావు, డా. శరత్ జ్యోత్సరాణి, డా. నందిని సిధారెడ్డి, శిఖామణి, శిలాలోలిత, సుధామ, డా. సి. భవానీదేవి, డా. నాళేశ్వరం శంకరం, సుమనస్పతిరెడ్డి, అయినంపూడి శ్రీలక్ష్మితో పాటు తెలుగు కవి డా. ఏనుగు నర్సింహరెడ్డి గార్లు పాల్గొన్నారు.

కార్యక్రమానికి స్వాగతం పలుకుతూ ఈ కవిసమ్మేళన కార్యక్రమ నిర్వహణ కర్త ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ అవధానుల శ్రీహరి **"ఇదొక అద్భుత సమ్మేళనం. భిన్నత్వంలో ఏకత్వ సాధన దిశగా పయనిస్తున్న జాతి ఔన్నత్యాన్ని ప్రపంచ సాహితీ పిపాసులకు ప్రతి సంవత్సరం వీనుల విందుగా సమర్పిస్తుంది ఈ సర్వభాషా కవిసమ్మేళనం"** అంటూ కవులందరినీ సాదరంగా ఆహ్వానించారు. ఆకాశవాణి వార్తా విభాగాధిపతి ఎస్.మహేశ్‌గారు మాట్లాడుతూ **ఇంత గొప్ప కవులందరినీ ఒక చోట చూడటం ఆనందంగా వుందని... భారతదేశ కవిత్వ పోకడలు ఈ సర్వభాషా కవి సమ్మేళనం ద్వారా ద్యోతక మవుతా**యని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ విశిష్టతను అందిస్తూ ప్రోగ్రామింగ్ అధిపతి రమేష్ సుంకసారి గారు **'గత 69 సంవత్సరాలుగా నిర్వహింపబడుతున్న ఈ నేషనల్ సింపోజియం ఆఫ్ పోయెట్స్ కార్యక్రమం ఆకాశవాణి కార్యక్రమాల్లోనే తలమానికమైన కార్యక్రమం'**గా కొనియాడారు. సాహిత్యకారులు టూల్స్ బేరర్స్ లాంటి వారంటూ సమాజానికి దిశానిర్దేశం జేసేది వారేనంటూ ఈ సర్వభాషా కవిసమ్మేళనం అందించే సందేశం ఒకటేనంటూ అదే 'భారతీయాత్మ'




అని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆశాశవాణి కేంద్ర అధిపతి హరిసింగ్ గారు **'సాహిత్యం సమాజం హితం కోరుతుందని ఎక్కడ మెరుగైన సాహిత్య సృష్టి జరుగుతుందో అక్కడ మేలైన సమాజం నిర్మాణం'** అవుతుందన్నారు.

ముందుగా ఈ ఏడాది జాతీయ తెలుగు కవిగా ఎంపికైన డా. ఏనుగు నర్సింహారెడ్డి గారి కవితతో ఈ సమ్మేళనాన్ని మొదలుపెట్టటం ఔచిత్యవంతంగా అన్పించింది. 1968లో జన్మించిన ఈ కవి సమాంతర స్వప్నం, నేనే,



మట్టిపాట, కొత్తపలక, హైదరాబాద్ విషాదం, మూల మలుపు, అంతరంగం, తెలుగు రాష్ట్రాల రెవిన్యూ వ్యవస్థ, నిన్నకడు రేపు, సమాహార బాల్యం, తెలుగు, హిందీ జాతీయోద్యమ గేయాలు, అసఫ్‌జాహీ సంస్థాన విలీనం, పూలపూలవాన, ఊహల వేదిక, ఏడుకోలల బాయి వంటి పుస్తకాలు రాశారు. తెలుగు విశ్వవిద్యాలయ సాహిత్య పురస్కారంతో పాటు రంజని కుందుర్తి, వర్కింగ్ జర్నలిస్ట్ కవిత్వ బహుమతి, నవతెలంగాణ ఆళ్వారుస్వామి ఉత్తమ కవితా పురస్కారం, నాగభైరవ సాహిత్య పురస్కారం, సృజన భావరి, తెలంగాణ రుబాయిలకు గిడుగు రామ్మూర్తి పురస్కారం లాంటి ఎన్నో పురస్కారాలను పొందారు. 3,4 అనువాదాలు, 5,6 సంపాదకీయాలు వీరి నిర్వహణలో వచ్చాయి. ఈ కవి మీద 5,6 పుస్తకాలు కూడా వెలువడడం విశేషంగా చెప్పుకోవాలి.

తన కవిత **ఇంద్ర ధనుస్సులు**

**1. నిజమే వాళ్ళలో కొన్ని ఇంద్ర ధనుస్సులు**
**మనలోని ఎండాకాలపు నింగికి నచ్చవు**
**నిత్యాహంకారపు నీలాకాశము**
**నిజం పూలహారాన్ని**
**కొంచెం నికరంగా గమనించు**
**మన తూటా మాట, చూపు, వక్రత**
**నడత, మడత, కోపం, లోపం**
**ఏదీ వాళ్ళకి ఎవరికీ నచ్చదు'** అంటారు.

సంస్కృత కవి డా. యువరాజ్ భట్రాయ్ కవితను తెలుగీకరించి మనకందిస్తు డా. ఆర్.ఏ. పద్మనాభరావుగారు **సురభారతి ఇది దేవునికి సమర్పించే హారతి** అంటూ దైవభాష యొక్క గొప్పతనాన్ని ఆవిష్కరించారు.

**విశ్వమానవ దివ్వ ప్రేమైక జీవన**
**భాషాభిమాన విశేషగీతి**
**శబ్దకోశాది విశాల భావజగతి**
**ముల్లోక సుజన సమ్మోహితంలో..."** అంటారు.

అస్సామీకవి రాజుల్ బరుయా రాసిన కవితను డా. అమ్మంగి వేణుగోపాల్ గారు తెలుగులోకి అనువదించారు. చూసే కనులలో అందాన్ని కొలువలేము ఎన్నెన్నో అక్షరాలున్నా అందాన్ని కొనియాడ లేము. **'సౌందర్యం'** పదాలలో ఒదగనిది... మనస్సులోనే దాన్ని దర్శించగలం అంటూ అక్షర శరాన్ని సంధించారు.

**'కన్నతల్లి చనుబాలు కడుపు నిండా తాగినప్పుడు**
**పాపాయి నిదురమత్తులో**
**అమాయక అందం మనల్ని పలకరిస్తుంది'** అని పేర్కొన్నారు.

ఒరియా కవి డా. గౌతం జినా రాసిన కవితను డా. శరత్ జ్యోత్స్నరాణి గారు **'చిత్రపటం'** పేరుతో సభికులను అలరించారు.

**ప్రపంచ చిత్రపటంలోని గజి బిజి గీతల్లో**
**నేను భారతదేశం కోసం వెతుకుతున్నాను**
**ఆపాద మస్తకం కాంతులీనుతూ**
**అది అద్భుతంగా కనిపించింది'**

ఉర్దూ కవి అహ్మద్ వాసి రాసిన కవితను **'పలుకు సుగంధం'** పేరిట విన్పించారు కవి యాకూబ్ గారు–

**"వారు మాట్లాడితే ప్రతి పలుకులో సుగంధం**
**ఉర్దూ తెలిసిన వారే ఇలా పలుకుతారు**
**శిథిల సమాధులపై కాంతి రంగుల శోభ**
**పగలు సీతాకోక చిలుకలు, రాత్రి మిణుగురులు"** అంటారు.

కన్నడకవి నిజ లింగప్ప మత్తిహల్ గారు రాసిన కవితలను కళ్యాణ పథంగా కమనీయంగా విన్పిస్తూ నందిని సిధారెడ్డిగారు–

**"బలకాలమైనా, కానికాలమైనా**
**కలిమి కరువూ కాటకాలుగా**
**కలిసి పంచుకొని జీవించే ఒప్పందమే శరణ సంగమసారం'** అంటారు.

**జీవనరాగం** పేరుతో తాడేపల్లి పతంజలి గారు కొంకణికవి రాజశ్రీ కవితను అనువదించి అందించారు.

**"పలకరించును నిశ్శబ్ద భాషతోడ**
**శాంత గుణము బోధించు జనులనెడ**
**విశ్వము తుది వరకు నిల్చి వెలుగు జిమ్ము**
**చెట్టుకు నమస్కరింతు నా చిత్తమందు"** అంటారు.

ప్రొ. షాద్ రంజాన్ రాసిన కశ్మీరీ కవితను మహెజబీన్ గారు **'గేయమొకటి రాయాలని వుంది'** పేరుతో అనువదించారు.

**గేయం ఒకటి రాయాలని**
**జీవితం అమరమైపోయే గేయమొకటి రాయాలని**
**అనుకొంటున్నాను**
**ఆ గేయం విని చంద్రవంక**
**నా ఇంటి ఆవరణలో**
**నృత్యం చేయాలి"** అంటారు.

బిజమ్ సింఘా రాసిన బెంగాలీ కవితను **'జ్ఞాపకాలు'**గా పంచుకున్నారు వై. ముకుంద రామారావు గారు.

**"జ్ఞాపకాల నుంచే వ్యధను జత చేసుకుంటావు.**
**మాతృవృక్షం నీడ**
**మనసు మైదానంలో విస్తరించాలని ప్రయత్నిస్తుంది"** అంటారు.

మనైనోశ్రీ దైమరి భోడోకవి రాసిన కవితను విన్పించారు సుమనస్పతిరెడ్డి గారు. శీర్షిక **'నా కోసం నేను ఒకసారి చావదలుచుకున్న'** పరవాలేదు.

**"నేను మళ్ళీ మనిషిగా కొత్త జన్మనెత్త లేక పోయినా**
**ఒక్కమారు నాకున్నదల్లా నాకు నేను ఇచ్చుకోగలిగిన సామర్థ్యం**
**నాకుంటే అప్పుడు చచ్చి పోతాను సంతోషంగా నేను"** అంటారు

మణిపురి కవి టంగ్ బ్రమ్ అమరజిత్ సింగ్ రాసిన కవితను




తెలుగులోకి అనువదించారు డా. మామిడి హరికృష్ణగారు. **'ఓ నావకథగా'** అనువదించారు.

**"ఒక చెట్టుకథ ప్రతిధ్వనించగానే మరెన్నో కథలు 'విను' మరుగు అవుతాయి**
**పడవలూ అంత వాటి వయసు పెరుగుతున్నా కొద్దీ**
**అవి ధ్వంసం అవతాయి పగుళ్ళు బారతాయి**
**ఇంత జరిగిన కాలాతీతంగా నోహా నావమాత్రం సంచరిస్తూనే వుంది"** అంటారు

**'పావురం ఎగిరింది'** అంటూ డా. అమలేందు శేఖర్ పాలిక్ రాసిన మైథిలీ కవితను తెలుగులో విన్పించారు అయినంపూడి శ్రీలక్ష్మిగారు.

**నేడు ఆ పావురం శిఖరాగ్రంపై గర్వంగా నిల్చుని నిర్భయంగా గర్జిస్తుంది.**
**పావురం కువకువ ఇప్పుడు ప్రపంచమంతా ప్రతిధ్వనిస్తుంది"** అంటారు.

డోంగ్రి కవి బల్వాన్ సింగ్ జమోరియా రాసిన కవితను **దేశమంటే మహాప్రీతి** అంటూ దర్భశయనం శ్రీనివాసాచార్యులు అనువదించారు.

**"ఎవరిలోనూ వైరాన్ని ఇచ్చగించడం లేదు**
**సజ్జనులమై సాధుత్వంలో సాగుతూ వున్నాం**
**అవును ఎవరైనా ఎదురుపడి సవాలు చేస్తే మాత్రం**
**మనకంటే వాళ్ళకి తప్పక చూపించి తీరుతాం**
**మనదేశమంటే మనకు మహాప్రీతి**
**దానికోసం మనం ప్రాణాలైనా ఒడ్డుతాం"**

ఎస్.ఖురతన్ రాసి తమిళ కవితను చెమట చుక్కలు పురుతో విన్పించారు డా. నాళేశ్వరం శంకరం గారు.

**కేవలం శ్రమలోనే కాదు**
**రెండు శరీరాల ప్రయాసానంతరం నేను ఉత్పన్నమయ్యాను**
**ఎంతోమంది భయం వణుకులోను నేను కనిపిస్తాను**
**ఎందుకంటే మేం చెమట చుక్కలం**
**మా కారణంగా చెమట భూమ్మీద పడితేనే**

**తిండిగింజల ముత్యాల పంటలు పండగలవు"** అంటారు.

**'జ్ఞానమిచ్చే బోధిచెట్టు'** పేరుతో దల్‌సింగ్ అఖీలా రాసిన నేపాలి కవితకు కొషోర్ మందలపర్తి గారు సభికులకు విన్పించారు.

**బహుశా అందువల్లనే కావచ్చు**
**భూగోళం ఇలా మండిపడుతుంది మనమీద**
**మమ్మల్ని ఉద్ధరించటానికి మరో బుద్ధుణ్ణి పంపించు స్వామీ**
**అని ఆ భగవంతుణ్ణిలా వేడుకోగలం మనం?**

సామ్రాట్ ఘుగన్ రాసిన పంజాబీ కవితను **కవి సుర్జీత్‌గా** మార్చి తెలుగులో విన్పించారు శిఖామణిగారు

**"కాగితాల నదుల గుండా తీర్థయాత్రలు చేస్తాడు**
**తన అతీంద్రియ శక్తితో శబ్దాలను సార్థకం చేస్తాడు**
**కవి ప్రతిష్ఠ కోసం నేను ప్రార్థనలు చేస్తాను**
**నేనే కవినయ్యేందుకు ప్రయత్నాలు మొదలుపెడతాను"** అంటారు.

మాధవన్ పురే చెర్రిగారు మలయాళంలో రాసిన కవితను సుధామగారు **'ఊపిరాడక'** అంటూ తెలుగులోకి మార్చారు.

**"నాలుగు ఎనిమిది వరుసలు**
**పొడుగాటి రోడ్లు వేగంగా విస్తరిస్తున్నాయి**
**ఇక నిలబడేందుకు, పడుకునేందుకు**
**ఈ భూమి మీద చోటేది మిగిలేలా లేదు"**

సుజాత కౌరు రాసిన మరాఠీ కవితను **'స్త్రీనది'** గా మార్చి అందించారు తెలుగు సేత ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు...

**"తనలో ప్రతిబింబిస్తున్న ఆకాశాన్ని ఆడిస్తూ**
**అంతరంగ మణులతో సూర్యుణ్ణి వెల్గిస్తూ**
**గాలి అలలతో నీటి తరంగాలను ఊగిస్తూ**
**ఫల వనాలకు ప్రాణమూదే ఆమే నది"** అంటారు.

శిలాలోలిత గారు సింధీ కవితను తెలుగీకరించారు. సింధీకవి కన్యోశివాణి కవిత. శీర్షిక **హేమం కలాని.**


# మూసీ

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక**
**మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి**
**వెంటనే శాశ్వత చందాదారులు కండి.**
**సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక**
**పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక**
**యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక**
**శాశ్వత సభ్యత్వం (10 సంగలు)... 2500/-**
**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**


**మాతృభూమి గురించి గీతాలాలపిస్తూ**
**ఉరితాడుని పెదాలతో ముద్దాడే వాడిని**
**దేశస్వాతంత్ర్యం కోసం ఒక జెండాను నేనూ ఎత్తేవాడిని"**
అంటారు.

సంతాలీ కవి అనలె హెమ్ బ్రామ్ రాసిన కవితను అనువదించి అందించినకవి జింబో గారు. శీర్షిక **నా కోసం వెతకకు**

**'నా కోసం మందిరాల దగ్గర, మసీదుల నడుమ,**
**చర్చ్‌ల వద్ద, బలిపీఠాల మీద వెతకకు**
**ఆ అన్వేషణలో నువ్వు విశీథిలో కలిసిపోతావ్'** అంటారు

**తుపాకీ తూటా** గా గుజరాతీ కవితను అనువదించారు యార్లగడ్డ రాఘవేంద్రరావు గారు. గుజరాతీకవి కృష్ణదవే.

**విస్ఫోటించడమే మన లలాట లిఖితమైననప్పుడు**
**విస్ఫోటిస్తూనే మనం**
**ఈ సోయగాల పుడమి నిండా పుష్పధారలై ఎందుకు విరజిమ్మ కూడదూ"** అంటూ ప్రశ్నించారు.

**ముంబై నగరం** పేరుతో అనువదించారు. డా. సి. భవానీ గారు హిందీ కవి దిలీప్ యెవ్రా రాసిన కవితను.

**"భజనలతో ప్రతిధ్వనించే ముంబాదేవి ప్రాంగణం**
**ఆధ్యాత్మికతలో మునిగిని పాలరాతి ఇస్కాన్**
**అన్ని ఆకాంక్షలూ ఇక్కడి కొచ్చి సంపూర్ణమవుతాయి**
**కొత్త ఆశలు చిగురిస్తాయి. ఈ ప్రదేశం కేవలం నగరం కాదు**
**యువభారత స్వప్నాల ముఖ్యకేంద్ర ఇది ముంబై నగరం** అన్నారు.

**హృదయ ప్రకాశం** పేరుతో మరో హిందీ కవితను తెలుగులోకి మార్చి విన్పించారు సమ్మెట నాగమల్లీశ్వరరావు గారు.

**"మొట్టమొదలుగా ఇవాళ నేను మౌనం దుప్పటినొకటి నేతనేశాను**
**తెంపగలరేమో చూద్దాం**
**ఎవరైనా ఒక్క పోగునైనా..."** అంటారు.

కవులందరిని ఆకాశవాణి కార్యనిర్వహణ సిబ్బంది దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన అందరికీ ధన్యవాదాలు చెప్తూ వందన సమర్పణ గాలించారు కార్యవర్ధి గోపెశెట్టి. ఆకాశవాణి అనునిత్యం ప్రవచించే "బహుజన హితాయ బహుజన సుఖాయ" సందేశం కవితాకృతులుగా కదిలొచ్చిన భావన కన్పించింది. ప్రేక్షకులందరిలో నవచైతన్యం కదిలొచ్చింది. చివరి వరకూ కవులందరూ అందరి కవితల్ని విని స్పందించటంతో పాటు అభినందనల చప్పట్లతో ఉత్సాహపరిచారు. అత్యంత క్రమశిక్షణగా, పూర్తి సాహిత్య వాతావరణంలో జరిగిన ఈ సర్వభాషా కవిసమ్మేళనం విజయవంతంగా ముగిసింది.

❖ ❖ ❖ ❖ ❖






## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,
బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట,
హైదరాబాద్-500013.

చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com




**దేవులపల్లి రామానుజరావు గారి జీవితం - రచనలు**
డి. నారాయణ రావు
వెల : 200/-
**ప్రతులకు :** రచయిత, ఇం.నెం. 4-1-480/2/2, ఎ.పి.హెచ్.బి. కాలనీ, ఫేజ్ - 2, రాఘవేంద్ర స్వామి దేవాలయం ప్రక్కన, వికారాబాద్ - 501 101.
ఫోన్ : 94911 23138




**శ్రీ లక్ష్మీ నృసింహస్తోత్ర వైజయంతి**
రచన : మధురకవి ఆచార్య శ్రీవత్స
వెల : 342/-
**ప్రతులకు :** శ్రీమతి పి. రమాదేవి
5-98, వేపమాను వీధి,
తిరుచానూరు పోస్టు - 517 503
ఫోన్ : 99890 33696




**పదార్థం (సాహిత్య వ్యాసాలు)**
డా. బెల్లి యాదయ్య
వెల : 350/-
**ప్రతులకు :** 'శ్రీకృతి' 6-2-330, ఎన్.జి.కళాశాల వెనుక, శ్రీనగర్ కాలనీ, నల్గొండ - 508 101
ఫోన్ : 994 960 9280




**శంకరమంచీయం**
**(డా. శంకరమంచి శ్యాంప్రసాద్ అభినందన సంచిక)**
సంపా. పల్లెర్ల రామమోహన రావు
వెల : అమూల్యం
**ప్రతులకు :** ఎస్. సాయి సృజన్,
ఇం.నెం. 20-46/4/6, సాయికృష్ణ కాలనీ,
పీర్జాదిగూడ, ఉప్పల్, హైదరాబాద్ - 39.




**60 శరత్తులు**
మాడభూషి సంపత్ కుమార్
వెల : 150 /-
**ప్రతులకు :** పాలపిట్ట బుక్స్,
16-11-20/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాద్ - 500 036. ఫోన్ : 94440 75128




**చిద్విలాస శతకము**
కటకం విజయలక్ష్మి శర్మ
**ప్రతులకు :** కటకం విజయలక్ష్మీ శర్మ
కమలా శంకర నిలయం, 2-360,
హెచ్ ఎమ్ టి స్వర్ణపురి కాలనీ,
మియాపూర్, హైదరాబాద్ - 500 049.
ఫోన్ : 94911 88809




**రేపటి మైదానం**
డా. ఎన్. గోపి
వెల : 200 /-
**ప్రతులకు :** ఎన్. అరుణ, ఇం.నెం. 13-1/బి,
శ్రీనివాస పురం, రామంతాపూర్,
హైదరాబాద్ - 500 013.
ఫోన్ : 939 102 8496




**చేతనాశిల్పం (కవిత్వం)**
ధూళిపాళ అరుణ
వెల : 150/-
**ప్రతులకు :** ధూళిపాళ దత్తాత్రేయ శర్మ
హరిహర త్రిశక్తి క్షేత్రం,
వలిగొండ, యాదాద్రిజిల్లా.
ఫోన్ : 9000998850

# మనుషులు కూడా కాయలు కాస్తారు









లోగడ బోయీల భుజాలు
పల్లకీలను మోసీ మోసీ కాయల్ని కాసాయి

గతంలో దొరవారి కచ్చురాల ముందు
ఉరికిన చాకళ్ళ అరికాళ్ళు కాయల్ని కాసాయి

మార్కెట్ యార్డులోనో
బడికి వెళ్ళేటప్పుడో వచ్చేటప్పుడో
బస్తాలు మోసే వీపులు
ఇప్పటికీ కాయల్ని కాస్తున్నాయి

ఈ ప్రపంచానికి ఇంత తిండి పెట్టేందుకు
పలుగూ పారా నాగలీ
పట్టుకున్న చేతులేనాటి నుంచో
ఎన్నో కాయల్ని కాస్తున్నాయి.

ఎండలో బండల్ని
బద్దలు కొడుతున్న ఒడ్డెరల
అరచేతులు కాయల్ని కాస్తున్నాయి

ఈ లోకం బాగుపడటం
ఎప్పుడెప్పుడా అనుకుంటూ
అనుక్షణం ఎదురుతెన్నులు చూస్తోన్న
ఆదర్శవాదుల కన్నులు కూడా
కాయల్ని కాస్తున్నాయి

ఏది ఏమైనా
ఏనాటికో ఒకనాటికి
ఎట్టి పరిస్థితుల్లోనైనా
మానవత్వపు తల్లి కడుపున తన బాధ్యతగా
ఓ మంచితనపు కాయను తప్పక కాస్తుంది.

**డా. నలిమెల భాస్కర్**
ఫోన్ : 97043 74081

# ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం

**మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?**

అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?

సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో &సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.

7416 106 106
www.ferty9.com

**మీరు తీసుకునే
ప్రతి నిర్ణయానికి
మా ప్రేమ, సేవ
అంకిత భావం మీకు
తోడుగా ఉంటుంది.**

IUI | IVF | ICSI | IMSI | HSG



ఫర్టీ 9 హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం
మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...

విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్


Scanned with OKEN Scanner